ప్రతిపక్షం

www.prathipaksham.in

శుక్రవారం 30.01.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 310 పేజీలు:10 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

యూపీపై ఘన విజయం... ఫైనల్‌లో ఆర్సీబీ 10

మధ్య చిలుకలగుట్ట నుండి సమ్మక్క తల్లిని తీసుకువస్తున్న పూజారులు

గాల్లోకి కాల్పులు జరిపి అధికారికంగా సమ్మక్కకు స్వాగతం పలుకుతున్న జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్

వెన్నెల వెలుగుల్లో మెరిసిన మేడారం

గద్దెపైకి చేరిన సమ్మక్క తల్లి.. మహా జాతరలో ప్రధాన ఘట్టం ఆవిష్కరణ

- తల్లి ఆగమనం వేళ ఘనంగా ఎదుర్కోళ్లు
- భక్తుల పూనకాల నడుమ ఊగిన మేడారం
- గౌరవ సూచకంగా గాల్లోకి ఎస్పీ కాల్పులు
- భక్తులతో కిక్కిరిసిన గద్దెలు, పరిసర ప్రాంతాలు
- జనసంద్రాన్ని తలపిస్తున్న వనదేవతల ప్రాంగణం
- పుష్కారాలను తలపిస్తున్న జంపన్న వాగు

ప్రతిపక్షం, మేడారం, హన్మకొండ

జనవరి 29: భక్తుల పూనకాల నడుమ మేడారం ఊగిపోయింది. మహా జాతర మహాఘట్టం ఆవిష్కృతమైంది. చిలుకలగుట్ట నుంచి సమ్మక్క తల్లి గద్దె చేరింది. అశేష భక్తజనం జయధ్వానాల మధ్య సమ్మక్క తల్లి గురువారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో గద్దెపైకి చేరుకున్నారు. జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ గాల్లోకి కాల్పులు జరిపి అధికారికంగా సమ్మక్కకు స్వాగతం పలికారు. దీంతో మేడారం మహాజాతర పతాకస్థాయికి చేరింది. చిలుకలగుట్ట వద్ద కుంకుమ భరిణి రూపంలో ఉన్న సమ్మక్క తల్లికి ముందుగా ప్రధాన పూజారులు కొక్కెర కృష్ణయ్య, ఇతర పూజారులు ముత్యాల సత్యం, సిద్దబోయిన మునిందర్, సిద్దబోయిన బొక్కన్న, కొమ్ము స్వామి, కొమ్ము జనార్దన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర మంత్రులు దనసరి అనసూయ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ దివకర టీఎస్, జిల్లా ఎస్పీ సుధీర్ రాంనథ్ కేకన్ గిరిజన సంప్రదాయాలతో పూజలు నిర్వహించారు. అనంతరం మూడంచెల భద్రత మధ్య గన్ ఫైరింగ్ తో చిలకల గుట్ట లో రాత్రి 6.55 గంటలకు మేడారానికు సమ్మక్క తల్లి బయలు దేరింది. తల్లి ఆగమనం వేళ భక్తులు ఘనంగా ఎదుర్కోళ్లు పలికారు. గురువారం రాత్రి మేడారం గద్దెలపై సమ్మక్క తల్లి కొలువు దీరింది. మేడారం మహా జాతరలో ప్రధాన ఘట్టం

...:: మిగతా 2లో

అమెరికాకు మరో షాక్

మిత్రదేశాలు మెల్లమెల్లగా అమెరికాకు దూరమవుతున్నట్లుగా కనిపిస్తోంది. మొన్నటికి మొన్న భారతదేశంతో యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చేసుకుంది.

9

అజిత్ పవార్‌కు కన్నీటి వీడ్కోలు

'అజిత్ దాదా అమర్ రహే' నినాదాల మధ్య ఎన్సీపీ అధినేత, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్‌కు అభిమానులు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు కన్నీటి వీడ్కోలు పలికారు. అంతకుముందు అజిత్ దాదా కడసారి చూపు కోసం బారామతిలోని ఆయన గృహం వద్ద అభిమానులు క్యూ కట్టారు.

9

కులగణన పేరుతో బీసీల హక్కులపై దాడి

56 శాతం బీసీలను 'అదర్స్'లో మాయం చేసే కుట్ర

- జనగణనలో బీసీలకు స్థానం ఎక్కడ?
- 4 వేల కులాలు.. ఒకే కాలమ్?
- జాగృతి రౌండ్ టేబుల్‌లో తెలంగాణ జాగృతి కల్వకుంట్ల కవిత ఫైర్

చిటుకుల మైసారెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 29: దేశ జనాభాలో 56 శాతం ఉన్న బీసీలను కులగణనలో గుర్తించకుండా "అదర్స్" అనే ఒక్క కాలమ్‌లో కలిపివేయాలనే కుట్ర జరుగుతోందని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో కులగణన డాక్యుమెంట్‌పై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. హైదరాబాద్, బంజారాహిల్స్ ఖాజా మాన్షన్ వేదికగా జాగృతి ఆధ్వర్యంలో జాతీయ జనగణన-కులగణన సమగ్ర చర్చ

...:: మిగతా 2లో

కేసీఆర్‌కు సిట్ నోటీసులు

- పీఎస్‌కు రావాల్సిన అవసరం లేదు
- విచారణకు అనువైన ప్రాంతం తెలపండి
- నందినగర్‌కు వెళ్లి నోటీసులు ఇచ్చిన అధికారులు
- ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, జనవరి 29: ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. హైదరాబాద్‌నందినగర్‌లో ఉన్న ఆయన నివాసానికి వెళ్లి అందజేశారు. నేటి మధ్యాహ్నం మూడు గంటలకు విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. 65 ఏళ్ల వయసు దృష్ట్యా పీఎస్‌కు రావాల్సిన అవసరం లేదని తెలిపారు. విచారణకు హాజరయ్యేందుకు హైదరాబాద్ పరిధిలోని

...:: మిగతా 2లో

నేడు విచారణకు హాజరు కాలేను

...:: 2లో

- తనను ఎర్రవల్లిలోనే మరోరోజు విచారణ చేయండి.. సిట్‌అధికారులకు కేసీఆర్ లేఖ

ఆ ఏజెన్సీలు అతిపెద్ద దోపిడీదారులు

సర్వీస్ ప్రొవైడర్ ఏజెన్సీలు కార్మికుల శ్రమను దోచుకుంటున్నాయని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. పట్టణాలు, నగరాల్లో వాళ్లే నిజమైన దోపిడీదారులుగా మారారని అన్నారు.

9

మేడిగడ్డ బ్యారేజ్‌కు కేంద్రం రెడ్ అలర్ట్

- కేటగిరి 1 ప్రమాదకర డ్యామ్ గా ప్రకటన
- భద్రతపై తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశం
- బ్యారేజీ మరమ్మతుల కోసం ఎల్అండ్‌టీపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి
- వెంటనే పనులు చేపట్టకపోతే బ్లాక్‌లిస్టులో పెడతామని హెచ్చరిక

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 29: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజ్‌కు కేంద్రం

...:: మిగతా 5లో

మహిళల భయాలను ఆసరాగా

ఆకతాయిల బ్లాక్ మెయిల్

- వాళ్లకు పోలీసులు అంటే భయం ఉండేలా చర్యలు ఉండాలి
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

...:: 5లో

కేసీఆర్‌ను టచ్ చేస్తే

తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేసినట్టే

- కేసీఆర్‌పై నోటీసులు చౌకబారు రాజకీయం
- బొగ్గు కుంభకోణం నుంచి దృష్టి మళ్లించేందుకే
- మాజీ మంత్రి హరీశ్ రావు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, జనవరి 29: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రాజకీయ కక్షతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాగిస్తున్న కుట్రలను తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీశ్ రావు తెలిపారు. పరిపాలనలో వైఫల్యాలను దాచిపెట్టేందుకు

...:: మిగతా 2లో

చైనాకు 'నిఫా' భయం

చైనాకు 'నిఫా' వైరస్ భయం పట్టుకుంది. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా భారత్ సహా వైరస్ ప్రభావిత ప్రాంతాల నుంచి వస్తున్న ప్రయాణికులకు విమానాశ్రయాల్లో స్క్రీనింగ్ ప్రక్రియ ప్రారంభించింది.

9

రాష్ట్రీయం

వెన్నెల వెలుగుల్లో మెరిసిన మేడారం

మొదటిపేజీ తరువాయి

ఆవిష్కృతం అవ్వడంతో భక్తులు పులకించి పోయారు. ప్రతి రెండూ సంవత్సరాలకు ఒకసారి మాఘ శుద్ధ పౌర్ణమి రోజున నిండు వెన్నెల వెలుగుల్లో సమ్మక్క తల్లి గద్దెపై పూజారులు ప్రతిష్టిస్తారు. ఇప్పటికే సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు ప్రతిరూపాలు మేడారం గద్దెల పై కొలువు తీరారు. చిలకల గుట్ట నుంచి ఆలయ ప్రాంగణం వరకు అశేష భక్తజనం సమ్మక్క తల్లికి నీరాజనాలు పలికారు.

భక్తులతో కిక్కిరిసిన గద్దెలు, పరిసర ప్రాంతాలు

వనదేవతలు కొలువుదీరిన మేడారం జనసంద్రంగా మారింది. లక్షలాదిగా తరలివచ్చినభక్తులతో వనదేవతల ప్రాంగణం జనసంద్రాన్ని తలపించింది. కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న జంపన్న వాగు ఇప్పుడు భక్తుల స్నానాలతో జన సముద్రాన్ని తలపిస్తోంది. తెలంగాణ నుంచే కాకుండా మహారాష్ట్ర, ఏపీ, చత్తీస్గఢ్ రాష్ట్రాలతో పాటు దేశ నలుమూలల నుంచి ఆదివాసీ గిరిజనులు, భక్తులు మేడారానికి తరలివచ్చారు. దీంతో మేడారానికి వచ్చే దారులన్నీ వాహనాలతో రద్దీగా మారాయి. వెంట తెచ్చుకున్న కోళ్లను వనదేవతల గద్దెల సమీపంలో గాల్లోకి ఎగురవేస్తూ భక్తులు సందడి చేస్తున్నారు. కుటుంబాలను చల్లగా దీవించు తల్లీ అంటూ దేవతలను కొలుస్తున్నారు. ఎత్తు బంగారాలను సమర్పిస్తున్నారు. వచ్చే రెండు రోజులు భారీ సంఖ్యలో భక్తులు మేడారంకు తరలిరానున్నారు. మేడారం వెళ్లే దారి పొడవునా గిరిజన మహిళల నృత్యాలు, డొరల కొమ్ము బూరల శబ్దాలు భక్తులకు స్వాగతం పలుకుతున్నాయి. ఇక్కడి వాతావరణం భక్తులను భక్తి పారవశ్యంలోముంచెత్తుతోంది. విదేశాల నుంచి కూడా మానవ శాస్త్ర పరిశోధకులు ఈ అరుదైన గిరిజన సంస్కృతిని అధ్యయనం చేయడానికి విచ్చేస్తున్నారు.

తొక్కిసలాట జరగకుండా సెన్సార్లు

కాగా గద్దెల వద్ద తొక్కిసలాట జరగకుండా అత్యాధునిక సెన్సార్ల ద్వారా రద్దీని ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నారు. 50కి పైగా మొబైల్ మెడికల్ యూనిట్లు, ఎమర్జెన్సీ కోసం ఎయిర్ అంబులెన్స్ సౌకర్యం సిద్ధంగా ఉన్నాయి. భక్తుల కోసం ప్రత్యేకంగా 'మేడారం యాప్' అందుబాటులోకి తెచ్చారు. దీని ద్వారా పార్కింగ్ ప్లేసులు, ట్రాఫిక్ అప్డేట్స్ తెలుసుకోవచ్చు. మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర స్వయంగా జాతర ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 42,000 మంది ప్రభుత్వ సిబ్బందిని విధుల్లో ఉన్నారు. భక్తులు ప్రశాంతంగా వనదేవతలను దర్శించుకుంటున్నారు. ప్రభుత్వం చేసిన ఏర్పాట్ల పట్ల భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మేడారంఅంటే కేవలం మొక్కులు తీర్చుకోవడం మాత్రమే కాదు, అది తెలంగాణ గిరిజన అస్తిత్వానికి, ధైర్యానికి ప్రతీక. ఆధునిక ప్రపంచంలో మనిషికి, ప్రకృతికి ఉన్న విడదీయరాని బంధాన్ని ఈ జాతర గుర్తు చేస్తుంది.

జాతీయ పండుగగా గుర్తించండి
కేంద్ర మంత్రులకు రాష్ట్ర మంత్రులు వినతి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ జాతరను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని భక్తుల సౌకర్యార్థం అనేక శాశ్వత అభివృద్ధి పనులను చేపట్టిందని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. మేడారంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, సమ్మక్క-సారక్క జాతరను 'జాతీయ పండుగ'గా గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇప్పటికే పలుమార్లు కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రుల పర్యటనతో ఈ అంశం త్వరలోనే సాకారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమ్మక్క-సారక్క జాతరను గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా, మరో కుంభమేళాగా ఆయన అభివర్ణించారు. ఈ మహాజాతర విజయవంతంగా నిర్వహించేందుకు అంకితభావంతో కృషి చేసిన అధికారులు, సిబ్బంది మరియు సహకరించిన మీడియా మిత్రులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సూచనల మేరకు ఇన్‌ఛార్జ్ మంత్రి పర్యవేక్షణలో కేవలం 90 రోజుల్లోనే ఆలయ అభివృద్ధి పనులు, మౌలిక వసతులు పూర్తి చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు జాతర ప్రశాంతంగా, సవ్యంగా కొనసాగుతోందని పేర్కొంటూ, జిల్లా కలెక్టర్, ఎస్పీ, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు, ఇతర జిల్లాల నుంచి వచ్చి సేవలందించిన సిబ్బంది, సమాచారాన్ని ప్రజలకు చేరవేసిన మీడియా ప్రతినిధులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, గద్దెల పునర్నిర్మాణం సహా మౌలిక సదుపాయాల పనులు నిర్ణీత కాలంలో విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. సమ్మక్క-సారక్క జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి శ్రీ జువల్ ఓరంకి విజ్ఞప్తి చేసినట్లు, అలాగే జాతర నిర్వహణకు మరింత ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ కేంద్ర మంత్రులకు వినతి పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు.

పెరిగిన భక్తుల రాక

మేడారం సమ్మక్క-సారక్క మహా జాతరలో భక్తుల తాకిడి గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. మేడారంలో మీడియాతో మాట్లాడిన మంత్రి మాట్లాడుతూ, గురువారం దాదాపు 80 లక్షల మంది భక్తులు దర్శనం చేసుకున్నారని, సమ్మక్క గద్దెపైకి వచ్చే సమయానికి ఈ సంఖ్య కోటికి మించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు.

2,500 కోట్ల వ్యయంతో టెంపుల్ సర్క్యూట్

దక్షిణ భారత కుంభమేళాగా పేరొందిన మేడారం జాతర ప్రాధాన్యతను మరింత పెంచేందుకు బాసర నుంచి భద్రాచలం వరకు రూ.2,500 కోట్ల వ్యయంతో టెంపుల్ సర్క్యూట్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రముఖ ఆలయాల అభివృద్ధిలో మేడారం ఆలయాన్ని కూడా భాగంగా చేర్చనున్నట్లు ఆయన ప్రకటించారు.

సమ్మక్క సారాలమ్మలను దర్శించుకున్న భట్టి

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గురువారం సతీసమేతంగా తల్లులను దర్శించుకున్నారు. అశేష భక్తజన వాహిని నడుమ, ఆ తల్లుల గద్దెల వద్ద మొక్కులు చెల్లించి, రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని మనసారా వేడుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్లాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడటమే మా ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని అన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించి, భద్రత మరియు పారిశుధ్యంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. భక్తుల సౌకర్యార్థం ప్రతి అడుగులోనూ ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.

దేశంలోనే అతిపెద్ద గిరిజనుల మహాకుంభం

కేంద్ర మంత్రి జువల్‌ఓరం

మేడారం సమ్మక్క-సారక్క జాతర సందర్భంగా కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి సమ్మక్క-సారలమ్మ తల్లులను దర్శించుకుని మొక్కులు సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దనసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆలయ ప్రధాన ద్వారం వద్ద కేంద్ర మంత్రులకు ఘన స్వాగతం పలికారు. గిరిజన సంప్రదాయ డోలు-డప్పుల నడుమ ఆలయంలోకి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తల్లులకు నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించారు. తదనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం మాట్లాడుతూ, "సమ్మక్క-సారక్క జాతర దేశంలోనే అతిపెద్ద గిరిజన పండుగ. ఇది గిరిజనుల మహాకుంభంగా నిలుస్తోంది. సుమారు 20 ఏళ్ల క్రితం నేను ఇక్కడికి వచ్చాను. ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు మళ్లీ ఈ పవిత్ర జాతరకు రావడం ఆనందంగా ఉంది" అని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో నిధులు అందిస్తోందని తెలిపారు. జాతర నిర్వహణకు సహకరిస్తూనే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనకు పాత మిత్రులని, పార్లమెంటులో కలిసి పనిచేసిన అనుభవం ఉందని గుర్తు చేశారు. గిరిజన సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ధర్తీ ఆబా గిరిజన గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కింద ₹1 లక్ష కోట్లు, పీఎం జన్‌మన్ యోజన కింద ₹24,000 కోట్లు, తెలంగాణకు 23 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు.

గిరిజనుల పెద్ద జాతర: కిషన్ రెడ్డి

"సమ్మక్క-సారక్క జాతర గిరిజన ప్రజల అతిపెద్ద పండుగ. నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది భక్తులు ఇక్కడికి వస్తారు" అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. జాతర ఏర్పాట్లలో భాగస్వాములైన రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఈ ప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ములుగు, లక్నవరం, మేడవరం, తాడ్వాయి, బొగత జలపాతం ప్రాంతాల పర్యాటక అభివృద్ధికి ₹80 కోట్లు, రామప్ప దేవాలయ అభివృద్ధికి ₹140 కోట్లు, ఈ ఏడాది జాతర నిర్వహణకు ₹3.70 కోట్లు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. సమ్మక్క-సారక్క పేరుతో రూ. 890 కోట్లతో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు కానుందని, పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. త్వరలో ప్రధాని చేతుల మీదుగా ప్రారంభించు కుంటామని వెల్లడించారు. లక్షలాది మంది వచ్చే ఈ మహాజాతరలో భక్తులకు కనీస వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని అభినందిస్తూ, అంకితభావంతో పనిచేస్తున్న అధికారులు, మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.

కులగణన పేరుతో బీసీల హక్కులపై దాడి

మొదటిపేజీ తరువాయి

రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. దేశ జనాభాలో 56 శాతం ఉన్న బీసీలను గుర్తించకుండా 'అదర్స్' అనే ఒక్క కాలమ్‌లో కలిపి మాయంచేసే కుట్ర జరుగుతోందని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. పదేళ్లకు ఒకసారి జరగాల్సిన జనగణన 2021లో కోవిడ్ కారణంగా జరగలేదని, ఈసారి కులగణన కూడా చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో దేశవ్యాప్తంగా ఆశలు ఏర్పడ్డాయని కవిత చెప్పారు. అయితే తాజాగా విడుదల చేసిన కులగణన డాక్యుమెంట్‌ను పరిశీలించిన తర్వాత బీజేపీ అసలు ఉద్దేశం బయటపడిందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక కాలమ్స్ ఉంచి, దేశ జనాభాలో మెజారిటీగా ఉన్న ఓబీసీలు, బీసీలు, ఎంబీసీలు, డీఎన్టీలకు మాత్రం ప్రత్యేక గుర్తింపు లేకుండా "అదర్స్" అని మాత్రమే పెట్టడం అనేది కులగణన కాదు - అది బీసీలపై కుట్రేనని ఆమె స్పష్టం చేశారు. "దేశంలో 4 వేల కులాలు ఉన్నాయి. వాటన్నింటినీ అదర్స్ అని ఒకే కాలమ్‌లో పెడితే అది జనగణన ఎలా అవుతుంది? 56 శాతం ఉన్న బీసీలను గుర్తించకుండా లెక్కలు ఎలా తేలుతాయి?" అని కవిత ప్రశ్నించారు. ఒకే కులానికి రాష్ట్రాల వారీగా వేర్వేరు గుర్తింపులు ఉన్నాయని, తన కులమే తెలంగాణలో ఓసీగా, మహారాష్ట్రలో ఎస్సీగా, ఆంధ్రప్రదేశ్‌లో బీసీగా గుర్తింపు పొందుతోందని ఉదాహరణగా తెలిపారు. చిన్న సంఖ్యలో ఉన్న కులాలకే ఇన్నివైరుధ్యాలు ఉంటే, కోట్ల సంఖ్యలో ఉన్న బీసీల పరిస్థితి ఎంత గందరగోళంగా ఉంటుందో కేంద్రం ఆలోచించాలన్నారు. గతంలో అగ్రకులాల్లో పేదలకు రిజర్వేషన్లు ఇచ్చినప్పుడు కూడా వారిని ఏ కేటగిరీలో పరిగణించాలో స్పష్టత ఇవ్వలేదని గుర్తు చేశారు. ఇప్పుడు కులగణనలోనూ అదే విధంగా అస్పష్టత సృష్టించి, భవిష్యత్తులో బీసీలకు సర్టిఫికెట్లు రాని పరిస్థితి తీసుకురావాలని చూస్తున్నారని ఆరోపించారు. కులగణన అంటే కేవలం కులం పేరు మాత్రమే కాదు, ఉపకులాల గుర్తింపు కూడా తప్పనిసరి అని కవిత స్పష్టం చేశారు. పద్మశాలి కులంలోనే 23 ఉపకులాలు ఉన్నాయని, అలాగే ప్రతి కులంలో అనేక ఉపకులాలు ఉన్నాయని తెలిపారు. ఉపకులాలను లెక్కించకుండా చేసే కులగణన ద్వారా న్యాయం జరగదన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగ రక్షణ ఉండటంతో వారికి నష్టం జరగడం లేదని, కానీ బీసీలు, ఆర్థికంగా వెనుకబడిన అగ్రకులాలు పూర్తిగా రక్షణ లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. "ముందు రికగ్నైజేషన్, తర్వాతే రిజర్వేషన్. మమ్మల్ని గుర్తించకపోతే మాకు హక్కులు ఎలా ఇస్తారు?" అని నిలదీశారు. 2011లో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.4500 కోట్లతో నిర్వహించిన కులగణనలో జరిగిన తప్పునే ఇప్పుడు బీజేపీ కూడా చేస్తోందని, ఈసారి రూ.11 వేల కోట్లతో చేపట్టబోయే జనగణనలో కూడా బీసీలను మోసం చేసే ప్రమాదం ఉందన్నారు. ప్రస్తుతం మొదటి దశలో ఇండ్ల సర్వే జరుగుతోందని, ఏడాది తర్వాత అసలు కులగణన జరగనుందని, ఈ ఏడాదిలో ప్రజలు పోరాటం చేయకపోతే మరో పదేళ్ల పాటు బీసీలకు సర్టిఫికెట్లు లేని పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

అన్నివర్గాల
మీద జరుగుతున్నకుట్ర

ఇది ఒక్క కులం మీద కాదు - అన్ని వర్గాల మీద జరుగుతున్న కుట్ర అని, మైనార్టీలు కూడా ఈ కులగణన విషయంలో భయపడుతున్నారని తెలిపారు. మతం ఏదైనా సరే ప్రతి వర్గానికి జాగృతి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కులగణన అంశంపై అన్ని రాజకీయ పార్టీలు తమ స్పష్టమైన స్టాండ్ చెప్పాల్సిందేనని కవిత డిమాండ్ చేశారు. బీజేపీ డాక్యుమెంట్ విడుదల చేసి తప్పించుకుంటోందని, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఈ అంశంపై మౌనం వహించడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ అంశాన్ని రాజకీయ అజెండాగా మార్చినప్పుడే పార్టీలకు భయం వస్తుందని, మున్సిపల్, జడ్పీటీసీ ఎన్నికల్లో కులగణన-రిజర్వేషన్లే ప్రధాన అజెండాగా ఉండాలని పిలుపునిచ్చారు. "డేటా అంటే గౌరవం. ఆ గౌరవాన్ని మన నుంచి తీసేసే కుట్రను గుర్తించాలి" అని హెచ్చరించారు. తెలంగాణలో ఉన్న అన్ని కులాలు, ఉపకులాలపై సమగ్ర నివేదికను జాగృతి సిద్ధం చేసి కేంద్రానికి అందజేస్తుందని, "తెలంగాణ థింక్స్ - ఇండియా ఫాలోస్ నెక్స్ట్" అన్నట్టుగా ఈ పోరాటం దేశానికి దారి చూపుతుందని కవిత ధీమా వ్యక్తం చేశారు.

కేసీఆర్‌కు సిట్ నోటీసులు

మొదటిపేజీ తరువాయి

అనువైన ప్రాంతం వివరాలు తెలపాలని సూచించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటికే కేటీఆర్, హరీశ్‌రావు, సంతోశ్‌రావులను ప్రత్యేక దర్యాప్తు బృందం విచారించిన విషయం విధితమే. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ రాష్ట్రంలో రాజకీయ ప్రకంపనలు సృష్టించింది. ట్యాపింగ్ కేసులో సిట్ దర్యాప్తును వేగవంతం చేసింది. ఇప్పటికే ఈ కేసులో నలుగురు పోలీసు అధికారులను అరెస్ట్ చేయగా, ప్రభాకర్ రావును సైతం పలుమార్లు ప్రత్యేక దర్యాప్తు బృందం విచారించింది. సీపీ సజ్జనార్ నేతృత్వంలో ఏర్పాటైన సిట్ ప్రధాన నిందితుడు ప్రభాకర్ రావు విచారణ కస్టోడియల్ విచారణ ఆధారంగా కీలక సమాచారాన్ని సేకరించింది. ఇప్పటికే ట్యాపింగ్ బాధితులుగా ఉన్న మొత్తం 618 మందిని స్టేట్మెంట్లను రికార్డ్ చేసిన సిట్ అధికారులు, ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణ తర్వాత మరికొంతమందిని పిలిచి విచారిస్తున్నారు.

ఎస్ఐబీ ఏఎస్పీ ఇచ్చిన ఫిర్యాదుతో

స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా 2024 మార్చి 10న పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదైంది. అప్పటి నుంచి ఈ కేసు అనేక కీలక మలుపులు తిరుగుతూ, అక్రమ నిఘాకు సంబంధించిన తీవ్రమైన ఆరోపణలను వెలుగులోకి తెచ్చింది. వీసీ సజ్జనార్ నాయకత్వంలో మరో సిట్ ఏర్పాటు చేసిన తర్వాత దర్యాప్తు మరింత వేగవంతమైంది. దీని తర్వాత సిట్ ఇటీవల ఎమ్మెల్సీ నవీన్ రావు, మాజీ మంత్రి హరీశ్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుమార్‌లను విచారించింది. వారి వాంగ్మూలాలను నమోదు చేయడంతో పాటు, విచారణ ప్రక్రియ మొత్తాన్ని వీడియో తీశారు.

కేసీఆర్‌పేరు వెలుగులోకి రావడంతో...

అనేక వాంగ్మూలాల్లో కేసీఆర్ పేరు వెలుగులోకి రావడంతో, ఇప్పుడు ఆయనకు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. రాధాకిషన్ రావు తన వాంగ్మూలంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్ పాత్ర గురించి ప్రస్తావించినట్లు ఆరోపణలు వినిపించాయి. భుజంగ రావు కూడా ప్రభాకర్ రావు నియామకం గురించి ప్రస్తావిస్తూ కేసీఆర్ పేరు చెప్పినట్లు సమాచారం. ఈ కేసులో పాలుపంచుకున్న సీనియర్ అధికారులు సంబంధిత కాలంలో మాజీ ముఖ్యమంత్రి అధికారిక నివాసమైన ప్రగతి భవన్‌ను తరచుగా సందర్శించారని భుజంగ రావు తన వాంగ్మూలంలో పేర్కొన్నారు. ఈ వాంగ్మూలాలు, వాటికి మద్దతుగా లభించిన ఆధారాల ఆధారంగా సిట్ తన దర్యాప్తును ముందుకు తీసుకెళ్తుందని భావిస్తున్నారు. కేసీఆర్‌కు నోటీసులు జారీ చేయడంతో దర్యాప్తు కీలక దశలోకి ప్రవేశించింది. రాబోయే రోజుల్లో ఇది మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది.

కేటీఆర్‌ను లోతుగా విచారించిన సిట్.

ఇటీవలే బీఆర్ఎస్‌వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్ను సిట్ లోతుగావిచారించింది. ఆయనను పలు అంశాలపై అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది. పార్టీకి ఎలక్టోరల్ బాండ్లు, విరాళాలు సమకూర్చిన వారిలో పలువురు వ్యాపారుల మొబైల్స్ నిఘాలో ఉన్నట్లుగా సిట్ కు ఆధారాలు లభించాయి. ఈ నేపథ్యంలోనే అధికారులు పలు ప్రశ్నలు అడిగినట్లుగా తెలిసింది. ఆయా ఫోన్ నెంబర్లతో ఉన్న జాబితాను కేటీఆర్ ముందు ఉంచి విచారించినట్లు సమాచారం. అలాగే ఫోన్ ట్యాపింగ్ ద్వారా తమను బెదిరించి బీఆర్ఎస్ కు ఎలక్టోరల్ బాండ్లు సమకూర్చే విధంగా చేశారంటూ కొంతమంది వ్యాపారులు ఇచ్చిన ఫిర్యాదులపై ప్రశ్నించగా, అలాంటిదేమీ లేదని కేటీఆర్ సమాధానం ఇచ్చారు.

నేడు విచారణకు హాజరు కాలేను

ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందించారు. సిట్ అధికారులు నోటీసులో పేర్కొన్న రోజున తాను విచారణకు హాజరు కాలేనని ఆయన తెలిపారు. నందినగర్‌లోని తన నివాసంలో అధికారులు నోటీసులు ఇవ్వడంపై గులాబీ అధినేత ప్రత్యుత్తరం రాశారు. శుక్రవారం విచారణ కుదరని ఆయన పోలీసులకు వివరించారు. అంతేకాదు తనను ఎర్రవల్లిలోనే మరోరోజు విచారణ చేయాలని కేసీఆర్ లేఖలో పేర్కొన్నారు. సిట్ అధికారులు గురువారం తనకు నోటీసులు జారీ చేయడంపై కేసీఆర్ సానుకూలంగా స్పందించారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు నందినగర్‌లోని నివాసంలో అందుబాటులో ఉండాలని వారు కోరారు. అయితే.. మున్సిపల్ ఎన్నికల నామినేషన్లకు శుక్రవారమే ఆఖరు తేదీ కావడంతో.. అభ్యర్థులను ఖరారు చేయడంతో తాను బిజీగా ఉన్నానని విచారణను మరోరోజు జరపాల్సిందిగా కేసీఆర్ పోలీసులకు తెలిపారు. జూబ్లీహిల్స్ ఏసీపీ పి.వెంకటగిరికి శుక్రవారం తాను హాజరు కాలేకపోవడానికి గల కారణాలను వివరిస్తూ కేసీఆర్ రెండు పేజీల లేఖ రాశారు. 'సెక్షన్ 160 సీఆర్పీసీ ప్రకారం మరో రోజున తనను ఎర్రవల్లిలోని నివాసంలో విచారించాలి. అంతేకాదు ఈ సెక్షన్‌లోని నిబంధనల మేరకు నాకు మీరు ముందస్తు నోటీసులు పంపించి ఆ తర్వాతే విచారించాలి. మరో విషయం 65 ఏళ్లు పైబడిన పురుషులను వారు విచారణ కోసం పోలీస్ స్టేషన్ వెళ్లనవసరం లేదు. పోలీసులే వారి ఇంటివద్దకు వెళ్లి విచారణ చేపట్టాలి. ఇకపై నాకు పంపాల్సిన నోటీసులను నేను నివసిస్తున్న ప్రాంతానికి అంటే.. ఎర్రవల్లికే పంపాలి. మాజీ ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా, బాధ్యతగల పౌరుడిగా సిట్ విచారణకు పూర్తిగా సహకరిస్తాను' అని కేసీఆర్ లేఖలో పేర్కొన్నారు.

ఎన్ని నోటీసులు ఇచ్చినా కేసీఆర్ ను ఏమీ పీకలేరు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నేతలను డిస్టర్బ్ చేసేందుకే మా అధినేతకు నోటీసులు ఇచ్చారు. కేటీఆర్, హరీశ్ రావులకు నోటీసులిస్తే ఎంతమంది తరలివచ్చారో చూశారు. అదే కేసీఆర్ కు నోటీసులు ఇస్తే ఎన్నికలను పక్కనబెట్టి మరీ లక్షలాదిగా కార్యకర్తలు తరలివస్తారని ప్రభుత్వానికి తెలుసు.

- జగదీశ్ రెడ్డి, మాజీ మంత్రి

..తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేసినట్టే

మొదటిపేజీ తరువాయి

సిట్ పేరుతో కేసీఆర్‌పై నోటీసులు జారీ చేయడం చౌకబారు రాజకీయాలకు నిదర్శనమన్నారు. కేసీఆర్‌ను టచ్ చేయడం అంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేసినట్టేనని హెచ్చరించారు. రాజకీయ వేధింపులకు బీఆర్ఎస్ భయపడదని, తెలంగాణ ప్రజలంతా కేసీఆర్ వెంటే ఉన్నారని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు జారీచేయడమనేది రేవంత్‌రెడ్డి చిల్లర రాజకీయాలకు పరాకాష్ఠ అని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఈ మేరకు హరీష్‌రావు తన ఎక్స్ ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు. స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసి, దశాబ్దకాలంపాటు తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపిన మహానేత కేసీఆర్ అని కొనియాడారు. అలాంటి చరిత్రాత్మక నాయకుడిపై బురద చల్లాలని ప్రయత్నించడం అంటే సూర్యునిపై ఉమ్మి వేసే ప్రయత్నమేనని మండిపడ్డారు.

పరిపాలనలో చేతకానితనంతో ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకు, సింగరేణి బొగ్గు కుంభకోణం మరకల నుంచి దృష్టి మళ్లించేందుకు, సిట్ పేరుతో నోటీసులు జారీచేయడం రేవంత్ రెడ్డి చిల్లర, చౌకబారు రాజకీయాలకు పరాకాష్ఠ అని హరీష్‌రావు విమర్శించారు. ఇలాంటి రాజకీయ వేధింపులతో మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధి పొందవచ్చని భావించడం రేవంత్‌రెడ్డి రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. చరిత్రను సృష్టించిన నాయకుడు కేసీఆర్ అయితే, ఆ చరిత్రను మలినం చేయాలని చూస్తున్న చరిత్రహీనుడు రేవంత్ రెడ్డి అని హరీష్‌రావు మండిపడ్డారు. అధికారం శాశ్వతం కాదని, తెలంగాణ సమాజమంతా కేసీఆర్ వెంటే ఉన్నదని అన్నారు. కాంగ్రెస్ రాజకీయ వేధింపులకు భయపడే ప్రసక్తే లేదని, ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

మామునూరు ఎయిర్‌పోర్టుకు భూమి అప్పగింత

- చరిత్రలో నిలిచిపోయే రోజు
- అదిలాబాద్, కొత్తగూడెం ఎయిర్ పోర్టులను త్వరితగతన పూర్తి చేయాలి
- బేగంపేట సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 29: ప్రజా ప్రభుత్వం ఏర్పడగానే మామునూరు ఎయిర్‌పోర్ట్ కు అవసరమైన భూమిని సేకరించి ఈరోజు కేంద్ర విమానయాన శాఖ కు అప్పగించడం చరిత్రలో నిలిచిపోయే రోజు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. వరంగల్ జిల్లాలోని మామునూరు ఎయిర్‌పోర్ట్ కు అవసరమైన 300 ఎకరాల భూమిని కేంద్ర వైమానిక శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు అప్పగించడం చరిత్రలో నిలిచిపోయే రోజు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం బేగంపేట విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. మామునూరు తరహాలోనే ఆదిలాబాద్, కొత్తగూడెం పట్టణాల్లో ఏర్పాటు చేయ దలచిన ఎయిర్ పోర్టుల నిర్మాణం పనిని వేగవంతం చేయాలని కేంద్రమంత్రికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. తెలుగు గడ్డపై పుట్టిన వ్యక్తి కేంద్రంలో వైమానిక శాఖ మంత్రిగా ఉండడం అభినందనీయమని వారు తెలంగాణ రాష్ట్ర అవసరాలను గుర్తిస్తూ సహకారం అందించాలని డిప్యూటీ సీఎం కోరారు. 2007లోనే ఎయిర్పోర్ట్ అథారిటీతో మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి ఒప్పందం చేసుకున్నప్పటికీ గత పది సంవత్సరాలు పరిపాలించిన వారు పట్టించుకోకపోవడంతో వరంగల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం ఆలస్యమైందని డిప్యూటీ సీఎం తెలిపారు. హైదరాబాద్ కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని టూ టైర్ సిటీలు అయినా కొత్తగూడెం ఆదిలాబాద్లో ఎయిర్‌పోర్ట్ నిర్మాణం చేయాలని కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టగానే రామ్మోహన్ నాయుడును రాష్ట్ర క్యాబినెట్ మొత్తం కోరగా వారు సానుకూలంగా స్పందించి ముందుకు వెళ్లడం శుభసూచకం అని తెలిపారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ 1930లో నిజాం కాలంలోనే పనులు మొదలు పెట్టారని ఇది ఆనాడు దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద ఎయిర్‌పోర్ట్ అని డిప్యూటీ సీఎం తెలిపారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ భూ సేకరణకు 300 కోట్లు అవసరమని గుర్తించి వాటిని వెంటనే విడుదల చేసి వడివడిగా అడుగులు వేసి భూసేకరణ ప్రక్రియను పూర్తి చేశామని డిప్యూటీ సీఎం తెలిపారు.

సీఎం రేవంత్ చొరవతోనే మమునూరు ఎయిర్ పోర్ట్ నిర్మాణం

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి చొరవ వల్లే మమునూరు ఎయిర్ పోర్ట్ కల నెరవేరుతోందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. స్వాతంత్ర్యం రాకముందు మమునూరు అతిపెద్ద ఎయిర్ పోర్ట్‌గా ఉండేదని అన్నారు. మమునూరు ఎయిర్ పోర్ట్‌కు 696 ఎకరాలు మాత్రమే ఉందని, అయితే 180 సీట్ల విమానం దిగాలి అంటే రన్ వే పొడవు 2500 మీటర్లు ఉండాలని మంత్రి తెలిపారు. మమునూరు ఎయిర్‌పోర్ట్ కల నెరవేరాలంటే మరో 259ఎకరాలు అవసరమని మంత్రి తెలిపారు. గతంలో ఎవరూ ఆ భూమిని సేకరించలేదని, అయితే రేవంత్ రెడ్డి ప్రభుత్వం రికార్డ్ టైమ్‌లో రైతులను ఒప్పించి భూమి సేకరించిందని ప్రశంసించారు. ఏవియేషన్ మంత్రిగా ఎక్కువ ఎయిర్ పోర్టులు నిర్మించాలనేది తన లక్ష్యమని, రాష్ట్రాలు సహకరించి భూములు ఇస్తే కొత్త ఎయిర్ పోర్టులు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్ తర్వాత గొప్ప వారసత్వ నగరమైన వరంగల్‌లో ఎయిర్ పోర్ట్ డిమాండ్ ఎప్పటి నుంచో ఉన్నా నిర్మాణం చేసుకోలేక పోయామని, ఇప్పుడు ఆ కల నెరవేరతోందని అన్నార.శంషాబాద్ ఎయిర్ పోర్ట్ 5వేల ఎకరాలతో నిర్మిస్తాం అంటే అందరూ నవ్వారని, అన్ని వేల ఎకరాలు ఉండటం వల్లే నేడు ఆపరేషన్, మెంటైనెన్స్, రిపేర్ కేంద్రాలకు వీలు అవుతోందని మంత్రి పేర్కొన్నార). అందువల్లే హైదరాబాద్ ఏవియేషన్ హబ్‌గా ఎదిగిందన్నారు. పోటీపడి రాజకీయాలు చేయడం కాదు.. అభివృద్ధి చేయాలని తమ గురువు చంద్రబాబు నేర్పించారని అన్నారు. తెలంగాణను కూడా అభివృద్ధి చేయాలని తమ గురువు చంద్రబాబు చెప్పారని మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

ఉపాధి హామీ పథకం పేరు మార్చొద్దు

- నిరుద్యోగం, ధరల పెరుగుదలపై ప్రధాని మోదీ దృష్టి పెట్టాలి



ప్రతిపక్షం, నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి 29: ఎన్డీయే ప్రభుత్వ చర్యలు ఇలాగే ఉంటే.. దేశంలో ఉద్యమాలు తప్పవని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చొద్దని.. నిరుద్యోగం, ధరల పెరుగుదలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దృష్టి పెట్టాలని నాగర్ కర్నూల్ ఎంపీ డా.మల్లు రవి డిమాండ్ చేశారు. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో గురువారం మల్లు రవి విలేఖరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. భారతదేశం మొత్తంలో అత్యున్నతమైన పంచాయతీ భారత పార్లమెంట్. ప్రజల కష్టాలు, బాధలను గురించి తెలుసుకొని చట్టాలు చేయాల్సింది పార్లమెంట్ అని తెలిపారు. అలాంటి పార్లమెంటులో ప్రస్తుతం మోదీ ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మీద చర్చకు కూడా అవకాశం ఇవ్వబోమని పార్లమెంట్ ప్రారంభం కావడానికి ముందే ప్రకటించడం అత్యంత బాధాకరం అని అన్నారు. పార్లమెంటు కార్పోరేట్ సంస్థల కోసం, పెద్దపెద్ద వ్యాపారుల కోసం, ధనవంతుల కోసం పార్లమెంటు లేదని అన్నారు. మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా, సోనియా గాంధీ యూపీఏ చైర్ పర్సన్‌గా ఉన్నప్పుడు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ బిల్లును పార్లమెంటులో పెట్టి, చట్టం ద్వారా కనీసం వంద రోజులు పని పేద ప్రజలకి వారు ఉండే గ్రామాల్లోనే పని కల్పించి, వారు వలస వెళ్లకుండా ఆధారాన్ని కల్పించారని అన్నారు. స్వతంత్ర పోరాటంలో ఏమాత్రం పాల్గొనటువంటి బీజేపీ గాంధీజీ పేరును ఈ పథకానికి తొలగించడం చాలా దురదృష్టకరమని, ఈ పథకానికి జిరాంజీ అని పేరు పెట్టారని, ఇది మహాత్మా గాంధీని అవమానపరిచినట్టే అని మల్లు అభిప్రాయపడ్డారు.

నారాయణఖేడ్ విద్యార్థుల అస్వస్థతపై అంజిరెడ్డి ఆగ్రహం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 29 : అసమర్ధత కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల, పేద విద్యార్థుల బతుకులు ఆగమవుతున్నాయని ఎమ్మెల్సీ డా. చిన్న మైల్ అంజి రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ విద్యార్థుల అస్వస్థత పై అంజిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కలుషిత ఆహారం దుర్మార్గమన్నారు. విద్యార్థులు కలుషిత ఆహారం అధికారుల నిర్లక్ష్యమే. ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు భోజనం పెట్టలేని స్థితిలో ఉందా అని ప్రశ్నించారు. భవిష్యత్ లో ప్రభుత్వ పాఠశాలలో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

- జిల్లాలో అన్ని మున్సిపాలిటీలను గెలువాల్సిందే
- నిజామాబాద్‌జిల్లా నేతల సమావేశంలో మీనాక్షి, ఉత్తమ్, మహేశ్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 29: రాష్ట్రంలో జరుగుతున్న మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగురాల్సిందేనని, అందుకోసం ప్రతి ఒక్కరు పనిచేయాలని జిల్లా నేతలకు టీపీసీసీ నేతలు దశ, దిశా నిర్దేశనం చేశారు. గురువారం గాంధీభవన్‌లో నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ముఖ్య నేతలతో మున్సిపల్ ఎన్నికల సన్నాహకాలపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏఐసీసీ ఇంచార్జీ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని లక్ష్యంగా చేసుకుని తీసుకోవాల్సిన వ్యూహాలు, క్షేత్రస్థాయి పరిస్థితులు, పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల విశ్వాసాన్ని చూరగోనేలా పార్టీ శ్రేణులు సమిష్టిగా పనిచేయాలని నేతలు పిలుపునిచ్చారు సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్యే భూపతి రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, రామకృష్ణ, మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కుమార్, కేశ వేణు సహా సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు నోటీసులు కక్షసాధింపే

- ఖండించిన బీఆర్‌ఎస్ నేతలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 29: ఫోన్ ట్యాపింగ్ కేసు పేరుతో బీఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కు సిట్ నోటీసులు జారీ చేయడాన్ని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు తీవ్రంగా ఖండించారు. ఇది పూర్తిగా రాజకీయ కక్షసాధింపు చర్యేనని వారు పేర్కొన్నారు. ఈ నోటీసులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు, బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవి చంద్ర, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ డా. కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, టీఎస్‌ఐఐసీ మాజీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, సివిల్ సప్లయిస్ మాజీ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బీ ఆర్ ఎస్ రాష్ట్ర నాయకురాళ్ళు ముక్తవరం సుశీలా రెడ్డి, రజితా రెడ్డి, తదితరులు తీవ్రంగా ఖండించారు. కేసీఆర్ తెలంగాణ ఉద్యమ శిఖరం, రాష్ట్ర స్వాప్నికుడు అని పేర్కొన్న నేతలు, కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం అంటే యావత్ తెలంగాణ సమాజ ఆత్మగౌరవానికి నోటీసులు ఇచ్చినట్టేనని వ్యాఖ్యానించారు. ఉద్యమ నాయకుడిగా ప్రాణాలకు తెగించి తెలంగాణను సాధించి, పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా అభివృద్ధి చేసిన నాయకుడిపై ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో తీవ్ర అభద్రతా భావం పెరిగిపోయిందని, తన ప్రభుత్వ వైఫల్యాలు, హామీల అమలులో అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే సిట్‌లు, కమిషన్ల పేరుతో డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల వేళ ప్రజల దృష్టిని మళ్లించాలన్న కుట్రలో భాగంగానే ఈ నోటీసుల డ్రామా సాగుతోందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, పాలన చేతకాక ప్రతిపక్షాన్ని వేధించడమే ఏకైక అజెండాగా మార్చుకుందని బీఆర్‌ఎస్ నేతలు మండిపడ్డారు. ప్రభుత్వ సంస్థలు స్వతంత్రత కోల్పోయి పాలకుల చేతిలో కీలుబొమ్మలుగా మారాయని వారు అన్నారు. సిట్‌లు, కమిషన్లు, తప్పుడు కేసులతో కేసీఆర్‌ను ఏమీ చేయలేరని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆశీర్వాదం ఆయన వెంటే ఉందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా ప్రజల కోర్టులో తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దగ్ధం

కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ బీఆర్‌ఎస్ శ్రేణులు తెలంగాణ భవన్ సమీపంలోని అగ్రసేన్ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో కురువ విజయ్ కుమార్, మన్నె గోవర్ధన్ రెడ్డి, సుమిత్రానంద్, తొట్ల స్వామి యాదవ్, అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి, రాయల కార్తీక్, పొట్ల నరేందర్ యాదవ్, సాయి తేజ రావు, బొమ్మెర రామమూర్తి తదితరులు పాల్గొన్నారు. కేసీఆర్‌ను టచ్ చేస్తే తెలంగాణ అగ్నిగుండం అవుతుందని వారు హెచ్చరించారు.

పౌర విమానయాన రంగంలో హెచ్‌ఏఎల్ ముద్ర

- టీజీఐఐసీ చైర్ నిర్మలా జగ్గారెడ్డి
- హైదరాబాద్‌లో 'వింగ్స్ ఇండియా 2026'
- హెచ్‌ఏఎల్ ప్రదర్శనకు హాజరు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 29: ప్రభుత్వ యాజమాన్యంలోని ప్రముఖ వైమానిక సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ బేగంపేట విమానాశ్రయంలో జనవరి 28-31 వరకు నిర్వహిస్తున్న 'వింగ్స్ ఇండియా 2026' పౌర విమానయాన ప్రదర్శనలో పాల్గొంది. గురువారం, టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ఈ ప్రదర్శనను సందర్శించి హెచ్‌ఏఎల్ ప్రదర్శిస్తున్న విమానాలను పరిశీలించారు. హెచ్‌ఏఎల్ ఈ ప్రదర్శనలో హెచ్228 స్థానిక ప్రయాణిక విమానం, ధ్రువ్ కొత్త తరం హెలికాప్టర్, మరియు సూపర్ జెట్ 100 ప్రాంతీయ విమానాలను ప్రదర్శించింది. హెచ్‌ఏఎల్ అధికారులు నిర్మలా జగ్గారెడ్డికి ప్రతి విమానం మరియు వాటి విశేషతల గురించి వివరించారు. ఈ సందర్భంలో నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ, "పౌర విమానయాన రంగంలో హెచ్‌ఏఎల్ తన ముద్రను క్రమంగా విస్తరిస్తోంది. ఇది ప్రాంతీయ కనెక్టివిటీని బలోపేతం చేస్తూ, సివిల్ ఉపయోగాల కార్యకలాపాలు మరియు భవిష్యత్ విమానయాన కార్యక్రమాల్లో దేశానికి స్వయం సమృద్ధి సాధించడానికి దోహదపడుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం కేంద్ర పరిశోధన సంస్థలకు పూర్తి సహకారాన్ని అందిస్తుంది. అని అన్నారు. " హెచ్‌ఏఎల్ ప్రదర్శనలు దేశీయ వైమానిక పరిశ్రమలో స్వయం నిపుణ్యతను పెంచడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆమె పేర్కొన్నారు.

రాష్ట్రంలో వేగంగా స్కామ్‌లు

- కాంగ్రెస్ సర్కార్ సాధించిందేమీ లేదు
- ఫోన్ ట్యాపింగ్‌పై బీజేపీ ఎంపీ లక్ష్మణ్



ప్రతిపక్షం, నేషనల్‌బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి 29: తెలంగాణ రాష్ట్రంలో స్కామ్‌లు వేగంగా పరిగెడుతున్నాయని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ వ్యాఖ్యలు చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చారని.. కానీ అమలు కావడం లేదని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చి రెండేళ్లు గడిచినా, వైఫల్యాలను మరుగుపరచడానికి కాలయాపన చేస్తున్నారని వ్యాఖ్యానించారు. తెలంగాణలో కుంభకోణాలు, అవినీతి, మంత్రుల మధ్య గొడవలు రోజువారీ వార్తలుగా మారాయని లక్ష్మణ్ తెలిపారు. రాష్ట్రం స్కామ్‌లకు పరిశోధన కేంద్రంగా మారిందని ఆయన అన్నారు. కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడంపై స్పందిస్తూ.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని రోజువారీ టీవీ సీరియల్‌గా మార్చారని, రోజుకో పేరును ప్రస్తావిస్తూ సిట్ పేరిట కాలయాపన చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ సాధించలేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ సూత్రధారులను శిక్షించిన పాపాన పోలేదని ఎంపీ విమర్శించారు. తెలంగాణలో బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్ వస్తుందనే అనే భయంతో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కలిసి గేమ్ ఆడుతున్నాయని ఎంపీ ఆరోపించారు. మున్సిపాలిటీలలో కనీస సదుపాయాలు కల్పించడం లేదన్నారు. 106 మున్సిపాలిటీల అభివృద్ధికి ఎన్ని కోట్లు ఖర్చు చేశారో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం స్మార్ట్ సిటీ, పట్టణాల అభివృద్ధి కోసం పని చేస్తోందని.. కానీ రాష్ట్ర ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికుల జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఉందని విమర్శించారు. బీజేపీకి ఓటు వేస్తేనే ప్రోగ్రెస్ జరుగుతుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ ఒక వర్గాన్ని సంతోషపరచడం కోసమే పని చేస్తోందని ఆరోపించారు. రాహుల్ గాంధీ.. ఓ ఫెయిల్యూర్ నాయకుడు అని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు.

ఫోన్ ట్యాపింగ్‌చేసింది ఎవరన్నది తేలాలి

- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 29: కేసీఆర్ అంటే ఉద్యమ నాయకుడుగా మాకు గౌరవం ఉంది, ఫోన్ ట్యాపింగ్ విషయంలో ఎవరు భాగస్వామ్యులో తేలాల్సి ఉందని టీపీసీసీ చీఫ్‌మహేశ్‌కుమార్ గౌడ్‌అన్నారు. ఎవరు పాల్పడ్డారో, ఎవరి ఆదేశాలతో చేశారన్నది గుర్తించేందుకు నోటీసులు ఇస్తారని అంటున్నారు. అయితే నాకు దానిపై క్లారిటీ లేదని, ఫోన్ ట్యాపింగ్ విషయంలో పారదర్శక విచారణ జరగాలని ఆయన తెలిపారు. 500 పైన నంబర్లో ఫోన్ టాప్ అయ్యాయి అనే సమాచారం ఉందన్నారు. జరిగిన వాస్తవాలు తెలుసుకోటానికి సిట్ ఎవరికైనా నోటీసులు ఇవ్వొచ్చని, ఆనాడు ముఖ్యమంత్రి, మంత్రుల ప్రమేయం లేకుండా ఇలాంటివి జరగవని తేల్చి చెప్పారు. అధికారులు మాత్రమే ఇలాంటి చర్యలకు పాల్పడరని, సిట్ సంపూర్ణ విచారణ జరిగితేనే తెలుస్తుందని అభిప్రాయపడ్డారు. విచారణతో నిజాలు బయటికి వస్తాయని, ఈ విషయం లో వాస్తవాలు బయటికి రావాలనని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కేసీఆర్ కి నోటీసులు ఇవ్వటంపై రాజకీయ దురుద్దేశం లేదని మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

మెజార్టీ మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా

మున్సిపాలిటీ లో మెజారిటీ మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగురుతుందని మహేశ్ తెలిపారు. గత రెండేళ్లుగా మున్సిపాలిటీల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి తీసుకుంటున్న చర్యలు, విడుదల చేసిన నిధులే కాంగ్రెస్ అభ్యర్థులను ఓటర్లు గెలిపిస్తారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ లకోసం డైవర్షన్ పాలిటిక్స్ చెయ్యాల్సిన అవసరం లేదుంటూ, ఇంచార్జ్ మంత్రులు కి బి ఫార్మ్ విషయం లో పూర్తి స్వేచ్ఛ ఉంటుందన్నారు.

కేసీఆర్‌కు సిట్ నోటీసులు..
తెలంగాణ ఆత్మగౌరవానికి విఘాతం

- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకురాలు రజితా రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 29: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కి ఫోన్ టాపింగ్ కేసులో సిట్ నోటీసులు ఇవ్వడం, తెలంగాణ రాష్ట్ర ఆత్మగౌరవానికి నోటీసులు ఇవ్వడం లాంటిదని బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు రజితా రెడ్డి ఖండించారు. "తన ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కు ఈ రీతిగా నోటీసులు ఇవ్వడం అనేది తెలంగాణ ప్రజల నాలుగు కోట్ల ఆత్మగౌరవానికి విఘాతమన్నారు. రేవంత్ రెడ్డి వ్యక్తిగత కక్షతో కేసీఆర్ కుటుంబంపై వివిధ కేసులను వేసి వారిని జైలుకు పంపే ప్రయత్నాల్లో ఈ ఫోన్ టాపింగ్ కేసు భాగంగా ఉందని ప్రజలు గమనించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన 6 హామీలను అమలు చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ ప్రజల పక్షంలో పోరాడుతుంటే, రేవంత్ రెడ్డి దీన్నిడైవర్షన్ పాలిటిక్స్ కోసం ముందుకు తెస్తున్నారని ప్రజలు చూస్తున్నారు. రానున్న రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పే వరకు బిఆర్‌ఎస్ పార్టీ ప్రజల పక్షాన ముందుకు పోరాడుతుందన్నారు. రేవంత్ రెడ్డి ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని నోటీసులు ఇచ్చినా బిఆర్‌ఎస్ పార్టీ ప్రజల సమస్యలను ఎదుర్కొని నిలబడి ఉంటుంది" అని రజితా రెడ్డి స్పష్టం చేశారు.



నెయ్యి పేరుతో రసాయనాల మిశ్రమాన్ని తిరుమలకు సరఫరా చేశారు. రసాయనాలతో లడ్డూ చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీశారు. వైసీపీ అరాచకాలను ప్రజలకు చెబుతాం. శ్రీవారి లడ్డూ కల్తీ వ్యవహారంపై శాసనసభలో చర్చిద్దాం.

- జనసేన ఎమ్మెల్యేలతో ఏపీ డిప్యూటీ సీఎం పవన్

ఓపెన్ వాయిస్

ధనవంతుల ఆస్తిగా బంగారం

పెరుగుతున్న బంగారం ధరలు సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నాయ్. బంగారం సాధారణ ప్రజలకు అందుబాటులో లేకుండా పోయి ధనవంతుల ఆస్తిగా మారే సమయం వస్తుందని బ్రహ్మంగారు సంవత్సరాల క్రితం అంచనా వేశారన్నది సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న మాట. బంగారం ధరల ఈ పెరుగుదల ఇంకా ఎంతకాలం కొనసాగుతుంది? ఈ పెరుగుదల వెనకున్న కారణాలేంటి ? ప్రస్తుతం బంగారంలో పెట్టుబడి పెట్టడం సురక్షితమేనా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బంగారం ధరలు సామాన్యులకు అందనంతగా పెరుగుతాయని బ్రహ్మంగారు చాలా కాలం క్రితమే అంచనా వేశారు. భారతీయ సమాజానికి బంగారం కేవలం ఒక లోహం మాత్రమే కాదు ఇది సంప్రదాయం, విశ్వాసం , శుభంతో కూడా ముడిపడి ఉంది. ''బంగారం ఎప్పుడూ దుమ్ముగా మారదు '' అని ఒక సామెత ఉంది. అందుకే ప్రజలు బంగారాన్ని కేవలం ఆభరణాలుగా లేదా లోహంగా మాత్రమే కాకుండా పెట్టుబడిగా మన్నికైన ఆస్తిగా కూడా చూస్తారు. శతాబ్దాలుగా బంగారాన్ని సాంప్రదాయ ఆర్థిక వస్తువుగా పరిగణిస్తున్నారు. భారతీయ సంప్రదాయం, హిందూ సంస్కృతిలో దీనికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. మంగళసూత్రాలు, గాజులు ధరించడం భారతీయ వివాహిత మహిళల విశ్వాసం. ఇటీవల బంగారం ధరలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది.బంగారం మెరుపు ఎప్పుడూ వార్తల్లో ఉంటుంది, కానీ ఈ రోజుల్లో, దాని ధరలు నిరంతరం పెరుగుతుండటం చర్చనీయాంశంగా మారుతోంది. బంగారం ధరలు ప్రతిరోజూ కొత్త రికార్డులను సృష్టిస్తున్నాయి. కానీ బంగారం సాధారణ ప్రజలకు అందుబాటులో లేకుండా పోయి ధనవంతుల సొత్తుగా మారే సమయం వస్తుందని బ్రహ్మంగారు సంవత్సరాల క్రితం అంచనా వేశారట. ప్రస్తుత బంగారం ధరను చూస్తే, బ్రహ్మంగారు మాటలు ఇప్పుడు చాలావరకు నిజమయ్యాయనే చెప్పుకోవాలేమోచాలా సంవత్సరాల క్రితం కాలజ్ఞానం రాసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దక్షిణ భారతదేశానికి గొప్ప జ్ఞాని , దార్శనికుడిగా భావిస్తారు. బంగారం ధరతో సహా ఆయన అంచనాలు చాలా క్రమంగా నిజమవుతున్నాయి. బంగారం ధర చాలా పెరుగుతుందని, మహిళలు బంగారానికి బదులుగా ఇతర, చౌకైన పదార్థాలతో తయారు చేసిన నగలను ధరించడం ప్రారంభిస్తారని బ్రహ్మంగారు ముందే అంచనావేశారు. అప్పట్లో ఇది సాధ్యమయ్యేపనేనా? ఇదొక ఊహ మాత్రమే అనిపించినా ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే అలానే ఉంది. బంగారం కొనుగోళ్లు సామాన్యులకు భారంగా మారుతున్నాయి. పెరుగుతున్న బంగారం ధరలు ఇప్పుడు వివాహాలు, పండుగలు , సాంప్రదాయ షాపింగ్‌పై ప్రభావం చూపుతున్నాయి. ద్రవ్యోల్బణం కారణంగా, ప్రజలు ఇప్పుడు తక్కువ బరువు లేదా ఇతర లోహాలతో తయారు చేసిన ఆభరణాల వైపు మొగ్గు చూపుతున్నారు. బంగారం ధర పెరుగుతూనే ఉంది. ప్రస్తుతం, 24 క్యారెట్ల బంగారం ధర ₹1,62,100, 22 క్యారెట్ల బంగారం ధర ₹1,48,600, 18 క్యారెట్ల బంగారం ధర ₹1,21,610.నగరం , రోజును బట్టి ధరల్లో చిన్న చిన్న మార్పులుంటాయపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కాలజ్ఞానంలో భవిష్యత్ గురించి చాలా అంశాలు పద్యాలు, వచనాల రూపంలో చెప్పారు. అయితే బంగారం గురించి నేరుగా, స్పష్టంగా ధరలు పెరగడం గురించి ప్రత్యేకంగా లేదనే వాదనలు ఉన్నాయి. వాస్తవానికి బంగారం, ధరలు అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ విధానాలు స్టాక్ మార్కెట్ లో అనేక ఒడిదొడుకులకు కారణమయ్యాయి. ఫలితంగా, పెట్టుబడిదారులు బంగారం, వెండి వంటి లోహాలపై పెట్టుబడులు పెట్టేందుకు మొగ్గుచూపుతున్నారు.వెనెజ్వెలా అధ్యక్షుడు నికోలస్ మదురో నిర్బంధం తర్వాత బంగారం ధరలు పెరిగాయి. అలాగే, ఇరాన్ నిరసనకారులను హింసాత్మకంగా అణచివేస్తున్నారంటూ ట్రంప్ ఆ దేశ ప్రభుత్వంపై బెదిరింపులకు దిగారు. గ్రీన్‌లాండ్ స్వాధీనం గురించి కూడా ప్రస్తావించారు.సుంకాలు విధిస్తామంటూ యూరోపియన్ యూనియన్ దేశాలపై కూడా ఆయన బెదిరింపులకు దిగారు. వైట్ హౌస్ నుంచి కొనసాగుతున్న ఈ అనిశ్చితి మార్కెట్లను భయాందోళనకు గురిచేస్తోంది.చైనాతో వాణిజ్య ఒప్పందంపై సంతకం చేస్తే 100 శాతం సుంకాలు విధిస్తామంటూ గత శనివారం డోనల్డ్ ట్రంప్ కెనడాను హెచ్చరించారు. అయితే, తమకు అలాంటి ఉద్దేశం లేదని కెనడా ఆ తర్వాత పేర్కొంది.ఇవన్నీ పెట్టుబడిదారులను భయాందోళనకు గురిచేశాయి. ప్రపంచంలో ఏవైనా యుద్ధాలు, దురాక్రమణ, రాజకీయంగా భారీ ఉద్రిక్తతలు నెలకొన్న సమయంలో ప్రజలు తమ డబ్బును స్టాక్ మార్కెట్ లేదా అలాంటి ఇతర ప్రమాదకరమైన ఆస్తుల నుంచి వెనక్కుతీసుకుని.. బంగారం వంటి సంప్రదాయ, సురక్షిత ఆస్తులవైపు మళ్లించేందుకు మొగ్గుచూపుతారు.ఈ అనిశ్చితి, ప్రపంచ రాజకీయ ఉద్రిక్తతల కారణంగా పెట్టుబడిదారులు బంగారం వైపు మొగ్గుచూపారు. ఈ మొగ్గు బంగారం డిమాండ్‌ను పెంచడంతో పాటు ధరలు వేగంగా పెరగడానికి కారణమైంది.

ప్రతిపక్షం
హైదరాబాద్
శుక్రవారం
30.01.2026

రోహిత్ వేముల పరాజితుడా? విజేతనా?

మతం, జాతి, కులం, లింగం ఆధారిత వివక్ష ఫిర్యాదులను నివారించడానికి యూజీసీ మార్గదర్శకాలను విడుదల చేసింది. ఉన్నత విద్యా సంస్థల్లో కుల వివక్షతకు అడ్డుకట్ట వేయడానికి రోహిత్ వేముల చట్టం తేవాలని దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఈ మార్గదర్శకాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఇదంతా ఆ విద్యార్థి మరణం రాజేసిన యుద్ధానికి ప్రతిస్పందనలే. కానీ చట్ట రూపకల్పనలో మాత్రం అగ్రకుల పార్టీలన్ని ముసలి కన్నీరే కార్చుతున్నాయి.

సంపతి రమేష్
7989579428

భారతదేశం ఆధునికత వైపు పరుగులు తీస్తున్నట్లు కనిపించినా, కులం అనే చారిత్రక దుర్విచక్షణ ఇప్పటికీ వదలడం లేదు. ఇదీ గ్రామీణ వాడల నుంచి ఆధునిక నగరాల వరకు చాపకింద నీరులా వ్యాపించింది. విద్యాసంస్థల్లో, తరగతి గదుల్లోకి కూడా పాకింది. ఎందరో దళిత విద్యార్థుల స్వప్నాలను చిదిమేస్తుంది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్కాలర్ రోహిత్ వేముల ఆత్మహత్యనే ఇందుకు నిదర్శనం. ఆయన మరణించి పదేళ్లయిన సందర్భంగా ఇటీవల 2026 జనవరి 17న యూనివర్సిటీ ప్రాంగణంలో సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. అంబేద్కర్ స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా పలువులు సామాజిక కార్యకర్తలు, రాజకీయ నాయకులు, ప్రొఫెసర్లు హాజరయ్యారు. ఈ సభలో ఓ వక్త ప్రసంగిస్తూ రోహిత్ వేముల పరాజితుడా? విజేతనా? అనే ప్రశ్నతో ఉపన్యాసాన్ని ప్రారంభించాడు? ఆయన మాటలు పలువురిని ఆలోచింపచేసాయి. ఆయనే బహుజన రాజకీయాలపై పరిశోధించి(PhD చేసి) సమాజాన్ని మార్చడానికి బయలుదేరిన వ్యక్తి డాక్టర్ విశారదన్ మహరాజ్. వేల సంవత్సరాలుగా సమాజంలో అస్పృశ్యత అంటరానితనంతో బాధపడుతున్న దళితులకు భారత రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు ఉన్నత విద్యనభ్యసించే అవకాశం కల్పించాయి. కానీ అక్కడ కొనసాగుతున్న సంస్థాగత కులరక్కసి రోహిత్ వేములను బలిగొన్నది. ఆయన మరణం దేశ, విదేశ విద్యాసంస్థలలో చర్చనీయాంశంగా మారింది. పెద్ద ఎత్తున ఉద్యమాలు జరగాయి. అసలు ఈ దేశంలో క్యాన్సర్ తో బ్రతకచ్చేమో కానీ కులంతో బతకలేమని క్షేత్రస్థాయి వాస్తవాలు సైతం రుజువుచేస్తున్నాయి. రాజ్యాంగం, చట్టాలు కుల వివక్షతను రద్దు చేసినప్పటికీ, దాని ఛాయలు మాత్రం తొలగడం లేదు. నిత్యం కులం పేరుతో ఏదో ఒకచోట దళితులపై హత్యలు, ఆత్మహత్యలు, మానభంగాలు జరుగుతున్నాయి.

ఉన్నత విద్యాసంస్థల్లో కుల వివక్ష

భారతదేశంలో మేధావులను పుట్టించి, దేశ అభివృద్ధికి బీజం వేయాల్సిన ఉన్నత విద్యాసంస్థల్లోనూ కుల వివక్షత కొనసాగడం శోచనీయం. గత ఐదేండ్ల కాలంలో దేశంలోని యూనివర్సిటీలో, కళాశాలల్లో కులవివక్షత ఆధారిత ఫిర్యాదులు 118.4 శాతం పెరిగినట్లు యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ)డేటా స్పష్టం చేస్తుంది. రోహిత్ వేముల మరణించినతర్వాత దాఖలైన పిటిషన్ ఆధారంగా...2012 నిబంధనల ప్రకారం కులవివక్ష డేటాను సేకరించాలని సుప్రీంకోర్టు గత ఏడాది యూజీసి ఆదేశించింది. ఈ క్రమంలో యూజీసి పార్లమెంటరీ కమిటీకి, సుప్రీంకోర్టుకు సమర్పించిన డేటాలో కులవివక్షకు సంబంధించిన ఫిర్యాదులు 201920లో 173 నమోదు కాగా, 202324లో ఆ సంఖ్య 378కి పెరిగినట్లు పేర్కొన్నది. దేశవ్యాప్తంగా 704 యూనివర్సిటీలు, 1,553 కళాశాలలకు సంబంధించి ఈక్వల్ ఆపర్చునిటీస్ సెల్స్ (ఈఓసీలు), ఎస్సీ, ఎస్టీ సెల్స్ కు ఐదేళ్ల కాలంలో యూజీసీకి 1,160 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదులు అందుతున్నప్పటికీ పరిష్కారం నిష్పక్షపాతంగా జరుగుతుందా అనే అంశంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో ఇటీవల యూజీసి ఉన్నత విద్యా సంస్థల్లో సమతా సమితులు (Equity Committees) ఏర్పాటుకు ఆదేశాలు జారీచేసింది. మతం, జాతి, కులం, లింగం ఆధారిత వివక్ష ఫిర్యాదులను నివారించడానికి మార్గదర్శకాలను విడుదల చేసింది. ఉన్నత విద్యా సంస్థల్లో కుల వివక్షతకు అడ్డుకట్ట వేయడానికి రోహిత్ వేముల చట్టం తేవాలని దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఈ మార్గదర్శకాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఇదంతా ఆ విద్యార్థి మరణం రాజేసిన యుద్ధానికి ప్రతిస్పందనలే. కానీ చట్ట రూపకల్పనలో మాత్రం అగ్రకుల పార్టీలన్ని ముసలి కన్నీరే కార్చుతున్నాయి.

పూలే, అంబేద్కర్, కాన్సిరాం మిషన్ కొనసాగింపు ఏది?

రాజ్యాంగం అమలై 75 సంవత్సరాల దాటింది. రిజర్వేషన్ల ద్వారా లక్షలాది దళిత, బహుజనులు విద్యావంతులుగా, ఉద్యోగస్తులుగా మారారు. అయినప్పటికీ కుల వివక్షత, దాడులు, అణిచివేత ఆగడం లేదు. రోహిత్ వేముల మరణం, కారంచేడు, చుండూరు వంటి అమానవీయమైన ఘటనలు ఇందుకు నిదర్శనమే. ఈ కులాదారిత ఘటనలకు కారణం ఆధిపత్య కులాలని ఎత్తిచూపుతున్నాము. కానీ చారిత్రకంగా వాళ్ళ మెదళ్ళల్లో నాటుకుపోయిన వివక్షత జాడ్యాన్నీ తరమడానికి రిజర్వేషన్ ద్వారా లాభపడ్డ దళిత, బహుజన మేధావుల చైతన్యం ఎదని ఒకసారి బేరీజు వేసుకోవాల్సిన సందర్భం ఇది. మెజారిటీ దళిత మేధావి వర్గం తమ విముక్తికి సంబంధం లేని ఉద్యమాల్లో(ఉదా: రైతాంగ సాయుధ పోరాటం, నక్సలైట్ ఉద్యమం, తెలంగాణ ఉద్యమం, హిందీ వ్యతిరేక, నార్త్ ఇండియ వ్యతిరేక, మార్వాడీ ఉద్యమం) పాల్గొని పూలే, అంబేద్కర్, కాన్సిరాం మార్గాన్ని దారితప్పిస్తున్నారు. యూనివర్సిటీల్లో కొందరు దళిత అధ్యాపక మేధావి వర్గం విద్యార్థులను చదువులకు దూరంచేసి, వామపక్షాల వైపు నడిపిస్తూ కుటుంబాలను ఆగం చేస్తున్నారు. అంబేద్కర్ ను పుట్టించాల్సింది బదులు హెడ్మాలను పుట్టిస్తున్నారు. ఇంకొంత మంది యూనివర్సిటీలో చదువుకున్న విద్యార్థి మేధావులు పాటలు, కవిత్వం, సాహిత్యంతో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి చెంచాగిరి చేస్తూ అంబేద్కర్ ఐడియాలజీని పణంగా పెట్టి ప్రయోజనాలు పొందుతున్నారు. కొంతమంది దళిత ఉద్యమకారులు గోరంత లాభానికి గొండత జాతిని బలిచ్చి అగ్రవర్ణ పార్టీలను అందలమెక్కిస్తున్నారు. పాలకులను సంతృప్తి పరుస్తూ పురస్కారాలను పొందుతున్నారు. ఇంకొందరు విప్లవం రావాలని కోరుకుంటారు, కానీ పక్కింట్లో రావాలంటారు. తన భాగస్వామ్యం ఉండాలని కోరుకొరు. మరికొందరు దళిత మేధావులు అంబేద్కర్ ముచ్చట్లు చెప్పుకొంటు ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వంలో పదవులు అనుభవిస్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రయోజనం పొందారు, ఈ ప్రభుత్వంలో కూడా పొందుతున్నారు. ఇలా స్పష్టమైన దిశ లేకుండా తెగిన గాలిపటంలా వివిధ పార్టీలకు, ఉద్యమాలకు దగ్గరై నికార్సైన బహుజన ఉద్యమాలకు దూరమవుతున్నారు. దీపస్థంభం లేకుండా ప్రయాణిస్తున్నారు. ఇలాంటి వారి వల్లనే రోహిత్ వేముల లాంటి దళిత విద్యార్థులకు, ఐపీఎస్ పూరణ్ కుమార్ లాంటి ఉద్యోగస్తులకు రక్షణ లేకుండా పోయింది. ఏ కులం అధికారంలో ఉంటుందో ఆ కులంపైన దాడులు జరగవునీ కాన్సిరాం చెప్పాడు. అంబేద్కర్ అంటే హక్కుల పోరాటం కాదు, అగ్రవర్ణాలిచ్చే పదవులు, సంక్షేమ పథకాలు కాదు. ఓటనే ఆయుధంతో రాజ్యాధికార యుద్ధమే. రాజ్యాధికారం అంటే అగ్రకుల పార్టీల్లో పనిచేయడం కాదు, స్వశక్తితో నడిచి బహుజన పార్టీలో పనిచేయడం. 1956 మార్చి 18న ఆగ్రా మహాసభలో అంబేద్కర్ విద్యావంతులు, ఉద్యోగస్తులు నన్ను మోసం చేశారని కంటతడి పెట్టుకున్నాడు. ఇప్పటికైనా ఆయన ఉద్యమాన్ని రిజర్వేషన్ ద్వారా లాభపడ్డ బుద్ధిజీవులంతా ముందుకు నడిపించినప్పుడే దళితులపై అఘాయిత్యాలు ఆగుతాయాని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో నొక్కి చెప్పిన బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్ మాటలు ముమ్మాటికి అక్షర సత్యం. ఇదే రోహిత్ వేములకు నివాళి. దళిత జాతిలో పుట్టడం అంటేనే యుద్ధ రంగంలో పుట్టడం. ఎవరు కూడా ఆత్మహత్యలకి పాల్పడవద్దు. సమ్మక్క సారలమ్మలాగా తుది శ్వాస వరకు ఆధిపత్య కులాలపై పోరాడాలి. ఇదే జీవిత అంతిమ గమ్యం.

(వ్యాస రచయిత సామాజిక విశ్లేషకులు)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

మనిషిని మనిషి మర్చిపోవడమే అసలు సమస్య

యండి. ఉస్మాన్ ఖాన్
9912580645

ప్రస్తుత కాలంలో మనం ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన సంక్షోభం వనరుల కొరత కాదు, అభివృద్ధి లోపం కూడా కాదు. అసలు సమస్య మనిషి, మనిషిని మరిచిపోవడం. మానవత్వం విలువ కోల్పోవడమే నేటి ప్రపంచానికి అతి పెద్ద ప్రమాదంగా మారింది. విచారకరమైన విషయం ఏమిటంటే, మానవ గౌరవాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన ముస్లిం సమాజం కూడా ఈ నిర్లక్ష్యంలో భాగం కావడం. ఈ సందర్భంలో ముస్లిం సమాజం కూడా ఆత్మ పరిశీలన చేసుకోవలసిన అవసరం ఉంది. ఇస్లాంధర్మం మొట్ట మొదట మనిషికి అనుగ్రహించిన గొప్ప బహుమతి గౌరవం. అది జాతి ఆధారంగా, మతం ఆధారంగా కాదు, భాష, రంగు, దేశం ఆధారంగానూ కాదు, కేవలం మనిషి కావడం ఆధారంగా ఇచ్చిన గౌరవం. పవిత్ర ఖురాన్ స్పష్టంగా ప్రకటిస్తోంది: 'మేము ఆదమ్ సంతానానికి గౌరవాన్ని ప్రసాదించాము.' ఇక్కడ 'ముస్లిం' అని లేదు, 'విశ్వాసి' అనీ లేదు కేవలం ఆదమ్ సంతానం అని చెప్పడం గమనార్హం. అంటే ప్రతి మనిషి సహజంగా గౌరవానికి అర్హుడు. అతని ప్రాణం పవిత్రం, అతని ఆస్తి పవిత్రం, అతని ఆత్మ గౌరవం పవిత్రం. అందుకే పవిత్ర ఖురాన్ అనేక చోట్ల 'ఓ మానవులారా!' అంటూ మొత్తం మానవజాతిని సంబోధించింది. ఇస్లాం ఒక వర్గానికి పరిమితమైన ధర్మం కాదు; అది సార్వత్రిక మానవ మార్గదర్శకత్వం.

మానవ ప్రాణం విలువ

ఇస్లాంలో మానవ ప్రాణానికి ఉన్న విలువను అర్థం చేసుకోవాలంటే పవిత్ర ఖురాన్ లోని ఈ ఒక్క వాక్యం చాలు: 'ఒక నిరపరాధిని హత్య చేసినవాడు, మొత్తం మానవజాతిని హత్య చేసినట్లే.' ఒక వ్యక్తిపై అన్యాయం చేయడం, ఒక వ్యక్తిని అవమానించడం, ఒకరి గౌరవాన్ని కాలరాయడం, ఇవన్నీ వ్యక్తిగత నేరాలు కావు; ఇవి సమాజపు నైతిక పతనానికి సంకేతాలు. ఈ భావనను దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వీడ్కోలు హజ్ సందర్భంగా చాలా స్పష్టంగా చెప్పారు: 'మీ ప్రాణాలు, మీ ఆస్తులు, మీ గౌరవం ఇవన్నీ పరస్పరం పవిత్రమైనవి.' ఇది ఇస్లాం ఇచ్చిన మానవ హక్కుల భావన.

ప్రవక్త జీవితమే మానవత్వానికి సాక్ష్యం

ఇస్లాం మానవ గౌరవాన్ని కేవలం సిద్ధాంతంగా చెప్పలేదు; ప్రవక్త జీవితం దానికి ప్రత్యక్ష ఉదాహరణ. ఒకసారి ఒక యూదుడి మృతదేహం ఆయన కూర్చున్నచోటు మీదుగా వెళుతున్నప్పుడు ప్రవక్త గౌరవంగా లేచి నిలబడ్డారు. ఆశ్చర్యపోయిన సహచరులు 'అతను యూదుడు కదా!' అన్నారు. అందుకు ప్రవక్త ఇలా సమాధానం చెప్పారు: 'కావచ్చు, అయినా తను మనిషే కదా?' అన్నారు. ఈ సమాధానంలో మొత్తం ఇస్లామీయ మానవ దృక్పథం దాగి ఉంది. బానిసలు, సేవకులు, కార్మికుల గురించి ప్రస్తావిస్తూ; 'వారు మీకు సోదరులు' అన్నారు ప్రవక్త మహనీయులు. ఇది ఎంతగొప్ప ఆదరణ! ఈనాడు

మన ఆధీనంలో ఉన్నవారితో మనం ఎలా వ్యవహరిస్తున్నామో ఆలోచించుకోవాలి. వారితో కఠినంగా మాట్లాడడం, పరుష పదజాలం ప్రయోగించడం, వారి హక్కుల ఉల్లంఘన, వారికి ఇవ్వవలసిన జీతం/వేతనం ఆలస్యంగా ఇవ్వడం ఇవన్నీ మానవత్వంపై దాడులే.

మహిళలు - బలహీనవర్గాలు

ఇస్లాంకు పూర్వం మహిళ అస్తిత్వమే ప్రశ్నార్థకంగా ఉండేది. ఇస్లాం వచ్చి ఆమెకు గౌరవం ఇచ్చింది, హక్కులు ఇచ్చింది, భద్రత ఇచ్చింది. ప్రవక్త ప్రవచనం ఇలాఉంది: 'మీ ఇంటివారితో మంచిగా ఉండేవాడే మీలో ఉత్తముడు.' ఇది మహిళా హక్కుల గురించిన ప్రస్తావన మాత్రమే కాదు, మానవ సంస్కారాల కొలమానం. ఇస్లాం జంతువుల పట్ల కూడా దయను బోధించింది. దాహంతో ఉన్న కుక్కకు నీళ్లు తాగించిన మహిళకు క్షమాభిక్ష లభించింది. పిల్లిని బంధించి బాధ పెట్టిన మహిళ శిక్షకు గురైంది. జంతువుల పట్లనే ఈ స్థాయి దయ, మానవీయత ఉంటే, మనిషి పట్ల ఇస్లాం దృక్పథం ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

మానవత్వానికి సవాలు

ఈనాడు ప్రపంచం వేగంగా మారిపోతోంది, శాస్త్ర సాంకేతిక రంగాల్లో అప్రతిహతంగా దూసుకుపోతోంది. కానీ మానవ విలువలు తగ్గిపోతున్నాయి. మనిషిని అతని ప్రవర్తనతో కాకుండా, భాష, ప్రాంతం, పేరు, దుస్తుల ఆధారంగా అతణ్ని గుర్తించడం జరుగుతోంది. సోషల్ మీడియా ఈ పతనాన్ని మరింత వేగవంతం చేసింది. ఒక పోస్ట్, ఒక వ్యాఖ్య, ఒక అబద్ధపు ప్రచారం ఒక నిండు జీవితాన్ని అగాధంలోకి నెట్టేస్తోంది. ప్రవక్త వారు ఇలా హెచ్చరించారు: 'దైవంపై, పరలోకంపై విశ్వాసం ఉన్నవాడు నోరు విప్పితే మంచి మాట్లాడాలి, లేకపోతే మౌనంగా ఉండాలి.' మౌనం కూడా కొన్ని సందర్భాల్లో గొప్ప ఆరాధనగా పరిగణించబడుతుంది.

మన బాధ్యత ఏమిటి?

ఎవ్వరినీ తక్కువగా చూడకూడదు. ప్రవక్త మహనీయులు ఇలా అన్నారు: 'తను చెడ్డవాడు అనిపించుకోడానికి ఇతరులను తక్కువగా చూడడం ఒకటే చాలు.' భేదాభిప్రాయాలు సహజం. కానీ అవి ద్వేషంగా మారితే, మనం మానవత్వాన్ని కోల్పోతాం. అభిప్రాయ భేదం ఉన్నా, సభ్యత, సంస్కారాన్ని కోల్పోకూడదు. మనసు పవిత్రంగా ఉండాలి. మన మాటలు, మన రాతలు, ఇవన్నీ బాధ్యతతో ఉండాలి. ప్రతి మాటకు లెక్క చెప్పుకోవలసి ఉంటుంది. బలహీనుల పక్షాన నిలబడటం ఇస్లాం ఆత్మ. అనాథలు, విధవలు, పేదలు, వికలాంగులు ఇలాంటి వారి పట్ల మన ప్రవర్తనే మన విశ్వాసానికి అద్దం. 'అనాథలను అక్కున చేర్చుకునేవాడు, నేను, స్వర్గంలో పక్కపక్కనే ఉంటాం.' అని ప్రవక్త మహనీయులు సెలవిచ్చారు. న్యాయం విషయంలో కుటుంబం, బంధువర్గం, స్వలాభం అడ్డురా కూడదు. న్యాయం చనిపోయిన చోట మానవత్వం సమాధి అవుతుంది. ప్రతీకారం తీర్చుకోవడం శక్తికి కొలమానం కావచ్చు, కానీ క్షమించే గుణం మహాగొప్ప బలం. కనుక, దైవంతో బంధాన్ని బలపరుచుకోవాలి. మనుషులతో సంబంధాన్ని దృఢపరుచుకోవాలి. మానవత్వానికి గౌరవం అదనపు విలువ కాదు; అది విశ్వాసానికి ప్రాణం. మన ప్రార్థనలు, మన సత్కర్మలు మనల్ని మెరుగైన మనుషులుగా మార్చలేకపోతే, మనం ఆత్మపరిశీలన చేసుకోవడం తప్పనిసరి. ఈనాడు ఇస్లాం గురించి ప్రపంచానికి చెప్పాల్సిన గొప్ప సందేశం కొత్త కొత్త నినాదాలు కావు, ఘర్షణాత్మక వాదనలు కావు. మన ప్రవర్తన, మన మాట, మనలోని క్షమాగుణం, మన న్యాయం ఇవే ఇస్లామీయ ప్రభావశీల సందేశం. ఎదుటి మనిషిని గౌరవించే ప్రతి చర్య ఒక సందేశం; మనిషిని అవమానించే ప్రతి చర్య ఇస్లాం ప్రతిష్ఠపై ఒక మచ్చ. ఈనాడు మతాలకన్నా, సిద్ధాంతాలకన్నా, రాజకీయాలకన్నా, మనిషిని, మానవత్వాన్ని కాపాడడం అత్యవసరం. ఇదే ఇస్లాం మానవాళికి ఇచ్చే సార్వత్రిక, శాశ్వత సందేశం.

(వ్యాసరచయిత సీనియర్ జర్నలిస్ట్)

నల్లమల అడవిలో దాహార్తి

కె బాపురావు
95533 07006

నల్లమల అడవులు.. దక్షిణ భారతదేశానికి ఊపిరితిత్తుల్లాంటివి. జీవ వైవిధ్యానికి నిలయంగా, అరుదైన వృక్షజాలం-జంతుజాలానికి ఆశ్రయంగా నిలిచిన ఈ అరణ్యం నేడు తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో అడవిలోని సహజ నీటి వనరులు పూర్తిగా ఎండిపోయాయి. ఫలితంగా అక్కడ నివసిస్తున్న అడవి జంతువులు తాగునీరు లేక తీవ్రంగా అలమటిస్తున్నాయి. ఇది కేవలం ప్రకృతి విపత్తు మాత్రమే కాదు.. పాలనా వైఫల్యానికి స్పష్టమైన ప్రతిబింబం కూడా. నల్లమల ప్రాంతంలో సాధారణంగా చెరువులు, వాగులు, గుంతలు వంటి సహజ నీటి వనరులు వేసవి కాలంలోనూ కొంతవరకు జంతువులకు ఉపశమనంగా ఉండేవి. కానీ ఈ ఏడాది వర్షాలు చేతికందకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. అడవిలోని జంతువులు దాహార్తితో అడవుల నుంచి బయటకు రావడం, గ్రామాల సమీపానికి చేరడం, ప్రమాదాలకు గురవడం వంటి సంఘటనలు పెరుగుతున్నాయి. ఇది జంతువులకు మాత్రమే కాదు, మనుషులకు కూడా ప్రమాదకరమైన పరిణామమే. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. అటవీ శాఖ, పర్యావరణ శాఖ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి. కానీ వాస్తవంలో చూస్తే పరిస్థితిపై ప్రభుత్వ స్పందన చాలా మందగించింది. కొద్ది ప్రాంతాల్లో తాత్కాలికంగా నీటి తొట్లు ఏర్పాటు చేసినా, అవి సరిపోవడం లేదు. విస్తారమైన నల్లమల అడవులకు ఇవి చుక్కల్లో మునకలే. అడవి జంతువులకు తాగునీరు అందించడం ప్రభుత్వానికి దయాదాక్షిణ్యం కాదు అది రాజ్యాంగ బాధ్యత. పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ అనేవి కేవలం ప్రకటనలకే పరిమితం కావద్దు. ఎండాకాలం ప్రారంభమయ్యే ముందే అడవుల్లో నీటి లభ్యతపై ప్రణాళిక ఉండాలి. బోరు బావుల ద్వారా సోలార్ మోటార్లతో నీటిని తొట్లకు పంపించడం, పాత చెరువులు-వాగులను పునరుద్ధరించడం, వర్షపు నీటి నిల్వకు శాశ్వత ఏర్పాట్లు చేయడం వంటి చర్యలు ఇప్పటికైనా చేపట్టాల్సిందే. అటవీ ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా నీటి వనరుల స్థితిని పర్యవేక్షించడం, అత్యవసర పరిస్థితుల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయడం కూడా సాధ్యమే. ఇవన్నీ ఖర్చుతో కూడుకున్న పనులుగా ప్రభుత్వం భావిస్తే.. అడవులు నశించిన తర్వాత చెల్లించాల్సిన మూల్యం మరింత ఎక్కువగా ఉంటుందని గుర్తించాలి. అధికారులు కూడా ఫైళ్లకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పరిస్థితిని అంచనా వేయాలి. "వర్షాలు వస్తే చూసుకుందాం" అనే నిర్లక్ష్య ధోరణి వదిలేయాలి. ప్రకృతి మన హెచ్చరికలు ఇవ్వడం మొదలుపెట్టింది. ఇప్పటికైనా మేల్కొనకపోతే, రేపు ఎదురయ్యే పర్యావరణ విపత్తులకు మనమే బాధ్యులం. నల్లమల అడవులు మనవి కావు... మనం నల్లమల అడవుల వాళ్లం. అక్కడి జంతువుల దాహం తీర్చడం అంటే ప్రకృతితో మన బాధ్యతను నెరవేర్చడమే. ప్రభుత్వం తక్షణమే సమగ్ర కార్యాచరణ ప్రకటించి అమలు చేయాలి. లేదంటే, మౌనంగా చూస్తూ ఉండే ఈ పాలనపై ప్రజల ప్రశ్నలు మరింత ఘాటుగా మారడం ఖాయం.

(వ్యాస రచయిత జర్నలిస్ట్)

పరిశుభ్రమైన గాలితోనే నిజమైన అభివృద్ధి

- ప్రభుత్వం శాస్త్రీయ విధానాన్ని అనుసరిస్తుంది
- గాలి నాణ్యత పర్యవేక్షణకు 40 కొత్త స్టేషన్లను ఏర్పాటు
- త్వరలో గాలి నాణ్యత డాష్ బోర్డులను ప్రారంభిస్తాం
- కాలుష్య ఫిర్యాదులపై వేగంగా స్పందించేందుకు ప్రత్యేక బృందాలు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 29: పరిశుభ్రమైన గాలితోనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. అందుకే ఈ విషయంలోతెలంగాణ ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యంతో శాస్త్రీయ విధానాన్ని అనుసరిస్తుందని, హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్ర ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ కేబినెట్ ముందుకు వెళుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి విభాగంలో "గాలి నాణ్యత సూచీ మరియు గాలి నాణ్యత నిర్వహణ" అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సదస్సు యొక్క స్పష్టమైన, ఉన్నత లక్ష్యం ఆరోగ్యవంతమైన తెలంగాణ కోసం స్వచ్ఛమైన గాలి అన్నారు. నేడు తెలంగాణ దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో ఒకటి, హైదరాబాద్ ఐటీ, లైఫ్ సైన్సెస్, తయారీ, ఆవిష్కరణల కేంద్రంగా ఎదిగిందని, ఈ అభివృద్ధి మనకు గర్వకారణం అని తెలిపారు. అదే సమయంలో ఇది మనపై బాధ్యతను కూడా మోపుతుందని అన్నారు. సుస్థిర అభివృద్ధి ద్వారా మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యాన్ని సాధించాలనే దృఢ సంకల్పంతో మా ప్రభుత్వం పనిచేస్తోందనీ తెలిపారు. అదే సమయంలో జలాశయాల పునరుద్ధరణ, సహజ వనరుల సంరక్షణ, గాలి నాణ్యత మెరుగుదలపై కూడా తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతోందని డిప్యూటీ సీఎం తెలిపారు. 2024 'స్టేట్ ఆఫ్ గ్లోబల్ ఎయిర్ రిపోర్ట్' సహా ప్రపంచ స్థాయి అధ్యయనాలు ఈ సమస్య తీవ్రతను స్పష్టంగా చూపుతున్నాయి అని తెలిపారు. నేడు గాలి కాలుష్యం, అధిక రక్తపోటు తర్వాత, ప్రపంచంలో మరణాలకు రెండో ప్రధాన కారణంగా మారిందని, ప్రతి ఏడాది 80 లక్షలకు పైగా అకాల మరణాలకు ఇది కారణమవుతోంది అన్నారు. హైదరాబాద్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలలో ఒకటిగా ఇప్పటికే గుర్తింపు పొందిందని, ఇది మనందరికీ గర్వకారణం, కానీ అదే సమయంలో మన నగర వ్యవస్థలు కూడా అంతే వేగంగా పరిపక్వం చెందాలి అని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు. మనం కొలవలేని దాన్ని మనం నిర్వహించలేం.గాలి నాణ్యత పర్యవేక్షణ నెట్‌వర్క్‌ను రెట్టింపు చేస్తూ, రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన పట్టణాల్లో 40 కొత్త స్టేషన్లను ఏర్పాటు చేశాం. దీని ద్వారా రియల్ టైమ్, విశ్వసనీయ డేటా అందుతుందని తెలిపారు. ప్రణాళిక 2025లో రాష్ట్ర గాలి శుభ్రత కార్యాచరణ ప్రణాళికను రూపొందించామని వాహనాలు, రోడ్డు ధూళి, నిర్మాణాలు, పరిశ్రమలు, బహిరంగ దహనం వంటి ప్రధాన కాలుష్య మూలాలను ఈ ప్రణాళిక పరిష్కరిస్తోందని, ఇది ఇప్పటికే అమలులో ఉందని తెలిపారు. స్వచ్ఛమైన రవాణా కోసం ఎలక్ట్రిక్ వాహనాలకు సబ్సిడీలు అందిస్తున్నామని, .ఈ- బస్సులు, మెట్రో విస్తరణ ద్వారా ప్రజా రవాణాను బలోపేతం చేస్తున్నామని అన్నారు. పరిశ్రమల ఉద్గారాలను నిరంతర పర్యవేక్షణ వ్యవస్థల ద్వారా కాలుష్య నియంత్రణ మండలి సర్వర్లకు అనుసంధానించామని, శుభ్రమైన ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని, నియమావళి అమలును కఠినతరం చేస్తున్నాం అని వివరించారు.

ప్రతి నామినేషన్ పత్రాన్ని నిశితంగా పరిశీలించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ కె. చంద్రారెడ్డి

ప్రతిపక్షం,మొయినాబాద్, జనవరి 29 : ఎన్నికల నామినేషన్ల పత్రాలను నిశితంగా పరిశీలించి స్వీకరించాలని జిల్లా అదనపు కలెక్టర్ కె. చంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎంఆర్పిఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన నామినేషన్ల కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం నామినేషన్ల స్వీకరణ జరుగుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి నామినేషన్ పత్రాన్ని నిశితంగా పరిశీలించాలని సిబ్బందికి సూచించారు. నామినేషన్ కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తును సమీక్షించారు. నామినేషన్ ప్రక్రియ మొత్తం జాగ్రత్తగా చేయాలని, ఎక్కడా జాప్యం జరగకుండా పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట అధికారులు, తదితరులున్నారు.

పోస్టల్ సేవలపై

ఫ్రాంచైజీల కోసం దరఖాస్తుల ఆహ్వానం

- కరీంనగర్ డివిజన్ పోస్టల్ ఎస్పీ శివాజీ

ప్రతిపక్షం, కరీంనగర్, జనవరి 29: ఏపీటీ 2.0 సాంకేతికత ద్వారా పోస్టల్ సేవలను విస్తరించేందుకు కరీంనగర్ పోస్టల్ డివిజన్ పరిధిలో స్పీడ్ పోస్ట్, పార్సెల్, అంతర్జాతీయ మెయిల్ సేవల బుకింగ్, పికప్ మరియు డెలివరీ సేవల కోసం న్యూ పోస్టల్ ఫ్రాంచైజ్‌ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కరీంనగర్ డివిజన్ పోస్టల్ ఎస్పీ కె.శివాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ https://indiapost.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ లో దరఖాస్తులు స్వీకరించబడతాయని, నోటిఫికేషన్ విడుదల తేదీ నుంచి కనీసం 21 రోజులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ నోటిఫికేషన్లకు సంబంధించి మూడు నెలలకొకమారు (ఏప్రిల్, జూలై, అక్టోబర్ మరియు జనవరి) మొదటి వారంలో విడుదల చేయబడతాయని వివరించారు. ఫ్రాంచైజ్‌ల కోసం 18 సంవత్సరాలు పైబడినవారు అర్హులని, కనీసం ఇంటర్మీడియట్ (డెలివరీ మాత్రమే అయితే 10వ తరగతి), ప్రాథమిక కంప్యూటర్ పరిజ్ఞానం మరియు తగిన ప్రాంగణం కలిగి ఉండాలని, భారత దేశంలో నమోదు అయిన సంస్థలు కూడా అర్హులని, ఈ పథకం ద్వారా కమిషన్ ఆధారిత ఆదాయం మరియు ప్రోత్సాహకాలు లభిస్తాయని, పూర్తి వివరాలకు సమీప పోస్టాఫీస్ లేదా సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసు కార్యాలయంలో సంప్రదించాలని ఎస్పీ ఆ ప్రకటనలో వివరించారు.

మేడిగడ్డ బ్యారేజ్‌కు కేంద్రం రెడ్ అలర్ట్

మొదటిపేజీ తరువాయి

రెడ్ అలర్ట్ జారీ చేసింది. లోపాలు వెంటనే సరిచేయకపోతే ప్రమాదమని హెచ్చరిస్తూ కేటగిరి-1 డ్యామ్‌గా ప్రకటించింది. మేడిగడ్డ భద్రతపై తక్షణ చర్యలు చేపట్టాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. మేడిగడ్డ లోపాలు పరిష్కరించకపోతే ప్రమాదం అని హెచ్చరించింది. కేటగిరి 1 ప్రమాదకర డ్యామ్ గా మేడిగడ్డను ప్రకటించింది. 2025 పోస్టు మాన్సూన్ లో నిర్వహించిన తనిఖీలలో తీవ్ర లోపాలను గుర్తించినట్లుగా కేంద్రం పేర్కొంది. మేడిగడ్డ బ్యారేజీలోని లోపాలు తక్షణం పరిష్కరించకపోతే ప్రమాదం అని హెచ్చరించింది. వెంటనే లోపాల నివారణకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేసింది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం పేర్కొంది. కేటగిరి 1 ప్రమాదక డ్యాముల జాబితాలో దేశంలోని మూడింటిలో మేడిగడ్డతో పాటు యూపీలోని ఖజూరీ డ్యామ్, జార్ఖండ్ లోని బొకరో డ్యాము ఉన్నాయని పేర్కొంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కుంగిపోయిన మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ, మరమ్మతుల కోసం తెలంగాణ ప్రభుత్వం ఎల్ అండ్ టీ సంస్థపై ఒత్తిడి పెంచుతోంది. వెంటనే పనులు చేపట్టకపోతే బ్లాక్‌లిస్టులో పెడతామని హెచ్చరించింది. క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తుది నోటీసులు సైతం ఇచ్చింది. ఎన్డీఎస్ఏ నివేదిక ప్రకారం, నిర్మాణ లోపాల వల్ల జరిగిన ఈ నష్టానికి 7వ బ్లాక్‌ను పూర్తిగా తొలగించాలని సూచించింది. మరమ్మతుల కోసం 5 సంస్థలు ముందుకు వచ్చినట్లు తెలుస్తోంది. మేడిగడ్డతో పాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులను జరిపించాల్సి ఉంది. మేడిగడ్డ బ్యారేజీ కుంగిన తర్వాత దర్యాప్తు చేసిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్మాణ సంస్థతో పాటు బాధ్యులైన ఇంజినీర్లపై క్రిమినల్ చర్యలకు సిఫార్సు చేసింది. పునరుద్ధరణకయ్యే ఖర్చును నిర్మాణ సంస్థ భరించాలని, ఇందుకు అంగీకరించకపోతే ప్రభుత్వం రికవరీ చేయాలని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సూచించింది.

పూర్తయిన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేయాలి

- పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి
- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆదేశం
- జీహెచ్ఎంసీ 11వ సాధారణ స్టాండింగ్ కమిటీ సమావేశం



ప్రతిపక్షం సిటీ బ్యూరో, హైదరాబాద్, జనవరి 29: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పూర్తి అయిన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. స్థానిక కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులను ప్రారంభోత్సవ కార్యక్రమాలలో తప్పనిసరిగా భాగస్వామ్యం చేయాలని సూచించారు. అదేవిధంగా, పెండింగ్‌గా ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయడం ద్వారా ప్రజలకు సౌకర్యం కల్పించాలని చెప్పారు. గురువారం, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన 11వ సాధారణ స్టాండింగ్ కమిటీ సమావేశం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో జరిగింది. ఈ సమావేశంలో మొత్తం 21 ఎజెండా అంశాలు, 23 సప్లిమెంటరీ అంశాలను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన ఉన్న స్టాండింగ్ కమిటీ పరిశీలించి ఆమోదం తెలిపింది. అలాగే, టేబుల్ అంశాలుగా ప్రవేశపెట్టిన మొత్తం 8 ప్రతిపాదనలలో 6 అంశాలకు కమిటీ ఆమోదం తెలిపింది. మిగతా రెండు అంశాలను కౌన్సిల్ ఆమోదానికి కమిటీ సిఫారసు చేసింది. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, స్టాండింగ్ కమిటీ సభ్యులు బొంతు శ్రీదేవి, బానోతు సుజాత, సయ్యద్ మినాజుద్దీన్, సమీనా బేగం, అబ్దుల్ వాహెబ్, మహమ్మద్ సలీం, మహాలక్ష్మి రమన్ గౌడ్, సీఎన్.రెడ్డి, మహమ్మద్ బాబా ఫసియుద్దీన్, వి.జగదీశ్వర్ గౌడ్, బూరుగడ్డ పుష్ప పాల్గొన్నారు. ఈ సమావేశంలో స్టాండింగ్ కమిటీ ద్వారా అనుమతులు అందిన ప్రధాన అంశాల్లో సనత్‌నగర్, ఫతేనగర్ ప్రాంతాల్లో స్టార్మ్ వాటర్ డ్రెయినేజ్ మరియు సీవరేజ్ నెట్‌వర్క్ పనులు, పటేల్ నగర్ నుంచి డీమార్ట్‌వరకు 36 మీటర్ల వెడల్పు రోడ్డు అభివృద్ధి పనులు, నగరవ్యాప్తంగా ఏటీఎస్సీ ట్రాఫిక్ సిగ్నల్ సిస్టమ్ నిర్వహణ కాంట్రాక్ట్ పొడిగింపు, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్లుగా డ్రాఫ్ట్స్‌మన్ గ్రేడ్-IIIలను ప్రమోషన్, యువతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ఎంవోయూ పొడిగింపు, బేగంబజార్ ఫిష్ మార్కెట్‌లో దుకాణాల కేటాయింపు, మలక్‌పేట్ మున్సిపల్ క్వార్టర్ రిజిస్ట్రేషన్, కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో యూజర్ ఫీజు నిర్ణయం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణం, రోడ్లు, డ్రెయిన్‌లు, ఫ్లైఓవర్లు, పార్కులు, వన్‌స్టాప్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఫుట్‌బాల్ గ్రౌండ్ అభివృద్ధి తదితర అభివృద్ధి కార్యక్రమాలు ఉన్నాయి. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులు, స్థానిక ప్రతినిధులు, మరియు కార్పొరేషన్ సిబ్బంది కలిసి ఈ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, నగర ప్రజలకు అద్భుతమైన సౌకర్యాలను అందించే దిశగా చర్యలు చేపట్టాలని స్పష్టంగా సూచించారు.

హార్వర్డ్ విద్యార్థులతో సీఎం రేవంత్ భేటీ

- హార్వర్డ్ విద్యార్థులతో సీఎం రేవంత్ భేటీ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 29: హార్వర్డ్ యూనివర్సిటీ క్యాంపస్‌లోని ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ బిజినెస్ స్కూల్ లో చదువుతున్న భారతీయ విద్యార్థుల బృందం, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తమ కళాశాల సందర్శనకు ఆహ్వానించింది. రోజువారీ షెడ్యూల్, తరగతులు, అసైన్‌మెంట్ తో బిజీగా ఉన్నప్పటికీ, విద్యార్థుల ఆహ్వానానికి స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి, వారికి సమయం కేటాయించి స్నేహపూర్వకంగా మమేకమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల కెరీర్ లక్ష్యాలు, భవిష్యత్ అవకాశాలు, ఎదుర్కొంటున్న సవాళ్లు గురించి తెలుసుకున్న సీఎం, వృత్తి జీవితానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. అలాగే తన జీవిత అనుభవాల ఆధారంగా విజయానికి మంత్రం ఏమిటో వారికి వివరించారు. 'తెలంగాణ రైజింగ్' కార్యక్రమంలోని ముఖ్యాంశాలను వివరిస్తూ, తమ ప్రతిభ, గ్లోబల్ నెట్‌వర్క్‌ను ఉపయోగించి భారతదేశ అభివృద్ధిలో భాగస్వాములవ్వాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అంతేకాకుండా, హైదరాబాద్, తెలంగాణ అవకాశాలు, బలాలను ప్రపంచానికి పరిచయం చేసే బ్రాండ్ అంబాసిడర్లుగా వారు ముందుకు రావాలని కోరారు. ఈ భేటీ విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపగా, సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలు వారికి ప్రేరణగా నిలిచాయని విద్యార్థులు అభిప్రాయపడ్డారు.

మహిళల భయాలను ఆసరాగా

ఆకతాయిల బ్లాక్ మెయిల్

- వాళ్లకు పోలీసులు అంటే భయం ఉండేలా చర్యలు ఉండాలి
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 29: మహిళల భయాలను ఆసరాగా చేసుకుని కొందరు ఆకతాయిలు బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతున్నారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనల్లో మహిళలకు పోలీసులు అండగా ఉండాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు అభినందనీయమని అన్నారు. గురువారం గాంధీ భవన్ లో జరిగిన మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ.. ఇంటిదగ్గరే ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసే విధానంపై సిఐడి అధికారి చారు సిన్హా చేసిన ప్రకటన మహిళలకు, ఆడపిల్లల తల్లిదండ్రులకు ఒక రక్షణ కవచంలాంటిదని తెలిపారు. డీజీపీ శివధర్ రెడ్డి, సీపీ సజ్జనర్ ఆధ్వర్యంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తీసుకున్న ఈ నిర్ణయాలు మంచి ఫలితాలు ఇస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆడపిల్లలతో ఫోటోలు తీసుకుని బ్లాక్ మెయిల్ చేసే క్రిమినల్స్‌పై కఠిన చర్యలు అవసరమని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. ఇలాంటి కేసుల్లో బాధిత మహిళల వివరాలను గోప్యంగా ఉంచాల్సిన బాధ్యత పూర్తిగా పోలీసులదేనని అన్నారు. ఫిర్యాదులు, వ్యక్తిగత సమాచారం బహిర్గతమైతే మహిళల ప్రైవసీ దెబ్బతిని, వారి జీవితాలకే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. సెక్స్ పరమైన, వ్యక్తిగత వ్యవహారాలకు సంబంధించిన వార్తలను ప్రింట్, ఎలక్ట్రానిక్, యూట్యూబ్, సోషల్ మీడియాల్లో ప్రసారం చేయొద్దని మీడియాకు సూచించారు. క్రైమ్ రిపోర్టర్లకు సమాచారం లభించినా, దాన్ని పోలీసులకు మాత్రమే అందించి బయటకు వెల్లడించకూడదని చెప్పారు. ట్రాప్ అయిన అమ్మాయికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా పోలీసులు వ్యవహరించాలని, మోసపోయిన మహిళకు భరోసా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసులు సీక్రెట్ ఆపరేషన్‌లు చేయవచ్చని, కానీ వాటిని ప్రచారంగా మార్చకూడదన్నారు. బ్లాక్ మెయిల్ చేసే వారిపై చట్టాలు ఉన్నాయని, న్యాయస్థానాలు ఉన్నాయని పేర్కొంటూనే, కొన్నిసార్లు అలాంటి నేరస్తులకు భయం ఉండాల్సిన అవసరం ఉందని తన వ్యక్తిగత అభిప్రాయాన్ని వెల్లడించారు. గత ప్రభుత్వాల హయాంలో జరిగిన ఎన్‌కౌంటర్లను ప్రస్తావిస్తూ, రాజ్యాంగ పరంగా వాటిని సమర్థించలేమని, కానీ వ్యక్తిగతంగా కొందరు సమర్థిస్తారని అన్నారు. ఫోన్లు కమ్యూనికేషన్ కోసం వచ్చాయని, కానీ కొందరు వాటిని నేరాలకు వాడుకుంటున్నారని విమర్శించారు. ఆడపిల్లల ఫోటోలు బయటకు వచ్చేలా చేసే వ్యక్తుల విషయంలో పోలీస్ అధికారులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. మహిళలను మోసం చేయాలనే ఆలోచన వచ్చిన క్షణంలోనే నేరస్తులకు భయం కలిగేలా పోలీస్ చర్యలు ఉండాలని జగ్గారెడ్డి అన్నారు. ఆడపిల్లలను ట్రాప్ చేసి వారి కుటుంబాలను బ్లాక్ మెయిల్ చేసే క్రిమినల్స్‌పై సీపీ సజ్జనర్ తీసుకునే చర్యలే సరైనవని, ఇది పూర్తిగా తన వ్యక్తిగత అభిప్రాయమని స్పష్టం చేశారు.

పాతబస్తీలో అక్కాతమ్ముళ్ల మృతి

- సుల్తాన్‌పురాలో విషాద ఛాయలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 29: ఒకరిపై ఒకరు ఆధారపడి జీవిస్తున్న తోబుట్టువుల మరణం.. ఆ ప్రాంతంలో విషాద ఛాయలు నింపింది. పాతబస్తీలోని సుల్తాన్‌పురా ఉన్న ఒక ఫ్లాట్‌లో అక్కాతమ్ముళ్ల మృతదేహాలు లభ్యమవడం సంచలనం సృష్టించింది. కొన్ని రోజులుగా ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి చర్యలు చేపట్టారు. ఘటన వివరాలిలా.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతులను మహమ్మద్ షకీల్, అతని సోదరి సర్వార్ బేగంగా పోలీసులు గుర్తించారు. వీరు గత 40 ఏళ్లుగా ఇదే ఫ్లాట్‌లో నివసిస్తున్నారు. సర్వార్ బేగం వికలాంగురాలు కావడంతో, ఆమె బాగోగులన్నీ సోదరుడు షకీలే చూసుకునేవాడు. వీరిద్దరూ పెళ్లి చేసుకోకుండా ఒకరికొకరు తోడుగా ఉంటున్నట్లు సమాచారం. ఘటనా స్థలానికి చేరుకున్న మీర్ చౌక్ పోలీసులు క్లూస్ టీమ్ సహాయంతో ఆధారాలు సేకరించారు. మృతదేహాలు కుళ్లిన స్థితిలో ఉండటంతో.. వారు మృతి చెంది కొన్ని రోజులకు పైగానే అయి ఉండొచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం మృతదేహాలను ఉస్మానియా మార్చురీకి తరలించారు. షకీల్ అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించి ఉండొచ్చని, వికలాంగురాలైన సర్వార్ బేగానికి ఆహారం అందించే వారు లేక ఆమె కూడా మృతి చెంది ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే ఇతర కోణాల్లోనూ పోలీసులు విచారణ చేస్తున్నారు.ఈ ఘటనపై మీర్ చౌక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు.

మైనారిటీ విద్యార్థుల సర్టిఫికెట్లు ఆపడం అన్యాయం

- ఎస్ఐఓ రాష్ట్ర కార్యదర్శి హమ్మదుద్దీన్

ప్రతిపక్షం, హైదరాబాద్, జనవరి 29: మైనారిటీ విద్యార్థుల పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బిల్లులను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ హమ్మదుద్దీన్ డిమాండ్ చేశారు. ఈ నిధుల జాప్యంపై తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వంపై, ముఖ్యంగా ఆర్థిక శాఖపై తీవ్ర అసహనం వ్యక్తం చేయడాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రభుత్వం నుంచి నిధులు అందడం లేదనే సాకుతో ప్రైవేట్ కళాశాలలు విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికేట్లను నిలిపివేయడం వల్ల వారి భవిష్యత్తు అంధకారంలో పడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సర్టిఫికేట్లను ఆపకూడదని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ, వాటిని అమలు చేయడంలో విద్యా శాఖ పర్యవేక్షణ లోపించిందని ఆయన విమర్శించారు. మైనారిటీ సంక్షేమ శాఖ నిధుల కోసం ప్రతిపాదనలు పంపినప్పటికీ, ఆర్థిక శాఖ వాటిని క్లియర్ చేయకుండా కాలయాపన చేయడం వల్ల పేద విద్యార్థులు ఆర్థికంగా కుంగిపోతున్నారని హమ్మదుద్దీన్ పేర్కొన్నారు.సర్టిఫికెట్లు లేక విద్యార్థులు తమకు వచ్చే ఉన్నత విద్యా అవకాశాలను, ఉద్యోగాలను కోల్పోతున్నారని, ఈ నష్టాన్ని ఎవరూ భర్తీ చేయలేరని ఆయన హెచ్చరించారు. విద్యార్థులు తమ హక్కుల కోసం మానవ హక్కుల కమిషన్ లేదా కోర్టుల చుట్టూ తిరగాల్సి రావడం ప్రభుత్వ వైఫల్యమేనని మండిపడ్డారు. హైకోర్టు ఆదేశించిన విధంగా మైనారిటీ సంక్షేమ శాఖ వెంటనే ఒక ఫిర్యాదుల పరిష్కార విభాగాన్ని, టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మార్చి 3న జరిగే తదుపరి విచారణలోపు ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే విద్యార్థుల తరపున పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హమ్మదుద్దీన్ స్పష్టం చేశారు.

టీ20 ప్రపంచకప్ ను పాకిస్తాన్ బహిష్కరిస్తుందని నేను అనుకోను. వారికి అంత దమ్ము లేదు. టోర్నీ ఆడేందుకు పాక్ టీమ్ వస్తుంది. వరల్డ్ కప్ కోసం శ్రీలంకలోని కొలంబోకు వెళ్లేందుకు పాకిస్తాన్ టీమ్ టికెట్లు బుక్ చేసినట్లు వార్తలు రావడం తెలిసిందే కదా.

- అజింక్య రహానే, క్రికెటర్

ప్రాంతీయం

నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 29 : ఆర్మూర్, భీంగల్ మున్సిపల్ పట్టణాలలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం సందర్శించారు. నామపత్రాల స్వీకరణ నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేశారా, వార్డు స్థానాలకు ఎన్ని నామినేషన్లు దాఖలు అయ్యాయి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. నామపత్రాలు తెలుగు, ఆంగ్లం, హిందీ భాషలలో అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించారు. ఆర్మూర్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న నామినేషన్ల స్వీకరణ కేంద్రంలో పలు లోపాలను గమనించిన కలెక్టర్ సంబంధిత అధికారుల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏవైనా సందేహాలు ఉంటే పై అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని, అనవసర తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా రీపోలింగ్ కు అవకాశం కల్పిస్తే, సంబంధిత మున్సిపల్ కమిషనర్లను బాధ్యులుగా పరిగణిస్తామని అన్నారు. నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) ప్రక్రియలో నిబంధనలను తు.చ తప్పక పాటిస్తూ, జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. చివరి రోజైన శుక్రవారం అధిక సంఖ్యలో నామినేషన్లు దాఖలు అయ్యే అవకాశాలు ఉన్నందున, ఎలాంటి గందరగోళానికి తావు లేకుండా అప్రమత్తతతో విధులు నిర్వహించాలని హితవు పలికారు. కాగా, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని, ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికలు జరిగేందుకు అందరూ సహకరించాలని కలెక్టర్ కోరారు. అభ్యర్థులు, అన్ని పార్టీల వారు ఎన్నికల నియమావళిని తు.చ తప్పక పాటించాలని అన్నారు. ఆయా పార్టీల అభ్యర్థులుగా.నామినేషన్లు దాఖలు చేస్తున్న వారు, నిర్ణీత గడువు లోపు బీ.ఫారం సమర్పించాలని, లేని పక్షంలో వారిని స్వతంత్ర అభ్యర్థులుగా పరిగణించడం జరుగుతుందని తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ఆర్మూర్, భీంగల్ మున్సిపల్ కమిషనర్లు ఉమా మహేశ్వర్, గంగాధర్, స్థానిక అధికారులు ఉన్నారు.

కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు...

జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు స్వీకరించేందుకు వీలుగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 08462 220183 కు కార్యాలయ పని వేళల్లో కాల్ చేసి ఫిర్యాదులు చేయవచ్చని సూచించారు. కంట్రోల్ రూమ్ కు వచ్చే ఫిర్యాదులను వెంటదివెంట పరిశీలిస్తూ, పరిష్కరించేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు.

రేవంత్ రెడ్డి ఫ్లెక్సీ దహనం

- కేసీఆర్ కి నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ రాస్తారోకో

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 29: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్‌రావుకు ఎస్ఐటీ నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ నేతలు, శ్రేణులు సిద్దిపేట బీజేఆర్ చౌరస్తాలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్లెక్సీ నీ దగ్ధం చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం డౌన్ డౌన్ అంటూ నినదించారు.ధర్నా సమయంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, బీఆర్ఎస్ శ్రేణులు,పోలీసుల మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా రోడ్ పై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. అనంతరం పోలీసులు నచ్చచెప్పి ధర్నా విరమింప చేశారు.

నిరుపేదలకు సేవలందించే అవకాశం లభించడం అదృష్టంగా భావించాలి

- వైద్యారోగ్య శాఖ పనితీరుపై సమీక్షలో కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 29 : నిరుపేద ప్రజలకు వైద్య సేవలు అందించే అవకాశం లభించడాన్ని అదృష్టంగా భావిస్తూ అంకిత భావంతో మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి వైద్యాధికారులకు, సిబ్బందికి హితవు పలికారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పనితీరుపై కలెక్టర్ గురువారం సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, పీ.హెచ్.సీలు, ఆరోగ్య ఉప కేంద్రాల నిర్వహణ తీరుతెన్నుల గురించి అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయి నుండి మొదలుకొని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వరకు వివిధ దశల్లో చేపట్టాల్సిన పనులను అంకితభావంతో సక్రమంగా నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. పీ హెచ్ సి స్థాయిలో మెడికల్ ఆఫీసర్, సూపర్వైజర్, సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని, తమ ఉద్యోగాన్ని దైవంతో సమానంగా భావించాలని అన్నారు. వైద్యారోగ్య శాఖ పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తామని, విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు. అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించకపోయినా చర్యలు కఠినంగానే ఉంటాయన్నారు. వైద్య ఆరోగ్య శాఖ పనితీరు సక్రమంగా లేకపోతే, అది ప్రజా జీవనంపై పెను ప్రభావం చూపుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సమిష్టిగా, సమన్వయంతో పని చేస్తూ సత్ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్ఓలు, మెడికల్ ఆఫీసర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఈసం పాపయ్య కుటుంబానికి న్యూడెమోక్రసీ సహాయం

ప్రతిపక్షం, గుండాల, జనవరి 29: గుండాల మండలం జగ్గాయిగూడెం గ్రామానికి చెందిన మాజీ పటేల్ ఈసం పాపయ్య దశదిన కర్మల సందర్భంగా గురువారం గుండాల సర్పంచ్ కోరం సీతారాములు,ఆధ్వర్యంలో న్యూడెమోక్రసీ నేతలు 15 కిలోల మంచి నూనె డబ్బాను సహాయంగా అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ. గ్రామ అభివృద్ధికి సేవ చేసిన ఈసం పాపయ్య సేవలు ఎప్పటికీ స్మరణీయమని తెలిపారు. ఆయన కుటుంబానికి ఈ సమయంలో అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఈసం కృష్ణ, మానాల ఉపేందర్, ఎర్రయ్య, పూకె రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క–సారలమ్మను దర్శించుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, జనగామ, జనవరి 29: జనగామ నియోజకవర్గంలోని బచ్చన్నపేట మండలం మాన్సన్‌పల్లి గ్రామంలో కొలువై ఉన్న సమ్మక్క-సారలమ్మ జాతరకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి గురువారం హాజరై అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి , నియోజకవర్గ ప్రజల శ్రేయస్సు, అభివృద్ధి, సుఖసంతోషాల కోసం అమ్మవార్లను ప్రార్థించారు. అనంతరం జాతర ఏర్పాట్లపై ఆలయ కమిటీ సభ్యులను అడిగి వివరాలు తెలుసుకొని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.

మేడారం జాతర బందోబస్త్‌లో సీపీ

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 29 : మేడారం జాతర బందో బస్త్ ఏర్పాట్లను నిజామాబాద్ సీపీ సాయి చైతన్య పరిశీలించారు. మల్టి జోన్ 1 ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి, పోలీస్ కమీషనర్ లుగత రెండు రోజుల నుండి మేడారంలోని సమ్మక్క సారళమ్మజాతరలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

భారత సాహిత్య సంస్కృతులపై

గీతంలో చర్చాగోష్ఠి

- దేశ నలుమూలల నుంచి తరలి వచ్చిన ప్రసిద్ధ ప్రొఫెసర్లు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 29 : గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లోని ఆంగ్లం, ఇతర భాషల విభాగం ఆధ్వర్యంలో 'పరివర్తన దశ: భారతదేశంలో సాహిత్య సంస్కృతులు, సామాజికరాజకీయ ఉద్యమాలు' అనే అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల చర్చాగోష్ఠిని గురువారం లాంఛనంగా ప్రారంభించారు. భారతీయ సందర్భంలో సాహిత్యం, భావజాలం, సంస్కృతి, సామాజిక పరివర్తనపై విమర్శనాత్మక చర్చల కోసం ప్రముఖ పండితులు, విద్యావేత్తలను ఈ సింపోజియం ఒకచోట చేర్చింది. 'వలసవాద, ప్రారంభ ఆధునిక భారతదేశంలో సాహిత్యం, భావజాలం, సామాజిక ప్రతిఘటన' అనే అంశంపై అమృత్ సర్ లోని గురునానక్ దేవ్ విశ్వవిద్యాలయం, ఎస్.ఆర్. ప్రభుత్వ మహిళా కళాశాలకు చెందిన డాక్టర్ అమన్ దీప్ కౌర్, డాక్టర్ జగ్వీర్ సింగ్ లతో పాటు గీతం అధ్యాపకుడు డాక్టర్ జోంధలే రాహుల్ హిరామన్ ఉపన్యసించారు. 'కులాన్ని పున:నిర్వచించడం: 1872 నాటి ఒక తెలుగు నవల' అనే అంశంపై హైదరాబాదు విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ అల్లాడి ఉమ, ప్రొఫెసర్ ఎం.శ్రీధర్ కీలకోపన్యాసాలు చేశారు. ఒక నవల ఒకే సమయంలో కల్పితంగా, చారిత్రకంగా ఎలా ఉండగలదో ప్రొఫెసర్ శ్రీధర్ వివరించారు. శతాబ్దాలుగా ప్రబలంగా ఉన్న కుల వ్యవస్థను అది చిత్రించడంలో దాని చారిత్రకత ఉందని, అయితే శ్రీరంగరాజు అనే విజయనగర రాజు లేకపోవడంలో దాని కల్పిత అంశం స్పష్టంగా కనిపిస్తుందని చెప్పారు. సోనాబాయి ఒక లంబాడా అమ్మాయి నుంచి నాయక కుటుంబ సభ్యురాలిగా మారడం కూడా వాస్తవికతను కల్పితంగా పునర్నిర్మించడాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. ఈ కథ ఎంపిక సూచించేదేమంటే, ఆమె లంబాడా మహిళగానే ఉండి ఉంటే, ఆనాటి కుల వివక్షతో నిండిన సమాజం ఈ నవలను అంగీకరించి ఉండేది కాదని, అయితే, అంటరాని కులాల పట్ల నవలా రచయిత వైఖరిని విమర్శించవచ్చన్నారు. ఈ విధంగా ప్రొఫెసర్ శ్రీధర్ సాహిత్యంలో ఆధునికత గురించి కీలకమైన ప్రశ్నలను లేవనెత్తి, హిందూ సమాజ వ్యవస్థకు కేంద్రంగా ఉన్న కులం, గిరిజన దృక్కోణాల ద్వారా శ్రీరంగనాథ చరితము వంటి గ్రంథాలను పున:పరిశీలించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. 'వలసవాద స్థానిక సంస్కృతులలో లింగం, లైంగికత, నైతిక ఆందోళన' అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో సంబల్ పూర్ లోని గంగాధర్ మెహర్ విశ్వవిద్యాలయ ఆచార్యుడు డాక్టర్ పి.మురళీధర్ శర్మ, వెల్లూరు ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి అధ్యాపకురాలు డాక్టర్ మీను బి., గీతం ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ సయంతన్ మండల్ ఆలోచింపజేసే ప్రసంగాలను అందించారు. వక్తలు లింగం, నైతికత, స్థానిక సాహిత్య సంప్రదాయాల మధ్య ఉన్న సంబంధాలను విశ్లేషించారు. జీఎస్ హెచ్ఎస్ ఇన్ ఛార్జి డైరెక్టర్ డాక్టర్ శామ్యూల్ తరు, ప్రొఫెసర్ డీ.ఆర్.పీ.చంద్రశేఖర్, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు కూడా ఈ సింపోజియంలో పాల్గొన్నారు. 'భక్తి, అంతర్గతత్వం, ఆధునిక భారతదేశంలో నైతికరాజకీయ కర్తలను రూపొందించడం' అనే కార్యక్రమంలో రెండో రోజు సింపోజియం ఆరంభం కానుంది. దేవ్ గఢ్ కళాశాలకు చెందిన డాక్టర్ శిఖా మహర్షి, రావెన్ షా విశ్వవిద్యాలయ ఆచార్యులు ఉర్మిశ్రీ బెడమట్ట, గీతం అధ్యాపకుడు డాక్టర్ అభిలాష్ ఉపన్యసించనున్నారు. జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ ఆచార్యుడు ప్రొఫెసర్ ఉదయ కుమార్ 'సామాజికత యొక్క సాహిత్యం, భాషలు: కేరళ నుంచి కొన్ని గమనికలు' అనే అంశంపై కీలకోపన్యాసం చేస్తారు. ఈ రెండు రోజుల సింపోజియం 'పరివర్తన దశలోని విషయాలు, పరివర్తనాత్మక గ్రంథాలు, ఆధునికత' అనే కార్యక్రమంతో ముగియనుంది. ఇందులో ముంబై లోని ఎస్ఎన్ డీటీ మహిళా విశ్వవిద్యాలయ ఆచార్యులు డాక్టర్ ద్రుపది చటోపాధ్యాయ, షిల్లాంగ్ లోని ఈశాన్య హిల్ యూనివర్సిటీ ఆచార్యులు డాక్టర్ సోమజ్యోతి మృధా, గీతం విశాఖ అధ్యాపకుడు ఫుజైల్ అసర్ సిద్దిఖీ ప్రసంగించనున్నారు. ఈ చర్చలు భారతీయ సామాజికసాంస్కృతిక సందర్భాలలో సాహిత్య ఆధునికత యొక్క పరిణామ స్వభావాన్ని, పరివర్తన చెందుతున్న విధానాన్ని ప్రస్ఫుటీకరిస్తాయి.మనదేశంలోని సాహిత్య సంస్కృతులు, సామాజికరాజకీయ ఉద్యమాలతో విమర్శనాత్మక సంబంధాన్ని పెంపొందిస్తూ, అంతర్‌విభాగ సంభాషణకు ఒక శక్తివంతమైన వేదికను ఈ సింపోజియం అందజేస్తోందన్నారు.

విద్యార్థులను పరామర్శించిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

ప్రతిపక్షం, మొయినాబాద్, జనవరి 29 : అజీజ్ నగర్ సమీపంలోని మృగవాని పార్క్ వద్ద విద్యార్థులతో వెళుతున్న స్కూల్ బస్సు బోల్తా పడిన ఘటనలో గాయపడిన చిన్నారులను చేవెళ్ల శాసనసభ్యులు కాలె యాదయ్య పరామర్శించారు.ఘటన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాలే యాదయ్య గాయపడిన విద్యార్థులు చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు అవసరమైన మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.గాయపడిన విద్యార్థులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, వారి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సమ్మక్క సారలమ్మ పద్యనాటకం

- శ్రీవైష్ణవి అద్భుతమైన ప్రదర్శన

ప్రతిపక్షం ప్రతినిధి, హన్మకొండ, జనవరి 29: గురువారం హన్మకొండ పబ్లిక్ గార్డెన్ లోని పద్మశ్రీ నేరెళ్ల వేణుమాధవ్ ఆడిటోరియంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ డెమోక్రటిక్ అసోసియేషన్ వరంగల్ వారిచే సమ్మక్క సారలమ్మ చారిత్రాత్మక పద్య నాటకం ప్రదర్శించారు. ఇందులో నారాయణ జూనియర్ కళాశాల ప్రధమ సంవత్సరం విద్యార్థిని పొన్న శ్రీవైష్ణవి అద్భుతమైన ప్రదర్శన వీక్షకులను ఆకట్టుకుంది. గిరిజన బాలిక వేశధారణలో శ్రీ వైష్ణవి చేసిన నృత్య ప్రదర్శనకు ప్రేక్షకులు, నిర్వాహకులు అభినందనలు తెలియజేశారు. భవిష్యత్లో సాంస్కృతిక కళారంగంలో శ్రీవైష్ణవి మరింత ముందుకు సాగాలని వారు ఆకాంక్షించారు.

రెండో రోజు 77 నామినేషన్లు దాఖలు

ప్రతిపక్షం,మొయినాబాద్, జనవరి 29 : మొయినాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో వివిధ వార్డుల నుంచి రెండో రోజు 77 నామినేషన్లు దాఖలైయ్యాయని మున్సిపల్ కమీషనర్ జాకీర్ అహ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నుంచి 28, బీఆర్ ఎస్ పార్టీ నుంచి 21, బీజేపీ నుంచి 16 దరఖాస్తులు రావడం జరిగిందన్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా 11 మంది నామినేషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. టీజీఎస్ఈసీ రిజిస్ట్రర్ పార్టీ నుంచి 1 నామినేషన్ దాఖలైందని వెల్లడించారు. నేడు ఒక్కరోజు నామినేషన్ కు సమయం ఉందని తెలిపారు.

ప్రాంతీయం

రైతుల నోట్లో మట్టి కొట్టి.. బీరు ఫ్యాక్టరీలకు నీళ్లిస్తారా?

- కందులకు రూ.8 వేల మద్దతు ధర
- రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వాలు
- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 29:

రైతులను కావాలనే నట్టేట ముంచుతున్నారని ,కందులకు క్వింటాలుకు రూ.8 వేల మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. రైతులు మధ్య దళారులకు అమ్మి మోసపోవద్దని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు సూచించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కందుల కొనుగోలు కేంద్రాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందులకు క్వింటాలుకు రూ.8,000 మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. రైతులు మధ్యదళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని సూచించారు. దేశంలో పప్పు దినుసుల ఉత్పత్తి సరిపడా లేకపోవడంతో ఇతర దేశాల నుంచి దిగుమతులు చేయాల్సి వస్తోందని, కేంద్ర ప్రభుత్వం నూనెగింజలు, పప్పు దినుసుల ఉత్పత్తిని ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. రైతులు పంట మార్పిడి వైపు దృష్టి పెట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను మోసం చేస్తున్నాయని ఆరోపించిన హరీష్ రావు, బీజేపీ నల్ల చట్టాలు తెచ్చి రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చీకటి రోజులు తెచ్చిందని విమర్శించారు. ఇరువురు ప్రభుత్వాలు రైతులను నట్టేట ముంచుతున్నాయన్నారు. ప్రభుత్వాలు కావాలనే కృత్రిమ ఎరువుల కొరత సృష్టిస్తున్నాయని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎరువుల కొరత ఎప్పుడూ లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ తగ్గించుకోవాలనే ఉద్దేశంతో ఎరువుల కొరతను సృష్టిస్తోందని ఆరోపించారు. ఈ ప్రభుత్వంపై రైతులు పూర్తిగా విశ్వాసం కోల్పోయారని తెలిపారు. వరి నాట్లు పూర్తయినప్పటికీ రైతుబంధు ఇంకా ఖాతాల్లో జమ కాలేదని, కేసీఆర్ హయాంలో కరోనా, నోట్ల రద్దు వంటి సంక్షోభాల్లో కూడా రైతుబంధు అందిందని గుర్తు చేశారు. పేరుకే రైతు భరోసా ఉందని, రైతులకు అసలు భరోసానే లేదని అన్నారు. రైతు భరోసా ఎప్పుడు ఇస్తారో ప్రభుత్వం స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం, మంత్రులు రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని, వానాకాలం రైతు భరోసా, సన్నవడ్లకు బోనస్ ఇవ్వాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోందన్నారు. ప్రభుత్వానికి సిట్లు, కేసులు తప్ప రైతుల గోస పట్టడం లేదని విమర్శించారు.మెదక్ జిల్లాలో రైతులకు నీరు నిలిపివేసి బీరు కంపెనీకి నీళ్లు ఇస్తున్నారని ఆరోపించారు. ఎక్సైజ్ శాఖ కార్యదర్శి బీరు కంపెనీకి నీళ్లు ఇవ్వాలని చెప్పడమే ఇందుకు కారణమన్నారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుంటోందని హరీష్ రావు తీవ్రంగా వ్యాఖ్యానించారు.

ప్రతి విద్యార్థి చిత్రంతో క్యాలెండర్

- పాఠశాలలో చేపట్టిన కార్యక్రమ చిత్రాలకు చోటు
- వరికోలు ఉన్నత పాఠశాలలో ఆవిష్కరణ

ప్రతిపక్షం,కోహెడ, జనవరి 29:

సిద్ధిపేట జిల్లా కోహెడ మండలంలోని వరికోలులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాలమానిని(క్యాలెండర్)ను వినూత్నంగా రూపొందించారు. కాలమానిని పై భాగంలో ప్రభుత్వ లోగోతో పాఠశాల పేరు ముద్రించారు. దానికింద ఎడమ వైపు చదివే ప్రతి విద్యార్థి చిత్రాన్ని, మధ్యలో పాఠశాల భవనం చిత్రం, కుడివైపున ఆ విద్యార్థి చదివే తరగతి విద్యార్థులు, తరగతి ఉపాధ్యాయుడు, ప్రధానోపాధ్యాయురాలితో కలిసి దిగిన చిత్రాలకు చోటు కల్పించారు. 2026 కాలమానిని(క్యాలెండర్), సెలవుల వివరాలు, ముద్రించారు. కింది వైపు సంవత్సర కాలంలో పాఠశాలలో చేపట్టిన బోధన,బోధనేతర, సహ పాఠ్య కార్యక్రమాల ఫోటోలతో కాలమానిని అందంగా రూపొందించారు. మన బడిని మనమే కాపాడుకుందాం ప్రభుత్వ బడులను రక్షించుకుందాం అనే ట్యాగ్ లైన్ తో ముద్రించిన ఈ కాలమానిని గురువారం వరికోలు గ్రామ సర్పంచి సుదగోని దేవరాజు, ఏఎంసీ చైర్మన్ నిర్మలా జయరాజు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ చైర్మన్ శ్యామల, ఉప సర్పంచి కృష్ణారెడ్డి తదితరులు పాఠశాల క్యాలండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.కృష్ణవేణి మాట్లాడుతూ 2025 లో సాధించి విజయాలను క్యాలెండర్ లో పొందు పరిచామని చెప్పారు. 2026 క్యాలెండర్ లో ప్రతి విద్యార్థి ఫోటోను పొందు పరచి తల్లితండ్రులకు, విద్యావేత్తలకు నాయకులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామచంద్రారెడ్డి, ఉప్పల్ రెడ్డి, ప్రభాకర్, సంగు రామకృష్ణ, ఉపేందర్, శ్రీనివాస్ జగదీశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాలీలకు డిజేలకు అనుమతులు తప్పనిసరి

ప్రతి పక్షం దుబ్బాక జనవరి 29:

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ర్యాలీలకు ,డీజే సౌండ్లకు అనుమతులు తప్పకుండా తీసుకోవాలని దుబ్బాక సీఐ రాజేష్ తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎవరైనా ర్యాలీలు నిర్వహించిన డిజె సౌండ్లతో ఊరేగింపుగా వెళ్లిన అనుమతి లేకుంటే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అనుమతుల కోసం దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో, పోలీస్ శాఖను సంప్రదించాలని సూచించారు.

నార్సింగ్ లో సీఎం కప్ క్రీడలు ప్రారంభం

ప్రతిపక్షం, చేగుంట, జనవరి 29:

నార్సింగ్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో సీఎం కప్ క్రీడలను సర్పంచ్ ఆకుల సుజాత మల్లేశం గౌడ్ ప్రారంభించారు. నార్సింగ్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని విద్యార్థులు వాలీబాల్ ఇతర క్రీడల్లో ప్రథమ స్థానం సంపాదించి పాఠశాలకు తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తేవాలని సుజాత పిలుపునిచ్చారు. రెండు రోజులపాటు జరిగే క్రీడల్లో అధికారులు ఉపాధ్యాయులు పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజేందర్ రెడ్డి పాఠశాల ఉపాధ్యాయులు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలం స్వర్ణయుగం

- కేసీఆర్ కు నోటీసులు ఇవ్వడం సూర్యునిపై ఉమ్మి వేయడం లాంటిది
- తన్నీరు హరీశ్, మాజీ మంత్రి సిద్ధిపేట ఎమ్మెల్యే

ప్రతిపక్షం,నంగునూరు, జనవరి 29:

కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి కాలం స్వర్ణయుగం లాంటిదని, కేసీఆర్ కు సిట్ నోటీసులు ఇవ్వడం సూర్యుని మీద ఉమ్మి వేయడం ఒక్కటేనని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు స్పష్టం చేశారు. సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం అక్కెనపల్లిలోని సమ్మక్క సారలమ్మ జాతరలో గురువారం హరీశ్ రావు పాల్గొన్నారు. అమ్మవార్లకు బంగారం(బెల్లం) సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవార్ల దయతో మంచి పంటలు పండి అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. కేసీఆర్ నాట్లకు నాట్లకు మధ్య రైతు బంధు ఇస్తే రేవంత్ రెడ్డి ఓట్లకు ఓట్లకు మధ్య రైతు బంధు ఇస్తున్నాడని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయడం లేదని,కేవలం 12 గంటలు మాత్రమే సరఫరా చేస్తున్నారని చెప్పారు. రైతులు మళ్ళీ వ్యవసాయ బావులు,బోర్ల వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పారు. రేవంత్ రెడ్డి వచ్చాక ఎరువు బస్తాల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు . కళ్యాణ లక్ష్మీ పథకంలో తులం బంగారం ఇస్తానని హామీ ఇచ్చి అమలు చేయడం లేదన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని రోజూ ప్రశ్నిస్తున్నందుకు నోటీసులు పంపుతున్నారని తెలిపారు. ఈ రోజు కేసీఆర్ కు నోటీసులు ఇచ్చారన్నారు. కేసీఆర్ కి నోటీసులు ఇవ్వడం అంటే సూర్యుని మీద ఉమ్మినట్లేనని పేర్కొన్నారు. తెలంగాణ తెచ్చి, తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా నిలిపిన నాయకుడు కేసీఆర్ అని తెలిపారు. ప్రభుత్వం ఎన్ని నోటీసులు ఇచ్చినా.. ప్రజల పక్షాన ఇంకా గట్టిగా కొట్లాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోతరాజు రేణుక, బీఆర్ఎస్ నాయకులు జాప శ్రీకాంత్ రెడ్డి, బద్దిపడగ కిష్టారెడ్డి, పోతరాజు రమేశ్ తదితరులు పాల్గొన్నారు

బొల్లి మల్లేష్ కుటుంబానికి ముదిరాజ్ సంఘం ఆర్థిక సహాయం

ప్రతిపక్షం, చేగుంట, జనవరి 29:

చేగుంట మండలం అనంతసాగర్ గ్రామంలో మరణించిన బొల్లి మల్లేష్ కుటుంబానికి ముదిరాజ్ సంఘం నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. చేగుంట మండలం కమిటీ సభ్యులతోపాటు మెదక్ జిల్లా నాయకుల తరఫున ఆ కుటుంబానికి 11 వేల 300 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి బిక్షపతి జిల్లా కార్యదర్శి కాశ బోయిన భాస్కర్ కమిటీ సభ్యులు బోనగిరి బిక్షపతి వీఆర్వో ఆగమయ్య ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గద్దర్ 78 వ జయంతోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 29:

జనవరి 31 న రవీంద్రభారతి సాయంత్రం 4 నుండి నిర్వహించే ప్రజాయుద్ధ నౌక గద్దర్ 78 వ జయంతి ఉత్సవ పోస్టర్ ను సిద్దిపేటలోని సిద్దిపేట అంబేద్కర్ విగ్రహ ప్రాంగణంలో వివిధ ఉద్యోగ ఉపాధ్యాయ ప్రజాసంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విగ్రహ నిర్మాణ కమిటీ చైర్మన్ పోచబోయిన శ్రీహరి యాదవ్ మాట్లాడుతూ కోట్లాది శ్రామిక ఉత్పత్తి సేవా కులాల గోతుకై ప్రజా సాంస్కృతిక సారధియైన ప్రజాయుద్ధ నౌక గద్దరన్న 78 వ జయంతుత్సవాల్లో గద్దరన్న అభిమానులు ప్రజా సంఘాల నాయకులు విజయవంతం చేయాలన్నారు. బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ సంఘాల జాక్ చైర్మన్ బత్తుల చంద్రం మాట్లాడుతూ ప్రజలే గద్దరన్న నిజమైన వారసులని మనందరం కలసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మెట్ల శంకర్ మాట్లాడుతూ అణగారిన వర్గాల కోసం జీవంతాంతం కృషి చేసిన మహనీయులు మన గద్దరన్న అన్నారు.ఇంకా ఈ కార్యక్రమంలో తెలంగాణ జెఏసి సిద్దిపేట జిల్లా చైర్మన్ , రిటైర్డ్ ప్రిన్సిపాల్ గొట్టిపర్తి పాపయ్య, గద్దరన్న విగ్రహ నిర్మాణ కమిటీ కో చైర్మన్ అసలక్ష్మణ్ , టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ గాడిపల్లి తిరుపతి రెడ్డి ,జర్నలిస్టు మరసం నాయకులు కేరంగాచారి, టీఎన్జీఓ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కోమాండ్ల విక్రమ్ రెడ్డి ,బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కంకటి నవీన్ గౌడ్ ,వీర శైవలింగబలిజ సమాజం అధ్యక్షులు ఆకుల ప్రశాంత్ ,బెల్లె రాములు ,నరేందర్ కొత్వాల్ ,బోయరాములు,మాచాపూర్ మాజీసర్పంచ్ బాబు, మురళి కృష్ణ, తదితర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గద్దర్ జ్ఞాపకార్థం 'స్మృతివనం' ఏర్పాటును ప్రభుత్వానికి గుర్తు చేద్దాం

- జయంతి సభ దిగ్విజయం చేద్దాం
- డిబిఎఫ్ జాతీయ కార్య దర్శి శంకర్

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 29:

గద్దర్ జ్ఞాపకార్థం స్మృతి వనానికి ప్రభుత్వ హామి ప్రకారం హైద్రబాద్ నెక్లెస్ రోడ్ లో మూడు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి శంకర్ తెలిపారు.గురువారం నాడు గజ్వేల్ లో గద్దర్ జయంతి సందర్భంగా పి. శంకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనవరి 31 న హైదరాబాద్ రవీంద్ర భారతిలో సాయంత్రం నిర్వహిస్తున్న ప్రజా యుద్దనౌక గద్దర్ జయంతి సభను విజయవంతం చేయాలని కోరారు. గద్దర్ జ్ఞాపకర్థం కొసం నగరంలో 3 ఎకరాల స్థలాన్ని కేటాయించి, స్మృతివనాన్ని కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సభకు గద్దర్ అభిమానులు, సామాజిక కార్యకర్తలు, ఉద్యమకారులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.ఈ సారి గద్దర్ జయంతి సభను ప్రజాస్వామ్యం సమానత్వ విలువలు థీమ్ తో నిర్వహిస్తున్నామన్నారు. గద్దర్ తన జీవితమంతా పీడిత, తాడిత ప్రజల అభ్యున్నతి, విముక్తి కోసం పోరాడారు. ప్రజలను సంఘటి త పరిచి వారి హక్కులకోసం, సమానత్వ విలువల కోసం పోరాడేందుకు, చైతన్య పరిచేందుకు గద్దర్ వేలాదిగా పాటలు రాసి. ఆడి,పాడారన్నారు.. చీపురు కట్ట, పెంటకుప్ప, చెత్తబుట్ట, ఫ్యాను తదితర వస్తువులు, పరికరాల పై పాటలు రాసి పాడారన్నారు. మనిషినాగరిక జీవనానికి ఆలంబనంగా ఉన్న చీపురు, చెత్తబుట్ట, పెంటకుప్ప లాంటి వాటిని హీనంగా చూడటం అమానవీయమని మనిషిలోని మానవీయతను తట్టిలేపాడన్నారు. ఇలా మనిషి జీవితంతో పెనవేసుకొని ఉన్న సకల విషయాలపై గద్దర్ రాసిన పాటలను సంకలనం చేసి సిరి మల్లె పేరుతోతెస్తున్న పుస్తకాన్ని ఈ గద్దర్ జయంతి సభలో ఆవిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, మాజీ పోలీస్ ఉన్నతాధికారి సి. ఆంజనేయరెడ్డి, గద్దర్ ఫౌండేషన్ చైర్ పర్సన్ ప్రొఫెసర్ శాంతా సిన్హా, ప్రొఫెసర్ హర గోపాల్, ప్రముఖ పాత్రికేయులు కె శ్రీనివాస్ ప్రొఫెసర్ కాశీం పాల్గొంటారని తెలిపారు. గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న ఈ జయంతి సభకు ప్రత్యేక ఆహ్వానితులుగా ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, అల్లం నారాయణ, పిఎస్ఎన్ మూర్తి, సిద్ధోజీ, సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ , గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి జివి సూర్య కిరణ్ తదితరులు హాజరవుతారన్నారు. సాంస్కృతిక కళాకారులచే గద్దర్ రాసిన పాటల ఇతివృత్తంతో రూపొందించిన సాంస్కృతిక ప్రదర్శనలు స్కిట్స్, నాట్యప్రదర్శనలుంటాయన్నారు. కళాకారుల పాటలు, ప్రదర్శనలుంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సినియర్ దళిత నాయకులు పి ఎల్లయ్య, డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, గౌసొద్దిన్ , డిబిఎఫ్ మండల అధ్యక్షులు చంద్రం, సామాజిక కార్యకర్త ఉమర్ ,సొక్కం నర్సింలు,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి తొలి మహిళా ముఖ్యమంత్రిగా

కవిత అవడం ఖాయం

- తెలంగాణ జాగృతి జిల్లా నేత మిట్టపల్లి శ్రీనివాస్ ముదిరాజ్

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 29:

తెలంగాణ రాష్ట్రానికి తొలి మహిళా ముఖ్యమంత్రిగా కల్వకుంట్ల కవిత అవడం ఖాయమని తెలంగాణ జాగృతి జిల్లా నాయకులు సిద్ధరబోయిన శ్రీనివాస్ ముదిరాజ్ (మిట్టపల్లి) అన్నారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్లో నిర్వహించిన మీడియా సమావేశంలో తెలంగాణ జాగృతి నాయకులు మాట్లాడారు. ఇప్పుడు జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ గుర్తుపై తెలంగాణ జాగృతి అన్ని మున్సిపాలిటీలలో పోటీ చేస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన ఉద్యమకారులకే తమ పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. సిద్దిపేటలో రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ పార్టీ పునాదులు పెకలించడం ఖాయమన్నారు. మరి కొద్ది రోజుల్లోనే సిద్దిపేట నుండి కల్వకుంట్ల కవిత ఎన్నికల సమర శంఖం పూరిస్తారని తెలిపారు. సిద్దిపేట ప్రాంతంలో అన్ని వర్గాల ప్రజల మద్దతు కవితకు ఉందని, రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ జాగృతి అతిపెద్ద రాజకీయ శక్తిగా ఎదుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి నాయకులు వర్కోలు శ్రీనివాస్, ఏ. బాలయ్య, కొనయాపల్లి రాజు పలువురు పాల్గొన్నారు.

రైతులకు భూతగాదాలు లేని మెదక్ జిల్లాగా తీర్చిదిద్దాలి

- పక్కగా భూమి నక్ష, మ్యాప్,హద్దుల నిర్ణయం
- పటిష్టంగా భూ రికార్డులు
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ జనవరి 29 :

జిల్లాను భూ తగాదాలు లేనీ జిల్లాగా తీర్చిదిదలని,ప్రతి భూ కమతానికి సరైన నక్షను,మ్యాప్ ను, హద్దులను నిర్ణయించి, పటిష్టమైన భూ రికార్డులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. భూ భారతి చట్టం భూముల రీసర్వే కార్యక్రమం కోసం మెదక్ మండలంలోని పైలెట్ గ్రామపంచాయతీ అయిన పాషాపూర్ లో బుధవారం గ్రామసభ నిర్వహించారు.భూ భారతి చట్టం భూముల రీసర్వే కోసం నిర్వహించిన గ్రామ సభలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్,అదనపు కలెక్టర్ నగేష్, తహసిల్దార్ లక్ష్మణ్ బాబు లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ..భూ భారతి చట్టం ద్వారా అన్ని భూ సమస్యల పరిష్కారం అవుతుందని తెలిపారు.ప్రతి కమతానికి రీసర్వే చేసి రైతులకు భూ తగాదాలు లేకుండా చూడడమే దీని ముఖ్య ఉద్దేశం అని అన్నారు. డిజిటల్ సర్వే తో హద్దుల నిర్ణయించి ,అక్షాంశ రేఖాంశాలతో సర్వే చేయడం జరుగుతుందన్నారు. ఈ సర్వే తో భూ హద్దులు చెరిగి పోకుండా ఉంటాయని, భూమి ఆక్రమణలకు గురి కాకుండా ఉంటుందన్నారు. ఈ రీసర్వే అనంతరం రైతులు భూమిని ఎక్కడకు వెళ్లిన లేదా విదేశాల్లో సైతం తన భూమిని పరిశీలించుకోవచ్చని తెలిపారు. తర్వాత రోజుల్లో ఈ గ్రామాన్ని నమూనాగా తీసుకొని జిల్లాలోని మరో 23 గ్రామాల్లో భూ భారతి భూముల రీసర్వే చేసి సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు.జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న భూములాన్ని రీసర్వే చేసి భూమి సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్... ప్రజలు, అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

బండచెర్లపల్లి తొలి గ్రామ సభ విజయవంతం

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 29:

సిద్ధిపేట రూరల్ మండలం బండచెర్లపల్లి గ్రామంలో గురువారం సర్పంచ్ పొన్నాల నాగరాజు ఆధ్వర్యంలో మొదటి గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, అధికారులు, గ్రామ పెద్దలు, మహిళా సభ్యులు ,యువత కృషితో గ్రామ అభివృద్ధికి సంబంధించిన అంశాలను చర్చించారు.సభలో ప్రధానంగా గ్రామ అభివృద్ధి, శుభ్రత, విద్య, రోడ్లు, విద్యుత్,సాంఘిక కార్యక్రమాలపై దృష్టి పెట్టడం జరిగింది. గ్రామస్థులు తమ అభిప్రాయాలను వ్యక్తపరిచేందుకు అవకాశం లభించడంతో గ్రామ సంక్షేమ కార్యక్రమాల పట్ల కొత్త ఉత్సాహాన్ని సృష్టించింది.

బంగారం ధరలు పెరగడంతో చైన్ స్నాచింగ్ లు పెరిగిపోయాయని, అంతర్రాష్ట్ర ముఠాలు హైదరాబాద్ లో మకాం వేశాయని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం అవాస్తవం. అలాంటి పోస్టులను షేర్ చేయొద్దు. అసత్య ప్రచారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. హైదరాబాద్ పూర్తిగా సురక్షితం. అనుమానం వస్తే 100కు కాల్ చేసి శాంతి భద్రతల పరిరక్షణలో సహకరించాలి.

- సజ్జనార్, హైదరాబాద్ సీపీ

ప్రాంతీయం

జిల్లా కేంద్రానికి చేరుకున్న మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు టి. రవి కిరణ్

ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ జనవరి 29 :-

ఎన్నికల నియమాల్లో భాగంగా మెదక్ జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు టి రవి కిరణ్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకున్నారు. మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు టి రవి కిరణ్ కు జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. జిల్లాలో ఎన్నికల తీరును, మున్సిపాలిటీలను, మున్సిపాలిటీలో వార్డుల గురించి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సాధారణ పరిశీలకులు రవి కిరణ్ కు వివరించారు. సాధారణ పరిశీలకులు మెదక్ జిల్లాలోని నాలు మున్సిపాలిటీలలో జరిగే ఎన్నికల సరళిని పరిశీలించనున్నారు.అనంతరం మెదక్ మున్సిపల్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ తో కలసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు సిబ్బంది ఉన్నారు.

మధ్యాహ్న భోజనం, వైద్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు

- జిల్లా కలెక్టర్ హైమావతి హెచ్చరిక

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 29 :

సిద్దిపేట అర్బన్ మండలంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, పాఠశాలలు, గురుకులాలు, బస్తీ దవాఖానల్లో అందుతున్న సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.రంగధాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, బిర్యానీ అన్నం, ఆలుగడ్డ-టమాటా కూరను పరిశీలించారు. కూరలో నీటి శాతం ఎక్కువగా ఉండటంపై వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరు మేరకు కొలత ప్రకారం ఆహారం వండాలని, పలచటి కూరలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. భోజనం సమయంలో విద్యార్థులు లేవకుండా, వారి వద్దకే వెళ్లి వడ్డించాలని ఆదేశించారు. కామన్ డైట్ మెనూ తప్పని సరిగా పాటించాలని, రుచికరమైన మరియు కడుపునిండా సరిపడే ఆహారం అందించాలని ప్రిన్సిపల్‌కు సూచించారు. ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం నిర్ణయించిన పరిమాణం ప్రకారమే ఆహారం అందించాలని, స్టాక్ రిజిస్టర్లు రోజువారీగా సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఆహారం, విద్య విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని, నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కిచెన్ గార్డెన్‌ను పరిశీలించి మునగ మొక్కలు నాటి కూరల్లో వినియోగించాలని సూచించారు.అనంతరం కెసిఆర్ నగర్ బస్తీ దవాఖానను తనిఖీ చేసిన కలెక్టర్, వైద్య సేవలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మెడికల్ ఆఫీసర్ విధుల్లో లేకపోవడం, నర్సింగ్ స్టాఫ్ ఒక్కరే ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, గైర్హాజరైన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డీఎం & హెచ్ఓను ఫోన్ ద్వారా ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలవ్వాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు

శత చండి యాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీష్ రావు

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 29 :

సిద్దిపేట పట్టణంలోని మహమ్మయమ్మ దేవాలయంలో జరుగుతున్న శత చండి యాగ కార్యక్రమంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దయ అందరిపై ఉండాలని ప్రార్థించిన హరీష్ రావు, శత చండి యాగం జరగడం ఎంతో సంతోషకరమని అన్నారు. అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరికీ ఆరోగ్యం, శాంతి, సుభిక్షం కలగాలని, అన్ని రంగాల్లో శుభం చేకూరాలని ఆకాంక్షించారు.

కోటిలింగాల దేవాలయంలో లలిత నిత్య మహాయాగంలో పాల్గొన్న హరీష్ రావు ..

సిద్దిపేట కోటిలింగాల దేవాలయంలో నిర్వహిస్తున్న శ్రీ లలిత తిథి నిత్య మహా యాగ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదం తీసుకున్నారు. అమ్మవారి కృపతో ప్రజల జీవితాల్లో సుఖశాంతులు వెల్లివిరియాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు.

నామినేషన్ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎస్పీ

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, జనవరి 29:

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర ఎల్లారెడ్డి మున్సిపల్ నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి అక్కడి ఏర్పాట్లు, భద్రతా చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందికి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని, అభ్యర్థులు మరియు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సజావుగా నామినేషన్ ప్రక్రియ నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ ఎల్లారెడ్డి డీఎస్పీ కార్యాలయాన్ని సందర్శించి, రాబోయే మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లు, ఎల్లారెడ్డి పట్టణంలో శాంతిభద్రతల నిర్వహణ, బందోబస్తు చర్యలు తదితర అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేలా అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి డీఎస్పీ యస్. శ్రీనివాసరావు, ఎల్లారెడ్డి సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజారెడ్డి, ఎల్లారెడ్డి ఎస్‌హెచ్‌ఓ మహేష్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

జోరుగా మున్సిపల్ ఎన్నికల నామినేషన్

- అభ్యర్థులను ప్రకటించిన ప్రధాన పార్టీ రాజకీయ పార్టీలు

ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ జనవరి 29 :-

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల షెడ్యూల్ ప్రకారం రెండో రోజు ఎన్నికల నామినేషన్ ప్రక్రియ జోరుగా కొనసాగుతుంది వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు. ఇండిపెండెంట్ అభ్యర్థులు జోరుగా నామినేషన్ వేశారు మెదక్. రామాయంపేట మున్సిపాలిటీలలో నామినేషన్ ప్రక్రియ వేగవద్దంగా కొనసాగింది ఇప్పటికే ప్రధాన రాజకీయ పార్టీలు కాంగ్రెస్. భారతీయ రాష్ట్ర సమితి బిజెపి పార్టీల అభ్యర్థులను ప్రకటించారు వారు తమ నామినేషన్ వేయడం జరుగుతుంది ఇప్పటికే మెదక్ మున్సిపల్ లో కాంగ్రెస్ పదిమంది అభ్యర్థులను మెదక్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ మొదటి అభ్యర్థుల జాబితాను ఎమ్మెల్యే డా.మైనంపల్లి రోహిత్ రావు ప్రకటించారు. వార్డు నం.2 ఎరుకల నర్సింలు, వార్డు నం.3 కందుల చిన్న యశోద, వార్డు నం.5 రాగి అశోక్, వార్డు నం.7 షంషున్నీసా, వార్డు నం.8 యెలవర్తి జయశ్రీ, వార్డు నం.11 నస్రీన్ బేగం, వార్డు నం. 14 దొంతి లక్ష్మి, వార్డు నం. 15 దొంతి నరేష్‌గౌడ్, వార్డు నం.29 బొద్దుల కృష్ణ, వార్డు నం.31 శివ రామకృష్ణ పేర్లను ఖరారు చేశారు. టిఆర్ఎస్ మెదక్ మున్సిపాలిటీ 18 వార్డులకు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల ఖరారు చేసినట్టు మున్సిపల్ ఎన్నికల ఇంచార్జి, మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుసేన్ తెలిపారు. గురువారం ఆయన అభ్యర్థుల జాబితాను వెల్లడించారు. వార్డు నెం 1 : చెప్యాల రాజవ్వ సంజీవ్ ఎస్సీ మాదిగ.వార్డ్ నెంబర్ 2: ఎరుకల ఎల్లయ్య ఎస్టీ ఎరుకల. వార్డు నెం 3 కోట్టాల లలితమ్మ విశ్వం బీసీ లింగాయత్.వార్డ్ నెంబర్ 4 ధర్మిశెట్టి స్వరూప , బీసీ లింగాయత్. వార్డ్ నెంబర్ 5 మామిండ్ల ఆంజనేయులు, బిసి ముదిరాజ్.వార్డ్ నెంబర్ 7 మాయ అనురాధ శ్రీనివాస్, బీసీ వంజరి.వార్డ్ నెంబర్ 8 మాయ గంగమణి మల్లేశం, బీసీ వంజరి. వార్డ్ నెంబర్ 10 వనం లత వెంకటేష్, ఎస్టి కుంచెరుకల వార్డ్ నెంబర్ 11 కొండన్ సావిత్రి సురేందర్ గౌడ్, బీసీ గౌడ్.వార్డ్ నెంబర్ 15 అరెలగాయత్రి మల్లికార్జున్ గౌడ్ బీసీ గౌడ్. వార్డు నెం 18:టేకి శంకర్,ఎస్సీ బుడగ జంగం. వార్డ్ నెంబర్ 21: మదురి సత్తెమ్మ చంద్రశేఖర్ గౌడ్, బీసీ గౌడ్.వార్డు నెం 23 మద్దిబోయిన శృతి సంతోష్, బీసీ పూసల
వార్డ్ నెంబర్ 25 : కాజా సోహెల్ మోహిద్దీన్, బిసి ముస్లిం. వార్డ్ నెంబర్ 28: బండిపూజ నరేష్ , బీసీ ముదిరాజ్.వార్డ్ నెంబర్ 29బట్టి ఉదయ్ కుమార్, బీసీ మున్నూరు కాపు.వార్డ్ నెంబర్ 31 ఆర్ కే శ్రీనివాస్, బీసీ వార్డ్ నెంబర్ 32:గోదల జ్యోతి కృష్ణ, బిసి ముదిరాజ్ .నేడు ఎన్నికల నామినేషన్ చివరి తేదీ కావున భారీగా నామినేషన్ ప్రక్రియ కొనసాగుతుందని వార్డు నుండి ప్రధాన రాజకీయ పార్టీలే కాకుండా ఇండిపెండెంట్ అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలో ఉంటారని రాజకీయం విశ్లేషకుల అంచనా.

ఎన్నికలు.. 21 ఏళ్ల యువతి పోటీ

మెదక్ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా గురువారం రెండవ రోజు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుంది.ఈ సందర్భంగా 17వ వార్డులో కాంగ్రెస్ పార్టీ నుంచి 21 సంవత్సరాల గోద వైష్ణవి నామినేషన్ దాఖలు చేశారు. మెదక్ మున్సిపల్ ఎన్నికల్లో యువత పోటీ చేయడం, ఎన్నికల ప్రచారం నిర్వహించడం సర్వత్ర ఆసక్తి నెలకొంది.

సీఎం రేవంత్ రెడ్డి కక్ష సాధింపు చర్యలు పరాకాష్టకు చేరాయి

- తెలంగాణ జాతిపిత కేసీఆర్ కు నోటీసులు ఇవ్వడం తెలంగాణ అస్తిత్వానికే అవమానం
- కుంభకోణాల నుండి ప్రజల దృష్టి మళ్లించడానికే ఈ డ్రామాలు
- రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దగ్ధం

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 29 :

తెలంగాణ సాధకుడు కేసీఆర్ కి సిట్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ వేల్పూర్ మండల కేంద్రంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ తగులబెట్టి నిరసన తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా నిలబెట్టిన తెలంగాణ జాతిపిత కేసీఆర్ కు సిట్ నోటీసులు ఇవ్వడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇది సీఎం రేవంత్ రెడ్డి కక్ష సాధింపు చర్యలు పరాకాష్ట అని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక, పాలనను గాలికి వదిలేశారని విమర్శించారు. ప్రజల దృష్టిని మళ్లించడానికే కాళేశ్వరం కమిషన్లని, సిట్ అని, ఫోన్ ట్యాపింగ్ అని రకరకాల పేర్లతో కేటీఆర్, హరీష్ రావు, సంతోష్ రావు, ఇప్పుడు ఏకంగా కేసీఆర్ ను వేధిస్తున్నారని మండి పడ్డారు. ప్రస్తుత మంత్రివర్గాన్ని "దండుపాళ్యం బ్యాచ్"గా అభివర్ణిస్తూ వారు రోజుకో కుంభకోణానికి పాల్పడుతున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. దొరికింది దొరికినట్టు రాష్ట్రాన్ని దోచుకుతింటున్నారని విమర్శించారు. మాజీ మంత్రి హరీష్ రావు ఇప్పటికే బొగ్గు స్కామ్, సోలార్ పవర్ స్కామ్, సింగరేణి డీజిల్ స్కామ్, ఎక్సైజ్ (మద్యం) స్కామ్‌లను బయటపెట్టారని గుర్తుచేశారు. ఈ స్కామ్‌ల నుండి తప్పించుకోవడానికి, ప్రజల దృష్టి మరల్చడానికి కేసీఆర్ కు నోటీసుల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని అన్నారు. వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మికులకు పెన్షన్లను 200 నుండి 2000 చేసిన ఘనత కేసీఆర్ దని, రైతులకు 24 గంటల కరెంట్, సాగునీరు, ఎరువులు, రైతుబంధు అందించి రైతులను ఆదుకున్న గొప్ప నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. కోట్లాది మంది ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకున్న నాయకుడిని, పోలీసులను అడ్డం పెట్టుకొని అవమానించడం దారుణమన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులు పనిచేయకుండా, కేసుల చుట్టూ తిరిగేలా చేయాలనే కుట్రతోనే రేవంత్ రెడ్డి ఈ చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ ను వేధిస్తే ఆ ఉసురు ఈ ప్రభుత్వానికి, రేవంత్ రెడ్డికి తగలకుండా పోదని హెచ్చరించారు. న్యాయం, ధర్మం తమ వైపే ఉన్నాయని, ఈ కక్ష సాధింపు చర్యలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని స్పష్టం చేశారు. యావత్ తెలంగాణ సమాజం బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ వెంటే ఉంటుందన్నారు.

మన ఇందూరు మన మేయర్ నినాదంతో ముందుకెళ్దాం

- ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం ఉన్న పార్టీ బీజేపీ
- 22 డివిజన్ నుండి బీజేపీలోకి భారీగా చేరికలు
- బీజేపీ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ
- మన ఇందూరు మన మేయర్ నినాదంతో ముందుకెళ్దాం

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 29 :

ఈ సారి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మన ఇందూర్ మన మేయర్ అనే నినాదంతో బీజేపీ శ్రేణులు ప్రతి డివిజన్ లో ముందుకు వెళ్లాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్య నారాయణ పిలుపు నిచ్చారు. పార్టీ అంటేనే అభివృద్ధి అని అభివృద్ధి అంటేనే బీజేపీ అని ఆయన కొనియాడారు. గురువారం బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులచారి అధ్యక్షతన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ సమక్షంలో నగరంలోని 22వ డివిజన్ మాజీ కార్పొరేటర్ పోతుల పురుషోత్తం అదే డివిజన్ నుండి తాటికొండ రాము, ఆకుల శ్రీనివాస్, రాజ్ కుమార్, గౌత ఆనంద్, కుందన్ శ్రీనివాస్ లతో పాటు సుమారు 200 మంది డివిజన్ వాసులు బీజేపీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నరేంద్ర మోదీ వరుసగా గత మూడు ధపాలుగా ప్రధానిగా దేశాన్ని పరిపాలిస్తూ ఏమాత్రం అవినీతి లేని దేశంగా భారతదేశాన్ని ప్రపంచంలోనే నెంబర్ వన్ గా తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎంపీ అరవింద్ జిల్లాలో చేస్తున్న విస్తృత అభివృద్ధి పనులకు ఆకర్షితులై, మున్సిపల్ ఎన్నికలకు ముందు బీజేపీ పార్టీలో చేరడం శుభపరిణామం అని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఉజ్వల్ యోజన కింద గ్యాస్ సిలిండర్లు తక్కువ ధరకే అందివ్వడం, అలాగే చిరు వ్యాపారులకు ముద్ర లోన్ పథకం కింద లక్ష రూపాయల వరకు రుణ సదుపాయాలు అందివ్వడం, వాటి ద్వారా చిన్న, మధ్య తరగతి ప్రజలు స్వతహాగా వ్యాపారాలు నిర్వహించుకునేందుకు ఈ రుణాలు ఎంతగానో దోహదపడుతున్నాయని ఆయన అన్నారు. అదేవిధంగా కేవలం 14 రూపాయలతో దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోడీ గారు రెండు లక్షల జీవిత బీమా కల్పించడం ప్రపంచంలో ఎక్కడా లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇక రాబోయే రోజుల్లో కచ్చితంగా మున్సిపల్ కార్పొరేషన్ పై బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమని, ఈ చేరికల ద్వారా తనకు పూర్తి నమ్మకం కలుగుతుందని ఆయన దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 22వ డివిజన్ నుండి సుమారు 200 మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బీజేపీలో చేరారు. ఇదిలా ఉండగా 22వ డివిజన్ మహిళా మణులు రాబోయే రోజుల్లో బీజేపీ వైపే తాముంటామని ఎమ్మెల్యే కు భరోసా కల్పించారు.

మున్సిపాలిటీకి కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించిన టీజీఐఐసీ చైర్‌పర్సన్

ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 29:

సంగారెడ్డి మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులను ప్రకటించింది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ఈ జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆంజనేయులు, పట్టణ అధ్యక్షుడు జార్జ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘు గౌడ్, సీనియర్ నాయకులు బొంగుల రవి, కూన సంతోష్, కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలోని 38 వార్డుల్లో 4, 22, 33 వార్డులు మినహా మిగిలిన 36 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించారు. ఇందులో 1వ వార్డుకు కుమ్మరి కృష్ణ, 2వ వార్డుకు ఆవుల సునీత, 3వ వార్డుకు నందనాయకుల కుమార్, 5వ వార్డుకు బీబీ పూర్నూర్ జహాన్, 6వ వార్డుకు ఎండీ ఖాజా నవాజుద్దీన్, 7వ వార్డుకు వంశీ కృష్ణ, 8వ వార్డుకు భూమేష్, 9వ వార్డుకు శ్రీలత శ్రీశైలం, 10వ వార్డుకు శైలేందర్ రెడ్డి, 11వ వార్డుకు గడ్డం తులసి రామ్, 12వ వార్డుకు ప్రవీణ్ (సీఎస్ఐ), 13వ వార్డుకు బేగరి వీణా కుమారి, 14వ వార్డుకు భవాని శంకర్ (భువి), 15వ వార్డుకు దన్నారం సుష్మిత, 16వ వార్డుకు శాంతి, 17వ వార్డుకు జ్యోతి, 18వ వార్డుకు యశస్విని, 19వ వార్డుకు గుర్రం ఝాన్సీ, 20వ వార్డుకు అనీస్ సుల్తానా (మోతే శ్యామ్), 21వ వార్డుకు తోపాజీ వీణా హరీష్, 23వ వార్డుకు కూన వనిత, 24వ వార్డుకు ఉల్ఫత్ సుల్తానా, 25వ వార్డుకు అయేషా సుల్తానా, 26వ వార్డుకు షేక్ షఫీ హఫీజ్, 27వ వార్డుకు ఎం. శిరీష శశికాంత్, 28వ వార్డుకు జీ. సంగీత మహేష్, 29వ వార్డుకు నీరుడి మీన, 30వ వార్డుకు జి. మనీష, 31వ వార్డుకు జగ్గరి సతీష్ రెడ్డి, 32వ వార్డుకు జగ్గరి రమ్యశ్రీ, 34వ వార్డుకు రిజ్వానా బేగం (అడ్డు), 35వ వార్డుకు కడమంచి నర్సమ్మ, 36వ వార్డుకు సాతెల్లి మాధురి, 37వ వార్డుకు జార్జ్ మాథ్యూ, 38వ వార్డుకు నదీమ్‌లను అభ్యర్థులుగా ప్రకటించారు.

4, 22, 33 వార్డులకు సంబంధించి అభ్యర్థుల ఎంపిక పెండింగ్‌లో ఉందని, త్వరలోనే ఆ వార్డుల పేర్లను ప్రకటిస్తామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

సదాశివపేట మున్సిపాలిటీ కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థుల జాబితా విడుదల

సంగారెడ్డి, (సదాశివపేట):

సదాశివపేట మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ తమ కౌన్సిలర్ అభ్యర్థుల జాబితాను అధికారికంగా ప్రకటించింది. మొత్తం 26 వార్డులకు గాను 25 వార్డులకు అభ్యర్థులను ఖరారు చేసినట్లు పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఆంజనేయులు, సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, సదాశివపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

వార్డు నెంబర్ 1 నుంచి 26 వరకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఇలా ఉన్నారు.

వార్డు 1లో పిల్లోడి విశ్వనాథం, వార్డు 2లో ఎరుకల నర్సింహులు, వార్డు 3లో రేణుక, వార్డు 4లో ఎండీ. మోయిజ్, వార్డు 5లో ఖుతేజా ఫాతిమా పోటీ చేస్తున్నారు. వార్డు 7లో పాతదొడ్డి అనిత, వార్డు 8లో సిహెచ్. రేణుక, వార్డు 9లో బి. అరుణ్ కుమార్, వార్డు 10లో కంది నర్సింహులు గౌడ్, వార్డు 11లో గోపి ప్రియాంకను పార్టీ బరిలోకి దింపింది.

అలాగే వార్డు 12లో పులిమామిడి మమత, వార్డు 13లో పిల్లోడి భవాని, వార్డు 14లో రాయపాడు స్వరూప, వార్డు 15లో గౌసియా బేగం, వార్డు 16లో కొత్తగొల్ల చంద్రశేఖర్ అభ్యర్థులుగా ఉన్నారు. వార్డు 17లో ఎండీ. షాజీ, వార్డు 18లో ఆకుల నిఖిత, వార్డు 19లో పట్లూరి రోజా, వార్డు 20లో మునిపల్లి అంజమ్మ, వార్డు 21లో ఎండీ. వాజీద్‌కు టికెట్లు కేటాయించారు.

ఇక వార్డు 22లో పతనం విజయలక్ష్మి, వార్డు 23లో వానగంటి లక్ష్మి ప్రియ (ముగిటి లక్ష్మి ప్రియ), వార్డు 24లో ఎండీ. కలీమ్, వార్డు 25లో కే. శంకర్ గౌడ్, వార్డు 26లో కావులే హారిక పోటీ చేయనున్నారు. 6వ వార్డు అభ్యర్థి ఖరారు కావాల్సి ఉండగా, త్వరలోనే ప్రకటిస్తామని నాయకులు తెలిపారు.

అభ్యర్థులందరూ తమ తమ వార్డుల్లో ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. స్థానిక సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పట్టణ సమగ్ర అభివృద్ధే ప్రధాన అజెండాగా కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో ప్రజల ముందుకు వెళ్తోందని పార్టీ నాయకులు పేర్కొన్నారు.

"తిరుమల వెంకన్న ఆస్తులు కొట్టేయాలన్న కుట్రతో పవిత్రమైన లడ్డూ ప్రసాదాన్ని జగన్ కల్తీ చేయించారు. పామాయిల్ , ఇతర కెమికల్స్ తో లడ్డూ కల్తీ జరిగిందని, నెయ్యి లేదని సిట్ స్పష్టం చేసింది. జంతు కొవ్వు లేదు కదా అని చేసిన తప్పు కప్పిపుచ్చుకోవడానికి వైసీపీ బ్యాక్ బుకాయిస్తోంది. కల్తీ విషయంలో చట్టం తనపని తాను చేసుకుపోతుంది.

- ఏపీ మంత్రి సవిత

చైనాకు 'నిఫా' భయం..

చైనాకు 'నిఫా' వైరస్ భయం పట్టుకుంది. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా భారత్ సహా వైరస్ ప్రభావిత ప్రాంతాల నుంచి వస్తున్న ప్రయాణికులకు విమానాశ్రయాల్లో స్క్రీనింగ్ ప్రక్రియ ప్రారంభించింది. చైనా అధికారులు స్వాబ్ పరీక్షలు నిర్వహిస్తున్నారని బీజింగ్ చేరుకున్న కొంతమంది భారతీయ ప్రయాణికులు తెలిపినట్లు 'పీటీఐ' వార్తాసంస్థ పేర్కొంది.ఇప్పటివరకైతే తమ దేశంలో నిఫా కేసులు నమోదు కాలేదని చైనా వ్యాధి నియంత్రణ, నిర్మూలనా కేంద్రం ఇటీవల వెల్లడించింది. భారత్‌లోని పశ్చిమ బెంగాల్ లో ప్రస్తుతం ఈ వైరస్ ఉందని, అయితే.. ఆ రాష్ట్రంతో చైనాకు సరిహద్దు లేదని తెలిపింది. భారత్‌లో నిఫా వైరస్ వ్యాప్తితో చైనాపై ప్రభావం అతి తక్కువేనని పేర్కొంది. అయితే, విదేశాల నుంచి వచ్చే వారితో ఈ వైరస్ వ్యాప్తి చెందే అవకాశాలను కొట్టిపారేయలేమని, ఈ నేపథ్యంలో నివారణ చర్యలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపింది. ఈ క్రమంలోనే చైనా ఆరోగ్య అధికారులు అప్రమత్తమయ్యారు. పర్యవేక్షణను కట్టుదిట్టం చేశారు. వైరస్ నిర్ధరణ పరీక్షలు, సిబ్బందికి శిక్షణను ప్రారంభించారు.పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల ఇద్దరికి నిఫా వైరస్ సోకింది. మరో 196 మంది కాంటాక్టులకు పరీక్షలు నిర్వహించగా.. నెగెటివ్ వచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అప్రమత్తమైంది. బెంగాల్‌లో పరిస్థితులను సమీక్షించింది. ఈ వైరస్ వ్యాప్తిని కట్టడి చేసినట్లు ప్రకటించింది. మరోవైపు.. థాయ్‌లాండ్, నేపాల్, మలేషియా, తైవాన్ తదితర దేశాలూ 'నిఫా' స్క్రీనింగ్ ప్రారంభించాయి.

విశ్వ వీక్షణం

పొగ-మద్యం.. ప్రాణాంతక కాంబో



ధూమపానం, మద్యపానం ఆరోగ్యానికి హానికరం, ఖైనీ, గుట్కాలతో మీ జీవితాలను నాశనం చేసుకోవద్దు... అంటూ ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు చేసే ప్రచారం తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో ఏ మాత్రం ప్రభావం చూపడం లేదు. కుటుంబాలను చిదిమేసే ఈ అలవాట్ల కోసం తెలంగాణ గ్రామీణ ప్రాంత ప్రజానీకం భారీగా ఖర్చు చేస్తున్నారు. ఎంతలా అంటే తమ సంపాదనలో అధిక భాగాన్ని ఆహారం, ఆరోగ్యం, విద్య కంటే గుట్కా, ఖైనీ, సిగిరెట్లు, మద్యానికే కేటాయిస్తున్నారు. ఈ ఖర్చు దేశ సగటు కంటే రెండింతలు అధికంగా ఉండడం అత్యంత ఆందోళనకరం. కేంద్ర గణాంకాల శాఖ ఇటీవల విడుదల చేసిన గృహ వినియోగ వ్యయ సర్వే(హెచ్‌సీఈఎస్) 2023 24లో ఈ విషయం వెలుగు చూసింది. ఈ సర్వే ప్రకారం.. పొగాకు, మద్యం వినియోగంలో గ్రామీణ తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. తెలంగాణ గ్రామీణ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి పొగాకు, మద్యం వంటి వాటిపై నెలకు సగటున రూ.396 ఖర్చు చేస్తున్నారు. జాతీయ స్థాయిలో ఈ సగటు రూ.158 మాత్రమే ఉంది. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ నెలవారీ తలసరి వ్యయంలో సుమారు 7.3 శాతాన్ని మత్తుపదార్థాలకే కేటాయిస్తున్నారు. ఇది దేశంలోనే రెండో అత్యధికం. మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో మొత్తం నెలసరి వ్యయం అధికంగా ఉండటమే ఇందుకు కారణం. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో నెలవారి తలసరి వ్యయం సగటున రూ.5,435 ఉండగా పట్టణ ప్రాంతాల్లో రూ.8,978గా ఉంది. ఇవి జాతీయ స్థాయి సగటులు వరుసగా రూ.4122, రూ.6996 కంటే అత్యధికం.

మనిషి శరీరానికి ధూమపానం, మద్యపానం రెండూ కూడా హానిని కలిగిస్తాయి. వీటిని రెండింటిని కలపడం వల్ల తీవ్రమైన అనారోగ్య సమస్యల బారిన పడాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గుండె జబ్బులు, జీర్ణ సమస్యలు, క్యాన్సర్ వంటి తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. కొంతమంది అప్పుడప్పుడు తాగే మద్యం, ధూమపానం వల్ల ఆరోగ్యానికి ఎటువంటి హాని కలగదు అని భావిస్తారు. కానీ ఈ రెండింటిని కలిపి ఒకే సమయంలో చేయడం వల్ల ఆరోగ్యానికి రెట్టింపు నష్టం కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు. వీటిని కలిపి చేయడం వల్ల అనారోగ్య సమస్యలు మాత్రమే కాదు. మనిషి వినాశనానికి కూడా దారి తీస్తాయని వారు హెచ్చరిస్తున్నారు.

జీర్ణ వ్యవస్థకు..

మద్యపానం, ధూమపానం కలిపి చేయడం సరదాగా బాగున్నప్పటికీ వీటిని ఒకేసారి చేయడం వల్ల శరీరం తీవ్ర ఒత్తిడికి గురి అవుతుంది. మద్యం శరీర డీహైడ్రేషన్‌కు దారి తీస్తుంది, సరైన నిర్ణయాలు తీసుకునే స్థామర్యం తగ్గేలా చేస్తుంది. ధూమపానం వల్ల ఏకకాలంలో శ్వాసకోశ వ్యవస్థపై దాడి జరుగుతుంది. శ్వాస తీసుకోవడం కష్టంగా మారుతుంది. ఇక ఈ రెండు కలిసినప్పుడు జీర్ణవ్యవస్థకు చికాకు కలుగుతుంది. దీని వల్ల అసౌకర్యం, గ్యాస్, ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలు తలెత్తుతాయి. సమన్వయ లోపం వంటి తక్షణ ప్రభావాలను కూడా అనుభవిస్తారు. ఇవి మిమ్మల్ని మాత్రమే కాకుండా మీ చుట్టూ ఉండే వారిని కూడా ప్రమాదంలో పడేలా చేస్తాయి. ధూమపానం, మద్యపానం విడివిడిగా శరీరంలో ముఖ్యమైన అవయవాలను దెబ్బతీస్తాయి.

లివర్ ఆరోగ్యానికి..

ధూమపానం ఊపిరితిత్తులను దెబ్బతీస్తే, మద్యపానం కాలేయ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. ఇవి రెండు కలిసి గుండె ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. శరీరంలో అవయవాలన్నీ ఇబ్బందులకు గురి అవుతాయి. రక్తపోటు పెరుగుతుంది. గుండెపై అధిక ఒత్తిడి పడుతుంది. కాలక్రమేణా ఇది శరీర రోగనిరోధక వ్యవస్థను దెబ్బతీస్తుంది. తరచూ ఇన్ఫెక్షన్ ల బారిన పడాల్సి వస్తుంది. పునరుత్పత్తి ఆరోగ్యం దెబ్బతింటుంది. సంతానోత్పత్తి తగ్గడంతోపాటు లైంగిక సామర్థ్యం తగ్గుతుందని వైద్యులు చెబుతున్నారు. ధూమపానం, మద్యపానం కలిపి చేయడం వల్ల ఊపిరితిత్తులు, కాలేయం, గొంతు, రొమ్ము క్యాన్సర్ వంటి ప్రాణాంతక సమస్యల బారిన పడాల్సి వస్తుంది. దీర్ఘకాలిక మద్యపానం వల్ల కాలేయ సిర్రోసిస్ వంటి సమస్యలు తలెత్తుతాయి. దీర్ఘకాలిక ధూమపానం వల్ల బ్రోన్కైటిస్, ఎంఫిసెమా, గుండె జబ్బులు, స్ట్రోక్ వంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ రెండింటిని దీర్ఘకాలం పాటు కలిపి చేయడం వల్ల ప్రమాదం మరింత ఎక్కువగా ఉంటుంది. ఇక గర్భిణీ స్త్రీలు, యువకులు, మధుమేహం ఉన్న వారు, శ్వాసకోశ సమస్యలతో బాధపడే వారికి ఇవి మరింత హానిని కలిగిస్తాయి. గర్భిణీ స్త్రీలల్లో పుట్టుకతో వచ్చే సమస్యలు, శిశువు అభివృద్ధి సరిగ్గా లేకపోవడం వంటి సమస్యలు వస్తాయి. యువకులు చిన్న వయసులోనే వీటిని అలవాటు చేసుకోవడం వల్ల వ్యసనంగా మారడంతో పాటు తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. అలాగే మధుమేహం, శ్వాస సమస్యలు, రక్తపోటు వంటి సమస్యలతో బాధపడే వారు మద్యాన్ని, పొగాకును కలపడం వల్ల ఆయా లక్షణాలు మరింత తీవ్రతరం అవ్వడంతో పాటు చికిత్స కూడా కష్టతరం అవుతుంది. కనుక మద్యపానం, ధూమపానం రెండు కూడా ఆరోగ్యానికి హానికరమే అయినప్పటికీ వీటిని కలిపి చేయడం మానుకోవడం మంచిదని వైద్యులు సలహా ఇస్తున్నారు.

గర్భిణీలకు..

ఈ రెండింటిని దీర్ఘకాలం పాటు కలిపి చేయడం వల్ల ప్రమాదం మరింత ఎక్కువగా ఉంటుంది. ఇక గర్భిణీ స్త్రీలు, యువకులు, మధుమేహం ఉన్న వారు, శ్వాసకోశ సమస్యలతో బాధపడే వారికి ఇవి మరింత హానిని కలిగిస్తాయి. గర్భిణీ స్త్రీలల్లో పుట్టుకతో వచ్చే సమస్యలు, శిశువు అభివృద్ధి సరిగ్గా లేకపోవడం వంటి సమస్యలు వస్తాయి. యువకులు చిన్న వయసులోనే వీటిని అలవాటు చేసుకోవడం వల్ల వ్యసనంగా మారడంతో పాటు తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. అలాగే మధుమేహం, శ్వాస సమస్యలు, రక్తపోటు వంటి సమస్యలతో బాధపడే వారు మద్యాన్ని, పొగాకును కలపడం వల్ల ఆయా లక్షణాలు మరింత తీవ్రతరం అవ్వడంతో పాటు చికిత్స కూడా కష్టతరం అవుతుంది. కనుక మద్యపానం, ధూమపానం రెండు కూడా ఆరోగ్యానికి హానికరమే అయినప్పటికీ వీటిని కలిపి చేయడం మానుకోవడం మంచిదని వైద్యులు సలహా ఇస్తున్నారు.

అమెరికాకు షాక్

ట్రంప్ బెదిరింపులు కారణమో తెలియదు గానీ మిత్రదేశాలు మెల్లమెల్లగా అమెరికాకు దూరమవుతున్నట్లుగా కనిపిస్తోంది. మొన్నటికి మొన్న భారతదేశంతో యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు మరో మిత్ర దేశమైన బ్రిటన్ కూడా ఇప్పుడు చైనాతో కీలక ఒప్పందం చేసుకుంది. ఇప్పటికే భారత్‌ఈయూ డీల్ తమను నిరాశ పరిచ్చిందని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ అన్నారు. ఇప్పుడు ఏకంగా బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్.. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను కలిసి కీలక ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలను చూస్తుంటే.. నెమ్మది.. నెమ్మదిగా అమెరికాకు మిత్ర దేశాలు దూరమవుతున్నట్లుగా కనిపిస్తోంది.నాలుగు రోజుల పర్యటన కోసం బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ చైనాకు వచ్చారు. అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను కలిసి ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు. ఇంతకు ముందు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, కెనడా ప్రధాని మార్క్ కార్నీ కూడా చైనాలో పర్యటించారు. ఆయా దేశాధినేతలు ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు. ఈ పర్యటనలు అమెరికాకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. మిత్ర దేశాలు దూరమవుతున్నట్లుగా భావిస్తోంది.ఇక జిన్‌పింగ్‌తో సమావేశం తర్వాత కీర్ స్టార్మర్ మాట్లాడుతూ.. అభివృద్ధి, భద్రతను ప్రోత్సహించుకోవడానికి రెండు దేశాల మధ్య సమతుల్య సంబంధాన్ని కోరుకుంటున్నట్లుగా చెప్పారు. చైనా ప్రపంచ వేదికపై కీలక పాత్ర పోషిస్తుందని కొనియాడారు. విభేదాలు ఉన్నప్పటికీ సమస్యలు చర్చించడం చాలా అవసరం అని పేర్కొన్నారు. బ్రిటన్‌తో దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్యానికి చైనా సిద్ధంగా ఉందని వెల్లడించారు.ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక మిత్రుల్ని.. శత్రువుల్ని ఒకేలా చూస్తున్నారు. పబ్లిక్ వేదికలపై ట్రంప్ విమర్శలు చేస్తున్నారు. ఆ మధ్య దావోస్‌లో ట్రంప్.. కెనడాను తీసిపడేసినట్లుగా మాట్లాడారు. అంతకముందు కెనడాను అమెరికాలో ఒక రాష్ట్రంగా మారుస్తామని వెల్లడించారు. ఇక ఈ మధ్య వెనిజులా దేశాన్ని స్వాధీనం చేసుకున్నాక.. గ్రీన్‌లాండ్‌ను కూడా స్వాధీనం చేసుకుంటామని ట్రంప్ ప్రకటించారు. ఈ ప్రకటన ఐరోపా దేశాలకు రుచించలేదు. ఎట్టి పరిస్థితుల్లో గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోబోనివ్వమని తేల్చి చెప్పాయి. దీంతో అప్పటి నుంచి మిత్రదేశాల మధ్య విభేదాలు తలెత్తాయి. ఈ పరిణామాలపై అమెరికా ఎలా స్పందిస్తుందో చూడాలి.

అజిత్ పవార్‌కు కన్నీటి వీడ్కోలు

- అధికారిక లాంఛనాలతో బారామతిలో అంత్యక్రియలు

'అజిత్ దాదా అమర్ రహే' నినాదాల మధ్య ఎన్సీపీ అధినేత, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్‌కు అభిమానులు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు కన్నీటి వీడ్కోలు పలికారు. అంతకుముందు అజిత్ దాదా కడసారి చూపు కోసం బారామతిలోని ఆయన గృహం వద్ద అభిమానులు క్యూ కట్టారు. బుధవారం విమాన ప్రమాదంలో మరణించిన అజిత్ పవార్‌కు బారామతిలోని విద్యా ప్రతిష్ఠాన్ కాలేజీ గ్రౌండ్‌లో గురువారం పూర్తి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. పవార్ స్థాపించిన ఈ కాలేజీలో ఆయన కుమారులు పార్థ్, జేలు జరిపిన అంతిమ సంస్కారాలకు వేలాది మంది హాజరై తుది నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, శరద్ పవార్ తదితరులు హాజరయ్యారు. అంతిమ సంస్కారాల సమయంలో అజిత్ పవార్ కజిన్, ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే.. పవార్ భార్య సునేత్ర పవార్ పక్కనే ఉండి ఆమెను ఓదార్చారు. కాగా ప్రమాదానికి గురైన విమానం బ్లాక్ బాక్స్ గురువారం లభ్యమైంది.

డిప్యూటీ సీఎంగా సునేత్ర!

విమాన ప్రమాదంలో మృతి చెందిన మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ స్థానంలో ఆయన సతీమణి సునేత్ర పవార్‌ను ప్రతిపాదించాలని ఎన్సీపీ భావిస్తున్నది. ప్రస్తుతం సునేత్ర రాజ్యసభ సభ్యురాలిగా ఉన్నారు.



ఆ ఏజెన్సీలు అతిపెద్ద దోపిడీదారులు

సర్వీస్ ప్రొవైడర్ ఏజెన్సీలు కార్మికుల శ్రమను దోచుకుంటున్నాయని భారత ప్రధాన న్యాయమూర్తి) జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. పట్టణాలు, నగరాల్లో వాళ్లే నిజమైన దోపిడీదారులుగా మారారని అన్నారు. వీటిని తాను వ్యక్తిగతంగా చూశానని తెలిపారు. గృహ సహాయకులకు కనీస వేతనాలకు సంబంధించి దాఖలైన ఓ పిటిషన్ విచారణ సందర్భంగా సీజేఐ ఈ వ్యాఖ్యలు చేశారు ''నైపుణ్యాలున్న ఉద్యోగులను నియమించుకున్నందుకు ఓ ఏజెన్సీకి సుప్రీం కోర్టు రూ.40వేలు చెల్లిస్తోంది. కానీ, ఆ పేద అమ్మాయిలు మాత్రం కేవలం రూ.19వేలు మాత్రమే అందుకుంటున్నారు. దీన్ని నేను వ్యక్తిగతంగా అధికారికంగా చూశాను'' అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. అన్ని ప్రధాన నగరాల్లో సర్వీస్ ప్రొవైడర్ల ఆధిపత్యం కొనసాగుతోందన్నారు. కొన్ని పనులకు ఆయా ఏజెన్సీలను ఉపయోగిస్తున్నామని, ఆ పేరును కోర్టు రూమ్‌లో బహిరంగంగా వెల్లడించలేనని అన్నారు. అన్ని ప్రధాన నగరాల్లో పెద్ద సంస్థలు ఉన్నాయని, ప్రజలను దోపిడీ చేస్తున్నాయన్నారు.



సబలెంకా-రిబాకినా ఫైనల్ ఫైట్

చివరి అంకానికి చేరిన ఆస్ట్రేలియా ఓపెన్ మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ అరీనా సబలెంకా, కజకిస్థాన్ అమ్మాయి ఎలీనా రిబాకినా ఫైనల్ చేరారు. సెమీస్‌లో ఈ ఇద్దరూ తమ ప్రత్యర్థులను చిత్తుచేసి టైటిల్ పోరుకు సిద్ధమయ్యారు. గురువారం రాడ్‌లీవర్ ఎరీనా వేదికగా జరిగిన మహిళల సింగిల్స్ తొలి సెమీస్‌లో సబలెంకా.. 62, 63తో స్విటోలినా (ఉక్రెయిన్)ను వరుస సెట్లలో మట్టికరిపించి సునాయస విజయం సాధించింది. గంటా 16 నిమిషాల పాటు సాగిన పోరులో ప్రపంచ ఒకటో ర్యాంకర్.. పూర్తి నియంత్రణతో కూడిన దూకుడు ముందు స్విటోలినా నిలువలేకపోయింది. సబలెంకాకు ఇది నాలుగో ఆస్ట్రేలియా ఓపెన్ ఫైనల్ కాగా హార్డ్‌కోర్టులలో వరుసగా ఏడోది కావడం విశేషం. టోర్నీ ఆసాంతం రాణించి ప్రిక్వార్టర్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ మాడిసన్ కీస్‌ను ఓడించిన పెగులా (అమెరికా).. కీలక పోరులో ఐదో సీడ్ రిబాకినాకు తలవంచింది. ఇరువురి మధ్య జరిగిన రెండో సెమీస్‌లో రిబాకినా.. 63, 76 (9/7)తో ఆరో సీడ్‌కు షాకిచ్చింది. తొలి సెట్‌ను అలవోకగానే గెలుచుకున్న రిబాకినాకు రెండో సెట్‌లో ప్రత్యర్థి నుంచి గట్టిపోటీ ఎదురైంది. పాయింట్ల కోసం ఇరువురూ చెమటోడ్చడంతో సెట్ టైబ్రేకర్‌కు వెళ్లింది. టైబ్రేకర్‌లోనూ పెగులా పోరాడినా సెట్ పాయింట్‌ను కోల్పోవడం రిబాకినాకు కలిసొచ్చింది. ఈ టోర్నీలో ఆమెకు ఇది రెండో ఫైనల్. 2023లో జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్‌లో ఆమె.. సబలెంకా చేతిలో ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. మరి ఈసారైనా ఆమెను దాటి టైటిల్ దక్కించుకుంటుందా? అనేది ఆసక్తికరం. శనివారం ఈ ఇద్దరి మధ్య ఫైనల్ జరుగనుంది. తాజా టోర్నీలో భాగంగా ఈ ఇద్దరూ ఒక్క సెట్ కూడా ఓడిపోకుండా ఫైనల్ చేరడం గమనార్హం.

ప్రతిపక్షం
Prathipaksham.in
10
హైదరాబాద్
శుక్రవారం
30.01.2026
సినిమా

యూపీపై ఘన విజయం...
ఫైనల్‌లో ఆర్సీబీ

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2026 సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టు ఫైనల్లోకి అడుగుపెట్టింది. వరుసగా రెండు ఓటముల తర్వాత ప్లేఆఫ్స్ సమీకరణాలు సంక్లిష్టంగా మారే ప్రమాదాన్ని ఎదుర్కొన్న స్మృతి మంధాన సేన, కీలకమైన మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన చేసింది. వడోదరలోని బీసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో యూపీ వారియర్స్‌పై 8 వికెట్ల తేడాతో ఏకపక్ష విజయం సాధించి, టోర్నీ చరిత్రలో రెండోసారి ఫైనల్ చేరింది. బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన ఆర్సీబీ, యూపీకి ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు.
ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆర్సీబీ కెప్టెన్ స్మృతి మంధాన ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన యూపీ వారియర్జ్‌కు ఓపెనర్లు కెప్టెన్ మెగ్ లానింగ్ (30 బంతుల్లో 41), దీప్తి శర్మ మంచి శుభారంభం అందించారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 74 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడిని నడిన్ డి క్లర్క్ విడదీసింది. లానింగ్ ఔటైన తర్వాత యూపీ ఇన్నింగ్స్ ఒక్కసారిగా కుప్పకూలింది. ఒకవైపు దీప్తి శర్మ (43 బంతుల్లో 55) ఒంటరి పోరాటంతో అర్ధశతకం పూర్తి చేసినా, మరో ఎండ్‌లో సహకారం కరువైంది. అమీ జోన్స్ (1), హర్లీన్ డియోల్ (14), క్లోట్రయాన్ (6) వంటి కీలక బ్యాటర్లు విఫలమవడంతో యూపీ వేగంగా వికెట్లు కోల్పోయింది.ఆర్సీబీ బౌలర్లలో దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ నడిన్ డి క్లర్క్ అద్భుతంగా రాణించింది. కేవలం 22 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టి యూపీ పతనాన్ని శాసించింది. ఆమె ధాటికి యూపీ బ్యాటింగ్ ఆర్డర్ నిలవలేకపోయింది. గ్రేస్ హారిస్ రెండు వికెట్లు, లారెన్ బెల్, శ్రేయాంక పాటిల్ చెరో వికెట్ తీయడంతో యూపీ వారియర్జ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 143 పరుగులు మాత్రమే చేయగలిగింది.
144 పరుగుల సాధారణ లక్ష్య ఛేదనలో ఆర్సీబీ ఓపెనర్లు గ్రేస్ హారిస్, కెప్టెన్ స్మృతి మంధాన ఆకాశమే హద్దుగా చెలరేగారు. తొలి ఓవర్ నుంచే యూపీ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. ముఖ్యంగా గ్రేస్ హారిస్ విధ్వంసకర బ్యాటింగ్‌తో స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. కేవలం 37 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్సర్లతో 75 పరుగులు చేసి మ్యాచ్ స్వరూపాన్నే మార్చేసింది. వీరిద్దరూ తొలి వికెట్‌కు 108 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. హారిస్ ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన జార్జియా వోల్ (16)తో కలిసి మంధాన ఇన్నింగ్స్‌ను నడిపించింది. ఆరంభంలో నెమ్మదిగా ఆడిన మంధాన, తర్వాత గేరు మార్చి కేవలం 27 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో అజేయంగా 54 పరుగులు చేసింది. దీంతో ఆర్సీబీ కేవలం 13.1 ఓవర్లలోనే 2 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి, ఫైనల్‌కు అర్హత సాధించింది.

సంజు ఫామ్‌పై చాహల్ ఫైర్

టీ20 ప్రపంచ కప్ 2026 మరో 10 రోజుల్లో ప్రారంభం కానుంది. వరల్డ్ కప్ ముంగిట సంజు శాంసన్ ఫామ్ టీమ్‌ఇండియాను కలవరపెడుతోంది. న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌లో అతను ఇప్పటివరకు ఒక్క మ్యాచ్‌లోనూ భారీ ఇన్నింగ్స్ ఆడలేదు. నాలుగు మ్యాచ్‌ల్లో కలిపి 40 పరుగులే చేశాడు. మరోవైపు, చాలా కాలం తర్వాత జట్టులోకి వచ్చిన ఇషాన్ కిషన్ అదరగొడుతున్నాడు. దీంతో వరల్డ్ కప్‌లో శాంసన్‌కు తుది జట్టులో ఉండే అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. ఈ నేపథ్యంలో సంజు ఫామ్‌పై భారత స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ స్పందించాడు. ఎన్నో మ్యాచ్‌లు ఆడిన అనుభవం ఉన్న శాంసన్ పదే పదే విఫలం కావడానికి ఒత్తిడి కారణమని చెప్పలేమని పేర్కొన్నాడు. ''శాంసన్ ఎన్నో ఏళ్లుగా ఆడుతున్నాడు. అతను ఐపీఎల్‌లో మిడిల్ ఆర్డర్‌లో ఆడటం మొదలుపెట్టాడు. తర్వాత ఓపెనర్ అయ్యాడు. 1012 ఏళ్ల పాటు అంతర్జాతీయ క్రికెట్ ఆడిన తర్వాత ఒత్తిడి సాకుగా ఉండకూడదు. ఈ సిరీస్‌లో సంజుకు నాలుగు అవకాశాలు వచ్చాయి. వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. ఒకట్రెండు మ్యాచ్‌ల్లో బాగా ఆడకపోతే ఫర్వాలేదు. కానీ, తర్వాత కూడా నిరాశపర్చడం ఆమోదయోగ్యం కాదు. బ్యాకప్‌గా ఉన్న ఇషాన్ కిషన్ మూడో స్థానంలో బాగా ఆడుతున్నాడు. ఈ విషయం శాంసన్‌కు తెలుసు. టీ20 ప్రపంచ కప్‌నకు ఇంకాస్త సమయం ఉంది. కాబట్టి.. పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. న్యూజిలాండ్‌తో చివరి మ్యాచ్‌లో సంజును ఆడించాలా? వద్దా?అనేది మేనేజ్‌మెంట్ చేతిలో ఉంది.

తొలిరోజు హైదరాబాద్ పైచేయి

రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్‌డీ చివరి మ్యాచ్‌లో బౌలర్లు రాణించడంతో హైదరాబాద్ జట్టు.. తొలిరోజే ప్రత్యర్థిపై పైచేయి సాధించింది. స్థానిక జింఖానా గ్రౌండ్స్‌లో జరిగిన మ్యాచ్ మొదటి రోజు టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ఛత్తీస్‌గఢ్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 283 పరుగులకే ఆలౌట్ చేసింది. ప్రతీక్ యాదవ్ (106) శతకంతో ఆకట్టుకోగా వికల్ప్ తివారి (94) తృటిలో సెంచరీ కోల్పోయాడు. ఈ ఇద్దరూ మినహా మిగిలినవారంతా చేతులెత్తేశారు.హైదరాబాద్ సారథి మహ్మద్ సిరాజ్ (4/56) నాలుగు వికెట్లతో మెరువగా రక్షణ్ (2/28) రెండు వికెట్లు పడగొట్టాడు. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన హైదరాబాద్.. ఆట ముగిసేసమయానికి వికెట్లేమీ నష్టపోకుండా 56 రన్స్ చేసింది. అమన్‌రావు (32*), అభిరాత్ (23*) క్రీజులో ఉన్నారు.

సుమతి పాత్రలో..?

'కల్కి 2898 ఏడీ' సీక్వెల్‌లో సాయిపల్లవి నటించనున్నారా? అంటే అవుననే సమాధానమే ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన సైన్స్ ఫిక్షన్ అండ్ మైథాలజీ సినిమా 'కల్కి 2898 ఏడీ'. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, దీపికా పదుకోన్, కమల్‌హాసన్ ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ చిత్రం 2024 జూన్ 27న విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. 'కల్కి 2898 ఏడీ' సినిమా రిలీజైనప్పుడే ఈ చిత్రం సీక్వెల్ 'కల్కి 2898 ఏడీ 2'ను మేకర్స్ ప్రకటించిన విషయం గుర్తుండే ఉంటుంది. కానీ కొన్ని కారణాల వల్ల ఈ సినిమాలో దీపికా పదుకోన్ నటించడం లేదని, ఇటీవల ఓ సందర్భంలో మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. దీంతో కథలో కీలకమైన సుమతి (దీపిక క్యారెక్టర్) పాత్రలో ఎవరు నటించనున్నారనే చర్చ కొన్ని రోజులుగా ఫిల్మ్‌నగర్‌లో జరుగుతోంది. ఆలియా భట్, ప్రియాంకా చోప్రా తదితర కథనాయికల పేర్లు వినిపించాయి.తాజాగా సాయిపల్లవి పేరు తెరపైకి వచ్చింది. మంచి ఎమోషనల్ డెప్త్ ఉన్న 'కల్కి 2898 ఏడీ' చిత్రంలోని సుమతి పాత్రలో దక్షిణాదికి బాగా సుపరిచితురాలైన సాయిపల్లవి నటిస్తే బాగుటుందని మేకర్స్ భావిస్తున్నారట. మరి... 'కల్కి 2'లో సాయిపల్లవి భాగం అవుతారా? లెట్స్ వెయిట్ అండ్ సీ. మరోవైపు ఈ సినిమా కొత్త షెడ్యూల్ ఫిబ్రవరి మొదటి వారంలో ప్రారంభమవుతుందని, ప్రభాస్ కూడా పాల్గొంటారని భోగట్టా. ఈ సీక్వెల్‌ని వచ్చే ఏడాది రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారని సమాచారం.

సాయం నా స్టైల్ ..

ఇతరులకు సాయం చేయడంలోనే ఆనందం ఉందని నటుడు విజయ్ సేతుపతి అన్నారు. చేసే పనిలోనే తనకు సంతోషం ఉంటుందన్నారు. ఏం చేసినా వంద శాతం కష్టపడతానని చెప్పారు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన 'గాంధీ టాక్స్' జనవరి 30న విడుదల కానుంది. ఈ సినిమా ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.''ఇండస్ట్రీకి రాకముందు ఎన్నో ఉద్యోగాలు చేశాను. అకౌంటెంట్‌గా చేసినప్పుడు ఆ పనిలోనే నాకు ఆనందం ఉండేది. సంపాదించిన డబ్బుతో మన వాళ్లను చూసుకున్నప్పుడు కూడా అంతే సంతోషం వస్తుంది. సమాజ సేవ కూడా చేస్తాను. ఎంతోమందికి ఉద్యోగం వచ్చేలా చేశాను. ఆరేళ్లుగా ఉపాధి లేనివారికి ఉద్యోగ అవకాశాలు ఇప్పించడం కోసం నెలకు రూ.లక్షన్నర ఖర్చు చేస్తున్నా. ఉచితంగా దుస్తులు పంపిణీ చేస్తున్నాను. నేను డబ్బు సంపాదిస్తేనే ఇవన్నీ చేయగలను. ఇవి చేస్తేనే నేను సంతోషంగా ఉండగలను'' ''సొంత ప్రొడక్షన్ హౌస్ ప్రారంభించాను. కానీ, అందులో డబ్బులు పోగొట్టుకున్నాను. దానిపై నిర్మించిన సినిమాలు అనుకున్న ఫలితాన్ని ఇవ్వలేదు. అలాగే, నేను నటించిన కొన్ని సినిమాలు విడుదల చేయడానికి నిర్మాతలు ఇబ్బందిపడుతుంటే నా రెమ్యునరేషన్ వదులుకున్నా. ఏం చేసినా నా చుట్టూ ఉండేవాళ్ల కోసమే చేస్తాను. అలా చేయడంలోనే నాకు నిజమైన తృప్తి ఉంటుంది'' అని విజయ్ సేతుపతి తెలిపారు. 'గాంధీ టాక్స్ గురించి మాట్లాడుతూ.. ఈ సినిమాను ప్రారంభించినప్పుడు ఫలితం విషయంలో చిత్రబృందం చాలా ఆందోళనకు గురైందని.. కానీ, ఇటీవల కొంతమంది ప్రముఖులకు స్క్రీనింగ్ వేశాక టీమ్ భయమంతా పోయిందని చెప్పారు. ఇది కచ్చితంగా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుందని అన్నారు.

ది రాజాసాబ్ నిర్మాతకు
అరుదైన గౌరవం

టాలీవుడ్ నిర్మాత టీజీ విశ్వప్రసాద్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఆయనకు బెంగాల్ గవర్నర్ ఎక్సలెన్స్ అవార్డ్ వరించింది. ఈ విషయాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. తాజాగా ఈ అవార్డ్‌ను నిర్మాత అందుకున్నారు. పశ్చిమ బెంగాల్ గవర్నర్ డాక్టర్ సీవీ ఆనంద బోస్ చేతుల మీదుగా తీసుకున్నారు.
కాగా.. టాలీవుడ్ ప్రముఖ నిర్మాతల్లో టీజీ విశ్వప్రసాద్ ఒకరు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేతగా ఉన్నారు. ఇటీవలే ఈ బ్యానర్‌లో ప్రభాస్ నటించిన ది రాజాసాబ్ సంక్రాంతి కానుకగా రిలీజైంది. మారుతి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది. అభిమానుల అంచనాలు ది రాజాసాబ్ అందుకోలేకపోయింది. ఈ చిత్రంలో మాళవిక మోహనన్, రిద్ధికుమార్, నిధి అగర్వాల్ హీరోయిన్లుగా నటించారు.

రాషా సింగింగ్‌కు ప్రభాస్ ఫిదా

ప్రముఖ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని గాయనిగా వెండితెరకు పరిచయమయ్యారు. ఆమె తన అరంగేట్రం చిత్రం 'లైకీ లైకా' కోసం పాడిన "ఛాప్ తిలక్" పాట తాజాగా విడుదలైంది. జీ మ్యూజిక్ విడుదల చేసిన ఈ మ్యూజిక్ వీడియోలో రాషా గాత్రం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. సౌరభ్ గుప్తా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని భావనా తల్వార్, రాఘవ్ గుప్తా సంయుక్తంగా నిర్మిస్తున్నారు.రాషా గానంపై పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రశంసల జల్లు కురిపించారు. "రాషా, నీ సింగింగ్ డెబ్యూ చాలా బాగుంది. 'ఛాప్ తిలక్' పాటలో నీ పెర్ఫార్మెన్స్ ఎంతో నిజాయితీగా, మనసును హత్తుకునేలా ఉంది. ఆల్ ది బెస్ట్" అంటూ తన సోషల్ మీడియా వేదికగా కొనియాడారు. ప్రభాస్ చేసిన ఈ పోస్ట్‌ను రాషా రీషేర్ చేస్తూ, "ప్రభాస్ సార్.. మీకు ఎప్పటికీ రుణపడి ఉంటాను" అంటూ తన కృతజ్ఞతను చాటుకున్నారు. కెరీర్ పరంగా రాషా ప్రస్తుతం అజయ్ దేవగణ్ మేనల్లుడు అమన్ దేవగణ్‌తో కలిసి 'ఆజాద్' చిత్రంతో నటిగా పరిచయమవుతున్న ఆమె.. ఇప్పుడు టాలీవుడ్‌లోకి కూడా అడుగుపెడుతున్నారు. 'RX100' ఫేమ్ అజయ్ భూపతి దర్శకత్వంలో, మహేష్ బాబు మేనల్లుడు జయకృష్ణ సరసన 'శ్రీనివాస మంగాపురం' చిత్రంలో ఆమె హీరోయిన్‌గా నటిస్తున్నారు.

విశ్వంభర మళ్లీ వాయిదా?

'భోళా శంకర్' డిజాస్టర్ తర్వాత మెగాస్టార్ చిరంజీవి మొదలుపెట్టిన సినిమా 'విశ్వంభర'నే. 2025 సంక్రాంతి టార్గెట్‌గా ఈ సినిమాను మొదలుపెట్టారు. చకచకా షూటింగ్ కూడా పూర్తి చేశారు. మేకింగ్ దశలో ఈ సినిమాకు మంచి హైప్ వచ్చింది కూడా. కానీ టీజర్ రిలీజ్ చేశాక అంతా మారిపోయింది. సబ్‌స్టాండర్డ్ విజువల్స్, ఎఫెక్ట్స్ కారణంగా సోషల్ మీడియాలో బాగా ట్రోలింగ్ జరిగింది. టీం ఆత్మరక్షణలో పడిపోయింది. దీంతో రిలీజ్ వాయిదా వేసి.. విజువల్ ఎఫెక్ట్స్ మీద మళ్లీ పని చేయడం మొదలుపెట్టింది టీం. ఇలా వీఎఫెక్స్ మీద రీవర్క్ చేయడం మొదలుపెట్టి ఏడాది దాటిపోయింది. చాలా నెలల పాటు అసలు టీం నుంచి ఏ అప్‌డేట్ కూడా లేదు. ఐతే గత ఏడాది అందరిలోనూ అయోమయం నెలకొన్న సమయంలో టీం ఒక స్పష్టతనిచ్చింది.చిరు తర్వాత మొదలుపెట్టిన 'మన శంకర వరప్రసాద్' చిత్రానికి సైడ్ ఇస్తూ.. తమ సినిమాను 2026 వేసవికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఇక అప్పట్నుంచి మెగా ఫ్యాన్స్ ఈ సినిమాను పక్కన పెట్టి 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం మీద ఫోకస్ చేశారు. ఈ సినిమాకు మంచి హైప్ వచ్చింది. సంక్రాంతికి రిలీజైన ఈ చిత్రం భారీ విజయాన్నీ అందుకుంది. ఆ తర్వాత 'విశ్వంభర' అప్‌డేట్ కోసం ఎదురు చూస్తున్నారు ఫ్యాన్స్. చెప్పిన ప్రకారమే వేసవిలో సినిమా రిలీజవుతుందని ఆశిస్తుంటే.. ఇప్పుడు మళ్లీ జులై 10 అంటూ కొత్త డేట్ తెరపైకి వచ్చింది.దీంతో మళ్లీ మాట తప్పడం ఏంటి.. వేసవి లాంటి క్రేజీ సీజన్‌ను ఎందుకు వదిలేస్తున్నారు.. ఇలా మళ్లీ మళ్లీ వాయిదా వేస్తే సినిమాకు హైప్ మరింత తగ్గిపోదా.. ఇప్పటికీ సినిమా మీద టీంకు గురి కుదరలేదా.. వీఎఫెక్స్ మీద మళ్లీ పని చేసినా ఔట్ పుట్ మెరుగుపడలేదా.. అని రకరకాల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు అభిమానులు. ఈసారి మళ్లీ వాయిదా వేయడానికి కారణమేంటో చెప్పడమో.. లేదంటే కొత్త రిలీజ్ డేట్ ప్రకటిస్తూ ఒక మంచి గ్లింప్స్ రిలీజ్ చేసి మళ్లీ కాన్ఫిడెన్స్ నింపడమో చేయాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200